# ఆంధ్రసచిత్రవారపత్రిక



18-7-75
60 పైసలు

# సినీ బొమ్మ కొలువు




"పూజ" లో ఒక దృశ్యం



"బలిపీఠం" లో ...

"చీకటి వెలుగులు" లో ...




గంగాధర్
నటరత్న, పద్మశ్రీ
యన్.టి. రామారావు సమర్పించు
గజలక్ష్మి చిత్రవారి
అన్నదమ్ముల అనుబంధం
ఈస్ట్‌మన్ కలర్
దర్శకత్వం: యస్.డి.లాల్
నిర్వహణ: ఎమ్. పీతాంబరం
కెమెరా: శేఖర్-సింగ్
సంగీతం: చక్రవర్తి
మాటలు: గొల్లపూడి
ఆంధ్ర: పూర్ణ
స్లైడ్స్: నటేష్ ఫిలిం ఎక్స్చేంజ్
మైసూరు: సుధా-చిత్ర
ARIES

# రచయితలకు విజ్ఞప్తి

వ్యక్తుల పేర మీ రచనలు పంపితే వాటి పరిశీలనలో ఆలస్యం జరిగే ప్రమాదాలెక్కువ కనుక మీ రచనలన్నీ కూడా శీర్షిక పేరు కవరుపైన లేదా కార్డుపైన ఉదాహరిస్తూ సంపాదకుడు, ఆంధ్ర పత్రిక వారపత్రిక గాంధీనగరం, విజయవాడ 520003 అన్న చిరునామాకి పంపండి. —సం.



# ఉత్తరాలు

## సీరియల్

"ఈ సంఘంలో కుటుంబమే ఇది" సీరియల్ కథ ప్రస్తుత సమాజాన్ని కళ్లకు కట్టినట్లు వ్రాసిన 'అన్నపూర్ణ'గారికి యింతటి చక్కటి నవల (సీరియల్ కథ) అందిస్తున్న మీకు అభినందనలు తెల్పక ఉండలేను.

ఎస్. టి. రహమతుల్లా (కడప)

* * *

"ఈ సంఘంలో కుటుంబమే ఇది" సీరియల్ చాల బాగుంటున్నది. తండ్రి ఇంటి బాధ్యత తీసుకొనకపోతే సంతానము ఏ రకముగా తయారవుతోందీ ఈ కథ బాగుగా నిరూపించుచున్నది.

ఇ. ఉదయకుమార్ (సాలంగి)

* * *

"ఈ సంఘంలో కుటుంబమే యిది" అన్నపూర్ణ' గారి సీరియల్ ప్రతివారం మమ్మల్ని సస్పెన్సులో ముంచెత్తుతోంది.

గుండారపు అప్పారావు (దార్లపూడి)

* * *

4.7.75సంచికలో "అమ్మమ్మ కాశీ యాత్ర" "పాపమొకరిది శిక్ష ఇంకొకరిది" కథలు చాల బాగున్నాయి. కార్టూన్లు తమాషాగా ఉంటున్నాయి!

ఎల్. రాజరాజేశ్వరి (విజయవాడ)

* * *

ఎ. ఎస్. రామకృష్ణశర్మగారి "నేను దొంగనా" అన్న పెద్ద కథ మమ్మల్ని ముగ్ధుల్ని చేసి వింగరా భాగం కోసం ఉవ్విళ్లు పూరింప చేస్తుంది. "బామ్మ కల" "రక్తం" "వో వరం కథ" అన్న కథలు బాగున్నాయి.

కె. కన్యాకుమారి, స్వరాజ్యలక్ష్మి (జగ్గయ్యపేట)

* * *

తేదీ 20—6—75 సంచికతో ముగిసిన పి. వి. ఆర్. శివకుమార్‌గారి 'శమంత—హేమంత' సీరియల్ పాత సీసాలో క్రొత్త సారా పోసినట్లుగానే ఉంది. సీరియల్‌ను ఆద్యంతము ఆణిముత్యముల్లాంటి మాటలతో, మరపురాని సంఘటనలతో మలుచుకుంటూ వచ్చి చివరకు హేమంత, ఆదిత్యల వివాహాన్ని జరిపించడంలో క్రొత్తదనమేమీ అగుపించలేదు. అలా జరగకుండా హేమంతను, ఆదిత్య తిరస్కరించినందుకుగానూ మరొకరితో వివాహం చేసుకొని మగవాడి మనోబలము, ఆడదాని పవిత్ర్యము ఎల్లప్పుడూ తూకం వేసుకుంటూ ఉంటాయన్న నిజాన్ని తెలిపి ఉండాల్సినది—ఎటొచ్చీ సీరియల్‌లోని మాటలు, మంచి సంఘటనలు మమ్మల్ని ఎంతో ఆకర్షించినా ముగింపు మాత్రం మాకు నచ్చలేదు.

చర్లకోల కృష్ణారెడ్డి, చర్లకోల శైలజ (ఆవంచ)

ఈ వారంతో 'శవుంత—హేమంత' పూర్తయింది. ముగింపు వూహించిందే. శకుంతపాత్ర చిత్రీకరణలో రచయిత చక్కని నైపుణ్యం చూపారు. కథా విషయం పాతదే అయినా కథలో సంభాషణలశైలి, చక్కగా వున్నది. కథలలో 'రక్తం', 'నో వరం కథ'లు బాగున్నవి. 'రక్తం' కథలో రాజయ్య వంటి వ్యక్తులను మనం చూస్తేవున్నా జోగులు వంటి ఉత్తముల్ని అరుదుగా చూస్తాము. జోగులు చంపకుండానే రాజయ్య పాపం పండింది. ఆ దృశ్యం జోగుల్ని మార్చివేయగా తన రక్తం ఇచ్చి కాపాడాడు రాజయ్యని. 'నో వరం కథ' పాపమా మాష్టారికి వరం అనుభవించే యోగం లేదు. మనుష్యుల వేషభాషను, ఉద్యోగ హోదాలను బట్టి పెర్మిట్ వంటి వరాల్ని షావుకార్లు ఇస్తుంటారు. మాష్టారువంటి మంచివారిని, ముక్కుసూటిగా పొట్లాడేవారని, న్యాయం కాపాడదు. సంఘంలో జరుగుతున్న విషయాన్ని యీ కథలో చిత్రీకరించారు.

వై. లక్ష్మి (విజయవాడ)

• • •

కథలల్లో "నేను దొంగనా" బాగుంది. మీ పత్రిక ఒక వారం "మిస్" అయిన గాని నాకు పిచ్చి పట్టినట్లు వుంటుందంటే నమ్మండి.

డి. రామసుబ్బారెడ్డి. (దుర్శి.)

## ఇంటింటి చిట్కాలు

చిట్కాలు పంపేటప్పుడు అవి పత్రికలో యీ మధ్యనే పడ్డాయేమో గమనించి మరీ పంపండి. మొదట మీరు చేసి చూసి, మంచి ఫలితాలు వస్తేనే తోటివారికి కూడా తవి కొస్తాయి కనుక అప్పుడు పత్రికకి రాయటం మంచిది కొత్త కొత్త చిట్కాలైతేనే పత్రికలో వేయటానికి వీలుంటుంది...కాని పాత చిట్కాలు ఏన్నిపంపినా 'వాడే' అవకాశాలుండవు. మీ 'చిట్కాలు' ప్రచురణకు తీసుకోకపోతే వాటిని తిప్పి పంపటం సాధ్యం కాదు. కనుక మీకు ఆ విషయం తెలియచేయటానికి వీలుగా స్వంత చిరునామా గల స్టాంపు అంటించిన కార్డు కూడా 'జత'చేయటం మంచిది. వేయటానికి తీసుకున్న చిట్కాలు వీలు వెంబడి వేసే అవకాశం హక్కు సంపాదకునిదై యున్నది కనుక ఉత్తరాలు రాయకండని మనవి. —సం.


# ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
( 1938  1972 )
శుక్రవారం : 18-7-'75
రాక్షసనామ సం. జ్యేష్ఠమాస శు. దశమి
సంపుటము : 68 సంచిక : 44

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
★
సంవత్సర చందా - రు. 33-80 పై.
ఆరుమాసాల చందా - రు. 16-90 పై
విడిప్రతి వెల 60 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520003.


## విషయానుక్రమణిక



## హైదరాబాద్ నోట్ బుక్

శ్రీ వై. వి. రమణ

ఆస్తిక్యాన్ని అవగాహన చేసుకొని అంతరంగానికి హత్తించుకొని, తజ్జనిత మనో వికాసముతో జీవికను, జీవితాన్ని పరిమళింపజేసుకొని ఆ పరిమళాన్ని ఇతరులకూ పంచిపెడుతూ విద్యారంగంలో నలభైఏళ్ళు ఆదర్శప్రాయులైన ఆచార్యులుగా గడిపిన వారు మిత్రులు శ్రీ వై. వి. రమణ. దాదాపు మూడు దశాబ్దాలుగా ఆయన ఆస్తిక మానసికోన్నతిని వింటున్న నాకు, చూస్తున్న నాకు, ఇలాటివారు విద్యారంగంలో పది మంది వుంటే చాలు. విద్యార్థులంతా విద్యావినయ సాగరులు కారా! అనిపిస్తుంది. మొన్నటి సాధారణ సంవత్సరానికి అరవై యేళ్ళు నిండిన శ్రీ రమణ సాధారణ కుటుంబంలో పుట్టి, రాజకీయార్థిక శాస్త్రాలలో ఎం. ఎ. అయి, బి. ఇడి అయి, కాకినాడలోని పిఠాపురం రాజావారి కళాశాలలో రాజనీతి చరిత్రాచార్యులుగాను 1960 నుంచి తిరుపతి, ఢిల్లీ, బద్రుద్దీన్, భారతీయ విద్యాభవన్, ప్రగతి కళాశాలకు ప్రిన్సిపల్‌గా 1975 వరకు పనిచేసి ప్రాచీన భారతీయ చరిత్ర సంస్కృతి సాహిత్యాలలో మౌలిక పరిశోధనలు జరిపినా, 'టెక్స్ట్ బుక్ ఆఫ్ కల్చర్, ఆంధ్ర కల్చర్ ఎబ్రాడ్, వంటి గ్రంథాలు రచించినా, ప్రాచ్య విద్యల్పరిషత్తులలో పరిశోధనవ్యాసాలు పెక్కు చదివినా, ద్రాక్షారామ శాసనాలు పరిష్కరించి ప్రకటించినా, సంగకాలపు రాజనీతి వంటి గ్రంథాలు అనువదించినా, ఏప్పి నాడు ఆస్తికశిరోమణి శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు చేసిన ఉపదేశాలను నిరంతరం మననం చేసుకుంటూ ముందుకు పోతుంటారు కనుకనే 1974లో ఏకాగోలో జరిగిన దక్షిణ భారత మతాల కార్యగోష్ఠిలో ఆంధ్ర ప్రతినిధిగా పాల్గొని, అక్కడి వారికి తెలుగువారి వాస్తవ



## చుక్కలు

డా॥ దాశరథి

గగనంలో చుక్కలకు
కన్నీటి చుక్కలకు
కల సంబంధం తెలుసుకోవడం
కాదు, కాదు అనుకున్నంత సులభం

గగనంలో చుక్క
గాఢాంధకారంలో మెరుస్తుంది;
మార్తాండుని మహా తేజస్సులో
మరుగు పడిపోతుంది
కన్నీటిచుక్క

కడగండ్ల వడగండ్లలో మొలుస్తుంది;
నవ్వుల పువ్వుల మీద
నవహిమ బిందువులా
నిలుస్తుంది;

నిద్రా మంజూషికలో
భద్రంగా శయిస్తుంది;

శుక్తిలో గల
ముక్తాఫలం కన్న
అశులలో గల
అశ్రుజలం మిన్న
అందాల రాణి నయనాలు చిందే
అశ్రుబిందు బృందానికి వందే!

సంస్కృతిని, ఆస్తికతను వివరించ గలిగారు. పురచాను, ఆయన 1948 లో జరిగిన ఆంధ్ర ఆస్తిక మహాసభకు అధ్యక్షత వహించారు. అమెరికాలో చాల చోట్ల భారతీయ సంస్కృతి ఆస్తికతలను గురించి గోష్ఠులు జరిపారు. అమెరికానుంచి ఆయన వచ్చినప్పుడు కలుసు కోగా "మన ఉపనిషత్తులన్నా, సంస్కృతి అన్నా అమెరికా వారు చెవి కోసుకొంటారు. నేను ఫిలడెల్ఫియాలో ఉండగా భారతీయ వేదాంత జిజ్ఞాసువులు ఎందరో నన్ను చుట్టు ముట్టారు. ఉపనిషత్తులను గురించి, భగవద్గీతను గురించి చెప్పమన్నారు. వారికి తులనాత్మక దృష్టితో చెప్పవలసి ఉంది."అన్నారు. చరిత్ర, సంస్కృతి, వేదాంత సాంఖ్యాది శాస్త్రాలలో నిష్ణాతులైన శ్రీ రమణ జ్ఞానం దేశానికి ఎంతో ఉపయోగ పడేట్టు చూడడం తెలుగువారి కర్తవ్యం.

### స్వరవల్లరి

ఆచార్య తిరుమల రచించిన 'స్వరవల్లరి' గీత సంపుటి అంకితావిష్కరణోత్సవాన్ని జూన్ 23 న రవీంద్రభారతిలో తిలకించిన ఏ సహృదయునికైనా "పార్యే గేయేచమధురం" అయిన వస్తువు అబాలవృద్ధం. పరవశులను చేస్తుందనడం మరొక మారు గ్రహించి ఆనంద పరవశులు కాక తప్పదు. కృతి స్వీకరించిన ప్రముఖ న్యాయవాది, సంగీత సాహిత్యవేది శ్రీ కోకా రాఘవరావు అన్నట్టు, ఆచార్యతిరుమల వయస్సులో పిన్నవారైనా, వారి గీతాలు సహృదయు హృదయపేటికలలో మధుర స్మృతులతో పాటు భద్రపరచుకోదగినవి. 40 గీతాలు వున్న ఈ స్వరవల్లరిని సమీక్షించిన లలిత సంగీతా చార్యులు శ్రీ పింగుమిల్లి విశ్వనాథం అన్నట్లు

## హైదరాబాద్ నోట్ బుక్

కవి మేధ, మనస్సు ఏకోన్ముఖమయినప్పుడే మంచి ఫలితాలిస్తుందనడానికి దీనిలోని చాల పాటలు తార్కాణం.

శ్రీ పి. వి. సాయిబాబా, శ్రీ వి. మురళీ కృష్ణ స్వర రచనతో దీనిలోని కొన్ని గీతాలను పలువురు బాలబాలికలు యువతీ యువకులు గానం చేసి ఆనందింపజేశారు. "మన మంతా ఒకటే" అన్న గీతం చిరంజీవిని కె. గీత (నారాయణగూడ బాలికల పాఠశాల విద్యార్థిని)మున్నగు మురళీకృష్ణ బృందం కంఠమాధుర్యంతో మరింత ఆనందం కలిగించింది.

### శ్రీ రాజమల్లు సలహా

ఆరోగ్యశాఖామంత్రి శ్రీ కె. రాజమల్లు జూన్ 22 న సాధూరాం నేత్ర వైద్యశాలలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తూ, భారత దేశం జనాభాలో 80 శాతం ప్రజలు గ్రామ సీమలలోనే నివసిస్తున్నారని, వారికి దేశంలోని డాక్టర్లలో 20 శాతమే సేవ చేస్తున్నారని, ఈ దుస్థితి తొలగించడానికి డాక్టర్లు ముఖ్యంగా లేడీ డాక్టర్లు గ్రామ సీమలలో సేవ చేయడానికి ముందంజ వేయాలని సలహా ఇవ్వడం చాల మంచిదే. కాని ప్రస్తుతం మన పట్టణాల లోని ఆస్పత్రుల పరిస్థితే అంతంత మాత్రంగా వున్నప్పుడు, గ్రామ సీమల ఆస్పత్రుల సంగతి చెప్పనక్కరలేదు. వైద్యులతో పాటు మందులు, ఆధునిక పరికరాలు గ్రామ సీమలకు వెళ్ళినప్పుడే వారి సేవ సుళభము సార్థకమూ అవుతుంది.

### ఐ. డి. పి. ఎల్ కాలనీ

ఐ. డి. పి. ఎల్. కాలనీ లోని వారికి తెలుగుభాషా సాహిత్యాల పట్ల అభిరుచి కలిగించ డానికై ఏర్పడిన సాహితీ సాంస్కృతిక యువ సమాఖ్య జూన్ 15 వ తేదీన ఎస్. డి. ఆర్. సి. ఆడిటోరియంలో ఆధునిక తెలుగు సాహిత్యం పై జరిపిన గోష్ఠిలో అధ్యక్షత వహించిన తిరుమల రామచంద్ర సాహిత్య సమీక్ష చేశారు. డాక్టర్ అక్కిరాజు రమాపతిరావు వీరేశలింగం సంస్కరణో ద్యమం గురించి శ్రీ కె. శివారెడ్డి విప్లవకవితో ద్యమం గురించి శ్రీ పాలకోడేటి సత్యనారాయణ తెలుగు నవలను గురించి, శ్రీ సీతారామయ్య గురజాడ వ్యవహార భాషోద్యమం గురించి ప్రసం గించిన మీదట, శ్రీయుతులు చారి, రాజిరెడ్డి, సుధాకర్ నీల్, పి. ఎస్. ఎన్. రాజా,మున్నగు వారు కవితాగానం చేశారు.

### కొత్త విశ్వ విద్యాలయం :

నాగార్జున, కాకతీయ విశ్వవిద్యాలయాలు త్వరలో నెలకొననున్నవని విద్యా మంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావు జూన్ 17న మరొక మాటు అనడం బట్టి ఈ విద్యా సంవత్సరానికి ఆ రెండూ ఏర్పడుతాయనడం స్పష్టం. విశ్వ విద్యాలయాలు నిర్వహణ, అందులోను నూతన విశ్వవిద్యాలయాల నిర్వహణ ఎంత కష్టమో చెప్పనక్కరలేదు. విద్యార్థుల అదృష్టమా అని శ్రీ జగన్మోహనరెడ్డి వంటి సమర్థుడు రాబట్టి ఉస్మానియా విశ్వవిద్యాలయం చక్కబడే దోవను ఎక్కింది. కనుక కొత్త విశ్వవిద్యాలయాలకు కుల పతి కాగలవారు సమర్థ పరిపాలకుడు, దేశ విఖ్యాత విద్యావంతుడు అయిఉండడం అవసరం. వరంగల్ గుంటూరు స్నాతకోత్తర కేంద్రాలను ప్రారంభ దశలో చక్కగా నిర్వహించి, అవినీతికి దూరముగా, నీతికి దగ్గరగా చేసిన ప్రత్యేకాధికారుల ప్రిన్సిపాలుల, సమర్థతను అర్హతను కూడ ఈ సందర్భంలో ముఖ్య మంత్రి, విద్యామంత్రి తదితర, తత్సంబంధ అధికారులు పరిశీలించడం,అవసరం. గొప్ప విద్వాంసుడు, కులపతి అయితే విద్యార్థులు గౌరవిస్తారు. కరుకైన పరిపాలకుడయితే భయ పడుతారు. ఈ రెండు గుణాలూ కలవారయితే, అపరంజికి తావి అబ్బినట్టు, ఇలాటివారికి ఆంధ్ర ప్రదేశ్‌లో కరువు ఉందా? లేదనేనా అభిప్రాయం.

### ఉపశ్రుతి :

"ఏమిటండీ, విశాఖ రేవు పెద్ద నౌకల నిర్మాణానికి అనువు కాదంటూ శ్రీ శెట్టిగారన్నారేం?". అని ఒక విశాఖ నాయకుణ్ణి కదిలించాను. "ఆ! ఏమంటాడు పాపం! ఇవాళ ఇలాఅన్నాడు. రేపు మంగళూరు రేవు తప్ప మరొకటి ప్రపంచంలో గొప్పది లేదంటాడు." అన్నారు ఆయన.


—తిరుమల రామచంద్ర

హైదరాబాద్ సరోవరంలో కాఫీ తాగి టాంక్ బండ్ మీదుగా నడుస్తూ, "...పిచ్చి కుదిరితేగాని పెళ్లి గాదు-పెళ్ళయితేగాని పిచ్చి కుదరదన్నట్టు-ఉద్యోగం దొరికితేగాని నా పెళ్ళి జేయనంటారు నాన్న-నాకేమో ముందు పెళ్ళి జేసికుంటే మంచి ఉద్యోగం తేలిగ్గా దొరుకుతుందనిపిస్తుంది ....." అంటూన్న నన్ను చారి అడ్డుకుని, "ఆవేశపడకురా రాజూ! నిదానంగా ఆలోచించి చూడు. మీ నాన్న అన్నదాంట్లో నాకు తప్పేమీ కనిపించడంలేదు......" అంటూ అనునయంగా చెప్పసాగాడు, "ఉద్యోగం దొరక్క ముందే నీవు పెళ్ళిజేసికుంటే నీ పరిస్థితి ఎలాగుంటుందో కాస్త ఆలోచించుకో-మీరిద్దరూ సినిమాకైనా, మరింకెక్కడికైనా వెళ్ళాలన్నా మీ నాన్నను డబ్బులడగాలి...అంతెందుకు ఆమెకు నీవు స్వతంత్రించి ఓ నాలుగణాల మల్లెపూలు కూడా కొనలేవు తెలుసా! పోనీ నా విషయం చూడరాదూ......"

"నేను నీ అంత అదృష్టవంతుణ్ణి కాదురా. నీకేం ఎంచక్కా చదువు పూర్తి చేసిన ఆర్నెల్లకే పెళ్లి-అందుకే నువ్వు ఎన్ని కబుర్లైనా చెబుతావు..." అసహనంగా అన్నాను. య్యేన మూడు నెలలకే ఉద్యోగం-అందులో

"వేడి వేడి కాఫీ తాగినందుకంత వాడిగా మాట్లాడకురా, తళతళా మెరుస్తున్న ఈ హుస్సేన్‌సాగర్ నీటిని చూసి, దానిపైనుండి వీస్తున్న చల్లని గాలిని అనుభవించైనా చల్లబడు" అంటూ నవ్వాడు చారి.

"నీకంతా నవ్వులాటగానే వుంటుంది! ఫస్ట్‌క్లాస్‌లో ఇంజనీరింగ్‌పాసైనా రెండేళ్ళుగా నిరుద్యోగిగా నేను పడుతున్న బాధ నీకు తెలియదు..." అంటూన్న నాతో, "అదికాదురా! నీ బాధను నేనర్థం చేసికోగలను-కానీ దీనికి



తోడు నీవిప్పుడు పెళ్ళి జేసికుంటే ఇంకొన్ని బాధలను కోరితెచ్చుకున్నట్లు అవుతుందేమో'' అన్నాడు చారి.

''పద—ముందా బెంచీ మీద కూర్చుందాం. నీకు చెప్పాల్సింది చాలావుంది'' అని వెళ్ళి అక్కడ కూర్చుని నా మనసులోని బాధనంతా చారికి చెప్పి చివరికి ''...ఇప్పుడు చెప్పు చారీ! నాకు నచ్చిన అమ్మాయిని వెతుక్కుని ఆ కృష్ణకాంత్, సుధాకర్‌లలా నా పని సాధించుకోవాలనుకోడం మంచిపని కాదా? రోజూ అన్ని రకాల పేపర్లూ తిరగేసి వాంటెడ్... వాంటెడ్ అని వున్న ప్రతి ప్రకటనను చదివి వాళ్ళడిగినట్లల్లా అన్ని ఫార్మాలిటీస్ పూర్తిచేసి అప్లైచేయడం—అందులో ఏవో కొన్నింటికి కొంతకాలానికి ఇంటర్‌వ్యూకాల్స్ వచ్చిచావడం...ఎప్పాయింట్‌మెంట్ ఆర్డర్స్ కొరకు ఎదురుచూడడం—అవి కాస్తా ఏ రికమెండేషన్ వాడికో దొరకడం ... ఛఛ ఈ జీవితంతో నేనెంతో విసిగిపోయాను...అందుకే నేనీప్రయత్నం చేస్తున్నాను ... గెలుస్తాననే నమ్మకం తప్పకుండా వుంది — నీ సాయం వుంటే..." అంటూ ఆగాను.

"తప్పకుండా రాజా! నువ్వడగడమూ నేను చేయకపోవడమునా!... నువ్వు ఉద్యోగం కొరకింత వర్రీ అవుతున్నప్పుడు ఇలాచేస్తే ఓ విధంగా బాగానే వుంటుందేమో. ఇంతకీ ఈ విషయంలో నావల్ల నీ కెలాటి సాయం కావాలి?"

"అదేరా! నాకు కోరికైతే వుందిగానీ దాన్ని తీర్చుకునే దారి ఏదో తెలీడం లేదు ... అంతకన్నా ఇంకేం చెప్పను"

చారి గ్రహించుకుని నవ్వుతూ, "ఔరా! అమ్మాయిలను, బజార్లో పెట్టి అమ్మరుగా... దానికేంగానీ రేపు ఆదివారమేగా! నువ్వు భోంచేసి పదిన్నరకల్లా మా యింటి కొచ్చేయి ... నీ సమస్యకో పరిష్కారం ఆలోచిస్తాను ఆలోగా ... " అంటూ వాచ్ చూసుకుని "వస్తాన్రా! రాధ నా కొరకు వెయిట్ చేస్తూంటుంది — ఓ చోటికి వెళ్ళాలని ప్రోగ్రాం వేసికున్నాంలే..."

"సారీ! మీ ప్రోగ్రామ్‌కు నావల్ల డిలే య్యిందేమో ... నీతో ఇంకాసేపు గడిపితే వదిన నన్నూ నిన్నూ కూడా తిడుతుందేమో ...వస్తా" అంటూ నవ్వి 'లిబర్టీ' వైపు నడిచాను!

ఆ మర్నాడు పదిన్నరకల్లా కోఠీలో దిగి చారి ఇంటికి వెళ్ళేసరికి, "రావోయి! నీ గురించే రాధతో చర్చిస్తున్నాను" అంటూ లోనికి ఆహ్వానించాడు.

రాధ నన్నుచూసి మందహాసం చేసింది!

నాక్కాస్త కోపం వచ్చింది; "ఏదో ఫ్రెండువికదా సాయం జేస్తావేమోనని నీకు చెబితే ఈ విషయం అందరికీ చెప్పేస్తావా" అనేశాను.

''అరె! అలా వస్తూనే కోప్పడకురా బాబూ! అలా సావకాశంగా కుర్చీలో కూర్చో. నీ విషయం అందరికీ ఎందుకు చెబుతాను? నాకు నేనై ఎంతగా తలను బద్దలు చేసికున్నా లాభం లేకపోవడంతో-ఏదో రచయిత్రీమణి అని పేరు తెచ్చుకుంది గదా నీ విషయంలో ఈవిడగారికి ఏదైనా ఐడియా తట్టకపోతుందా అని చెప్పాను" అంటూ ఆగాడు చారి.

"ఆ తర్వాత" ఆతృతగా ప్రశ్నించాను.

''ఆ తర్వాత జరిగింది చెప్పకోడం సిగ్గు చేటు... ఏదో ఫ్రెండువి కదా అని నీతో చెబుతున్నాననుకో..." చిలిపిగా రాధనో సారి చూసి చెప్పసాగాడు. "అప్పుడు ఈవిడ గారు, 'సరే! నేనలా సోఫాలో కూర్చుని మీ రాజా సమస్యా పరిష్కార మార్గం అన్వేషిస్తాను... ఆ లోగా మీరీ వంటపని ముగించేయండి' అంటూ చేతిలో వున్న పప్పుగరిటెను నాకిచ్చి"

"ఇంకా నయం! 'గరిటెతో ఒకటిచ్చి'... అనలేదు" అంటూ రాధ చారిని చురచురా చూసి, "అయినా మీ మాటలేం రాజా నమ్మడులెండి. అతనికి తెలుసు నేనెలాటి దాన్నో... కద రాజా!" అంది.

నేను జవాబు చెప్పేలోగానే చారి అందుకుని, "అవును వాడెందుకు నమ్ముతాడు! ఇతర్ల ముందెప్పుడు నువ్వు 'ఆదర్శ గృహిణి' పోజు పెడుతుంటావుగా..." అన్నాడు రాధను కవ్విస్తూ.

శృతిమించి రాగాన పడుతుందేమోనని నేను రాధతో, "అద్సరేగాని వదినా! నా విషయంలో మీ కేమైనా ఐడియా..." అంటూ అడుగబోయేసరికి...

''అదిసరే అంటే ఏమిటీ అర్థం? ఆయనన్నవన్నీ నిజమనేనా" అనేసింది రాధ తీవ్రంగా!

'ఇదేమిట్రా భగవంతుడా! పురుముఉరిమి మంగలం మీద పడ్డట్టు'...అనుకుని బిత్తరపోయాను.

"మా వాణ్ణలా హడల గొట్టకు రాధా! 'ప్రఖ్యాత రచయిత్రి శ్రీమతి అనూరాధ నిజంగానే ఒక ఆదర్శ గృహిణి!' అని పేపర్లో రేపొక స్టేట్‌మెంట్ ఇచ్చేస్తారు గాని...వాడి సమస్యను తీర్చడానికి నీవు వేసిన ప్లాను చెప్పేయి..." అన్నాడు చారి,

"రాజా! నీ కెలాటి అమ్మాయి కావాలో నువ్వు ముందే నిర్ణయించుకుని పేపర్లో ఓ ప్రకటన వేయించేయి" అంది.

"అంటే! మీరనేదేమిటి! మేట్రిమోనియల్ కాలమ్‌లో..."

"అబ్బే! అది కాదురా! నీవు ఉద్యోగం కొరకెన్ని పాట్లు పడ్డావో— పడుతున్నావో చెప్పేసరికి ఈ రచయిత్రి గారి బుర్రలో చటుక్కున ఓ ఆలోచన తట్టిందట..." కొంటెగా అంటున్న చారితో.

"అబ్బబ్బ! కాస్సేపు మీరూరుకుంటురూ" అంటూ నా వంక చూస్తూ, 'మేట్రిమోనియల్ కాలమ్‌లో వేయించడం కన్నా పెద్ద అక్షరాలతో... పెద్ద ఐటెమ్‌లు 'వాంటెడ్...వాంటెడ్'అని వేస్తున్నట్టుగా...వేస్తే బావుంటుందికదా."

"బాగనే వుంటుంది కానీ కేవలం దానికే చాలా డబ్బు ఖర్చైపోతుందేమో..." అన్నాను.

**కండరాలను కూడా మార్చవచ్చు!**

సోవియట్ వైద్యుడు అలెగ్జాండర్ స్తుదిత్‌స్కీ, జంతువులలో కండరాల మార్పిడి చేయవచ్చునని తెలుసుకున్నారు.

శరీరంలో గాయపడిన, సరిగా అభివృద్ధి చెందని అవయవాలను, కండరాలను, శస్త్ర చికిత్స ద్వారా మార్పిడిచేసి పునరుద్ధరించడమనేది ఎక్కువగా ఆచరణలో పెట బడుతోంది. చర్మము, ఎముకలు, రక్తనాళాల భాగాలు మొదలయినవి మార్పిడి చేయబడుతున్నాయి. అయితే కండరాలను మార్పిడి చేయడం సాధ్యం కాదని ఇటీవల వరకూ భావించబడుతూ వుంది ఇప్పుడది సాధ్యమేనని, అలా అతికించబడిన కొత్త కండరం మామూలుగానే పని చేయగలదని స్తుదిత్‌స్కీ రుజువు చేశారు.

## ●●●●అవనిలో అతివల ప్రజ్ఞ!

### ప్రపంచం!

★ కొత్తగా సిగరెట్లు కాల్చడం అలవాటు చేసుకుంటున్న యువతరంలో అమ్మాయిలదే అగ్ర తాంబూలం అని విదేశాలలో జరిగిన పరిశీలనలో తేలింది!

### భారత్

★ భారత్‌లో అతి కష్టమైన పరీక్షలలో ఒకటైన ఐ. ఏ. యస్. కి గత సెప్టెంబరు, నవంబరు నెలల మధ్య జరిగిన పరీక్షలలో 154 మంది పాస్ అయారు. వారందరిలో కిరణ్ బతురా అనే అమ్మాయి ప్రథమురాలుగా వచ్చింది. ఈ అమ్మాయికాక మరి 25 మంది అమ్మాయిలుకూడా ఉత్తీర్ణులయ్యారు.

### ఒక గ్రామంలో

★ ఊళ్లోని మగవారంతా పెళ్లికి పట్నానికి వెళ్లగా, సాయుధులైన 12 మంది దొంగలు మధురకు సమీపానగల ఒక ఊరుమీద పడ్డారు. అక్కడి స్త్రీలంతా ముందు కంగారుపడినా, అందులో ఒకామె ఒక దొంగను పట్టుకొంది. ఇంకొక ఆమె అతడిని కొట్టి చంపేసింది (కత్తిపీటతో కాబోలు!) దాంతో మిగిలిన దొంగలు హడిలిపోయి, ఆయుధాల్ని పారేసి, పారిపోయారు!

### చైనా, జపాన్

★ జపాన్ గృహిణి శ్రీమతి జంకోతాబే (36 సం.) ప్రపంచంలో అతి క్లిష్టమైన, ఎత్తైన పర్వత శిఖరం ఎవరెస్టుమీద పాదంమోపిన ప్రథమ మహిళ అయింది. మరి 11 రోజుల తరువాత చైనావారు తమ ఆడపడుచు శ్రీమతి ఫాన్‌దాగ్ ఎనిమిదిమంది పురుషులతో ఆ శిఖరాన్ని ఎక్కినట్టు ప్రకటించారు. ఈ చైనావారు శిఖరాన్ని ఉత్తరదిక్కునుండి ఎక్కారనీ, ఇలా కష్టతరమైన ఉత్తర దిక్కునుండి ఎక్కిన ప్రథమ మహిళ ఫాన్‌దాగ్ అనికూడా చైనావారు ప్రకటించారు!

### ఒక స్కూల్లో

★ హైదరాబాద్ (పాకిస్తాన్) లో ఒక గవర్నమెంటు బాలికల కాలేజీకి చెందిన 80 మంది బాలికలు 2 గంటలపాటు, హోరా హోరీని చేతులు నొప్పి పెట్టేవరకు ప్రిన్సిపాల్ గదిమీదకు రాళ్లు రువ్వి, ఫర్నిచర్‌ను విరగగొట్టేశారు.

కారణం? విద్యార్థినీ సంఘ ఎన్నికలు!

### ఒక దాంపత్యంలో

★ నవ దంపతులు ఒసామియా గ్రామంనుండి తరలి వెళుతున్నారు. దారిలో బందిపోటు దొంగలు అడ్డగించి, పెళ్లికొడుకు కాళ్లు చేతులు కట్టేశారు. బంధువులంతా పారిపోగా, పెళ్లికూతురు—అచ్చం సినిమాలోలా—దొంగలతో స్నేహం నటించి, వారి తుపాకీ లాక్కొని గాలిలోకి పేల్చగానే దొంగలు పారిపోయారు. భర్త కట్లువిప్పి, ఇంచక్కా ఝాం అని అత్తవారింటిలో అడుగుపెట్టింది పెళ్లికూతురు.

—బి. శ్రీదేవి

అంతర్జాతీయ మహిళల సంవత్సరం ●●●●●●●

## వధువు కావలెను!

"దానికేం ఫర్వాలేదు. నీవు దాని గురించేం ఖర్చుపెట్ట నవసరం లేదు ..." అంటూన్న రాధతో, "నాకు మీవద్దనుండి తీసికోడం కూడా యిష్టంలేదు" అన్నాను సీరియస్‌గా.

"ఐ పిటీ యూ రాజా! నీ పెళ్ళి ప్రకటన కొరకు రాధ డబ్బు ఇస్తుందనుకున్నావా! అసలు తన నవలలకు, కథలకు వస్తున్న డబ్బు నాక్కూడా ఇవ్వదే ... ..." రాధ తనను కోపంగా చూట్టంతో ఆపేశాడు చారి!

"నువ్వు ప్రతిసారి ఉద్యోగాల కొరకు అప్లై చేస్తున్నప్పుడు ఐదు రూపాయలో పది రూపాయలో పోస్టల్ ఆర్డరుకూడా జత పరుస్తావుగా ..." అంది రాధ నాతో.

నాకేమీ అర్థం కాలేదు! 'దానికీ దీనికీ ఏం సంబంధం?" అడిగాను.

"అదికాదు రాజా! ఉద్యోగాల ప్రకటన లాగే వేయదల్చుకున్నాం గాబట్టి దాన్లో వారేవేమి కోరుతారో అలాటివే మనమూ కోరాలి ... అంటే మన ఈ ప్రకటనలోకూడా '...అభ్యర్థులందరూ పదిరూపాయల పోస్టల్ ఆర్డర్ జతపర్చాలి. ఒక ఫుల్ సైజ్ ఫోటో ఒక పాస్‌పోర్ట్ సైజ్ బస్టుఫోటో వాటిపై అభ్యర్థుల సంతకాలతో సహా పంపాలి ...' వగైరా వగైరా నిబంధనలన్నీ మనమూ పెడదాం" అంది రాధ.

"మరి ఎస్.సి. అండ్ ఎస్.టి. అభ్యర్థులకు అన్ని జాబ్స్‌లో రిజర్వేషన్ వున్నట్టే మన ఈ ప్రకటనలోను వుంచుదామా" కొంటెగా అడిగిన చారితో

"అవును వుంచుదాం ..." అంది రాధ!

"అవునా రాజా! వాళ్ళను చేసుకుంటే నీకు ప్రభుత్వం ఓ గోల్డుమెడలు, కాస్త డబ్బు, పొలము, ట్రాన్సిష్టరు వగైరా వగైరాలెన్నో ఇస్తుంది! విష్ యు గుడ్‌లక్" అన్నాడు చారి చిలిపిగా!

గతుక్కుమన్నాను నేను! "కాని వదినా నాకు...నాకు..."

"నీకు ఎస్.సి. ఆర్ ఎస్.టి. అమ్మాయిని చేసికోడం ఇష్టం లేదంటావు అంతేనా... వీరిని తీసికోడాని కిష్టపడని కొన్ని కొన్ని కంపెనీలు 'రిజర్వ్‌డ్ కోటాలో తీసికోడానికి తగిన అర్హతలు గల ఎస్. సి., ఎస్. టి. అభ్యర్థులు దొరకని పక్షంలో ఆ పోస్టులకు ఇతర్లని కన్సిడర్ చేస్తాము' అనికూడా ప్రకటించేస్తారు ... మనముకూడా అలాగే చేద్దాం" అంది రాధ.


"ఏమిటి పోస్టులంటోంది రాధ. ఇంతకీ నీ వెందర్ని చేసికోదల్చుకున్నావురా? ఒకత్తెను చేసుకునే నేనిన్ని కష్టాలు పడుతూంటే మరి నీవెందర్ని చేసికొని ఇంకెన్ని కష్టాలు పడతావో గదా ప్చ్ ప్చ్" అని నామీద జాలిపడ్డాడు చారి.

"ఓ! అయామ్ సారీ! ఒకటే పోస్టని రాయాలి" అంది రాధ.

"మరి రాజా! నీ కెన్నేళ్ళ అనుభవమున్న అమ్మాయి కావాలి"

"కనీసం రెండేళ్ళు ..." అంటూ చీర చెరుగును నోటి కడ్డం పెట్టుకుంది రాధ!

"ఇలా పట్టపగలే మీరిద్దరూ ఒక్కటై


మీ పిల్లలకి కాల్షియం శాండోజ్
ఎందుకు ఇవ్వాలి ?

# వధువు కావలెను !

నన్ను ఫూల్‌ని చేయడం నాకు నచ్చలేదు..." అన్నాను చిర్నవ్వుతో.

"అప్పుడప్పుడు నువ్వు భలేగా జోకుతుంటావే! నవ్వమంటావా" అడిగాడు చారి.

ఇంతలో రాధ "సరే అయితే మన ప్రకటనలో 'అనుభవంలేని ఫ్రెష్ వాళ్ళు మాత్రమే అప్లై చేయాలి' అని కూడా ప్రకటిద్దాం" అంది

"మరి కులం, గోత్రం, రంగు, బరువు, ఎత్తు వగైరాల గురించి ఏం రాసే బావుంటుంది" అడిగాడు చారి

" 'వాటి గురించి పట్టింపులేమీ లేవు' అని రాద్దాము అంది రాధ

ఇక నే నూరుకోలేకపోయాను!

"వదినా! మీరు విశాల భావాలుగల ప్రఖ్యాత రచయిత్రీమణే గావచ్చు కానీ నేను సామాన్యుడిని. ఈ విషయాలపై నాకు పట్టింపుంది మీ ధోరణి చూస్తే నా కేమనుగునో, పాత చింతపండునో కట్టబెట్టే లాగున్నారు" అన్నాను ఆవేశంగా.

'నీ రెండేళ్ళ నిరుద్యోగ పర్వంలో నువ్వాప్టే గ్రహించినట్టు లేవు రాజా! ఏ ఉద్యోగ ప్రకటనలోను ఇలాటి విషయాలపై పట్టింపు వున్నట్లు ప్రకటించరు" చెప్పింది రాధ.

"కాని ఇది మామూలు ఉద్యోగ ప్రకటన కాదు నాక్కావలసిన వధువు కొరకు ప్రకటన" అన్నాను.

"ముందు నే చెప్పేది పూర్తిగా విను" అంటూ చెప్పసాగింది రాధ, "అలా ప్రకటించరుగానీ చాలాచోట్ల చివరికి ఆ తీసికునేవాడు కాస్త తన ప్రాంతపు మనిషినో, తనకులపు వాడినో తీసికుంటాడు గుట్టుచప్పుడు గాకుండా ... అలాగే నీవుకూడా..."

"అర్ధమైంది వదినా" అంటూ నవ్వాను ఆవిడ పరిశీలనా శక్తికి అబ్బురపడుతూ! ఇక ప్రతి పాయింటును చర్చించటం అనవసరమనిపించి, "మీ మీద నాకు పూర్తి నమ్మకముంది వదినా! అన్ని విషయాలు ఆలోచించి ప్రకటనను రాసి ప్రచురింప జేయండి" అని కాస్సేపు నాకిష్టమైన కొన్ని పాత హిందీ పాటలను వాళ్ల రికార్డ్ ప్లేయర్‌లో విని, చారికి బుల్‌బుల్ తరంగ్‌పై కొన్ని పాటలను వినిపించి—కాఫీ టిఫిన్ అక్కడే దట్టంగా పట్టించి ఇంటికి తిరిగివచ్చాను.


* * *

ఆ తర్వాత ఆదివారం మూడు ప్రముఖ దినపత్రికలలో ప్రచురింపబడిన 'ఆ' ప్రకటనను చదవగానే రాధ అందులో వయః పరిమితిని రాయడం మర్చిపోయినట్టు గమనించాను. రెండ్రోజుల తర్వాత చిక్కడపల్లిలో చారి కనిపించినప్పుడు 'స్వరాజ్ హోటల్'లో కత్నలోక్కెళ్లి కాఫీకి ఆర్డరిచ్చి రాధ ఆ ప్రకటనలో వయః పరిమితులను రాయడం మర్చిపోయిందని చెప్పగానే వాడు నవ్వేస్తూ "మరేం ఫర్వాలేదురా పెళ్ళీడుకున్న అమ్మాయిలు తప్ప ఇంకెవరు అప్లై చేస్తారు వాటికి" అనేశాడు. కాని ...

వచ్చిన అప్లికేషన్లను పరిశీలిద్దామని ఆ తర్వాతి ఆదివారం వాళ్లింటికి వెళ్లేసరికి తెల్లబోయాను! అప్పటికే వచ్చిన నలభైఏడు అప్లికేషన్లలోను ముప్ఫైమంది ముప్ఫై ఏళ్ళనుదాటినవారే! అందులో ఒకావిడకు 45 ఏళ్ళట! ఆవిడ రాసుకున్న వయస్సే 45 యైతే ఇక నిజమైన వయస్సెంతో! "అప్పుడే నీరు కారిపోకురా! అప్లికేషన్లు పంపుకోడానికి మనం పెట్టిన గడువు తీరడానికింకో వారముందిగా! గడువు తేదీ దగ్గర పడుతూన్నప్పుడు నువ్వెన్నెన్ని ఉద్యోగాలకు అప్లై చేశావో ఒక్కసారి గుర్తు తెచ్చుకో. అసలు సగభాగం అప్లికేషన్లు ఆఖరితేదికే వస్తాయి తెలుసా" అని ధైర్యం చెప్పాడు చారి.

వాడు చెప్పినట్టే ఆ తర్వాతి ఆదివారానికల్లా అంటే గడువు తీరిపోయిన మర్నాటికల్లా—వచ్చిన మొత్తం అప్లికేషన్ల సంఖ్య 147! ఆరోజు నేను రాగానే రాధ సంతోషంతో, "చూడు రాజా! పోస్టల్ ఆర్డర్ల మూలంగా మనకు 1470 రూపాయలొచ్చాయి!" అంది.

"అన్ని వచ్చాయని మురిసిపోతే చాలదు ... వాళ్లకు ఏయే రోజుల్లో పెళ్లి చూపులు ఏర్పాటు చేయాలో కూడా ఆలోచించాలి! మొత్తంమీద మనవాడు 147 సార్లు పెళ్ళి చూపుల కెళ్తాడు. ఆ తతంగం ముగిసేసరికి మన వాడికి ఈ 1470 రూపాయలు గాక తనే ఇంకో 1470 రూపాయలు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుందేమో!" అనేసరికి నేను తెల్లబోయాను! ఇంతవరకు నేనాకోణం




నుంచి ఆలోచించనే లేదు!

"వదినా! ఇప్పుడెలా?..." అన్నాను రాధతో ఖంగారుగా!

"రాజా! నీ వింతవరకు ఎన్ని ఉద్యోగాలకు అప్లై చేశావు. వాటిలో ఎన్నింటికి ఇంటర్వ్యూకాల్స్ వచ్చాయి" అడిగింది రాధ.

"సుమారు వంద ఉద్యోగాలకు అప్లై చేశాను...తొంభైకి పైగానే ఇంటర్వ్యూ కాల్స్ వచ్చాయి" అన్నాడు వెంటనే.

"మరి ఇంటర్వ్యూకి ఆయా కంపెనీలకు నీ వెళ్ళావా లేక ఆ కంపెనీ వాళ్ళే మీఇంటి కొచ్చి ఇంటర్వ్యూ చేశారా" అడిగింది గంభీరంగా!

ఆవిడ చెప్పదల్చుకున్న దేమిటో నాకు అర్థమైపోయింది.

"కాని! కంపెనీల వాళ్ళకైతే పెద్ద పెద్ద హాల్స్ వుంటాయిగాని మా ఇల్లు చిన్నదిగా! అందులో పదిమందికన్నా ఎక్కువ పట్టరు!!"

"ఆ విషయాల గురించి నీకు దిగు లెందుకు...ఇంటర్వ్యూ ఇక్కడే జరిపిద్దాము, రోజుకో పాతిక మందిని ఇంటర్వ్యూ చేస్తే ఓ వారానికల్లా మొదటి రౌండు పూర్తయ్యి పోతుంది..."

"మొదటి రౌండంటున్నావు? ఇంతకీ ఎన్ని రౌండ్లుంటాయి??" సరిగ్గా నే నడగాలను కున్న ప్రశ్ననే చారి అడిగాడు.

"అదంతా ఇప్పుడే చెప్పేస్తే ఎలా! అంతా ఓ నెలలోగా తేల్చేస్తాను. ఎటొచ్చీ మీరిద్దరూ కాస్త నే చెప్పిన రోజుల్లో ఇక్కడే వుండిపోవాలి" అంది రాధ

ఇద్దరం వెంటనే ఒప్పుకున్నాం! ఒప్పుకోక ఇంకేం చేస్తాం! నాకేమో వేరే ఏ ఉద్యోగము లేదాయె! చారికేమో లెక్చరర్ ఉద్యోగం వున్నా వాడు పనిచేసే కాలేజీ విద్యార్థులు తమ కాలేజీ గోడలకు పసుపురంగులో సున్నం కొట్ట కూడదనీ తెల్లరంగులోనే కొట్టాలని ఒక పార్టీ, నీలిరంగులోనే కొట్టాలని మరొక పార్టీ తీవ్రంగా పట్టుపట్టి సమ్మె మొదలు పెట్టి కాలేజీని మూయించేశారు. ఆ సమ్మె తీవ్రరూపం దాల్చి కమిటీలపై కమిటీలు ఏర్పడి ఆ సమ్మెను విరమింపజేయడానికి తేలిగ్గా ఇంకో రెండు నెలలన్నా పడతాయి! అందాకా చారికేం పనివుంది? మేమిద్దరమూ ఏ పని చేయకున్నా వాడికి జీతం వస్తుంది. నాకు రాదు. అంతే తేడా!

పది రోజుల తర్వాత రోజా చారి మా ఇంటికి వచ్చి నాతో, "రాజా! రేపట్నుండి వరుసగా ఆరు రోజులవరకు అమ్మాయిలను ఇంటర్వ్యూ చెయ్యాలి... కాబట్టి రోజూ పదింటికల్లా మా ఇంటికొచ్చేయ్" అన్నాడు.

ఆ మర్నాడు వెళ్ళి రాధతో, "వదినా! మీరు నిజంగా నాకోసం చాలా శ్రమ పడుతున్నారు. వీరందరికి తేదీల వారిగా కాల్స్ పంపడం, వీరికి కాఫీ, టిఫెన్లు ఏర్పాటు చేయడం...అబ్బా యిలా ఎన్నని చెప్పను..."

"ఇప్పుడేం చెప్పనక్కర్లేదుగానీ అంతా అయ్యాక ఒక్కసారే చెబుదువు గానిలే. కాస్త దర్జాగా వుండు మరి! ఈ ఆరు రోజులూ నువ్వు ఇంటర్వ్యూ కమిటీ మెంబరువి" అంది.

"కమిటీయా? ఇంకెవరున్నారు కమిటీలో?"

"మరేం ఖంగారు పడకు. నీవు, నేను, ఆయన మాత్రమే" నవ్వింది రాధ.

పదిన్నరకల్లా పదిహేనుమంది అమ్మాయిలు వచ్చేశారు.

ఆ పదిహేనుమందికి గ్రూప్ డిస్కషన్ పెట్టింది రాధ!

'పతినెలా సేవించాలి' అన్న విషయాన్ని అందరూ కలిసి చర్చించి ఓ గంట తర్వాత తేలిన సారాంశాన్ని తనకు రిపోర్టు చేయమంది.

ఓ రెండు నిమిషాల వరకు ఎవ్వరూ నోరెత్తలేదు. ఆ తర్వాత ఓ అమ్మాయి 'పతి కాళ్ళకు రోజూ దండం పెట్టాలి...'అంది. వెంటనే మరో అమ్మాయి, 'ఛట్! అది పాత కాలం పద్ధతి. పతి గడ్డాన్ని రోజూ షేవ్ చేస్తే సేవ చేసినంత పుణ్యం'అంది 'షేవింగ్ ఏ మంగలైనా చేస్తాడు చక్కగా వండి పెడితే చాలు'అంది పాకశాస్త్ర ప్రవీణురాలు(కాబోలు) ఇలా ఒకరు చెప్పింది కాదంటూ తాము చెప్పిందే రైటంటూ ఓ గంట గడిచే సరికి అంతా ఒకరి జుట్టు మరొకరు పట్టుకునే స్థితికి వచ్చారు! ఆ అల్లర్లో ఓ అమ్మాయి నవరంకూడా వూడిపోయింది!

ఓ గంటసేపు కొట్టుకున్నా కూడా వాళ్ళు పతినెలా సేవించాలో తేల్చుకోలేక పోయారు! ఆ మధ్యాహ్నం వచ్చిన పదిమంది అమ్మాయిల బాచ్ కూడా ఇలాగేచేసి నిరాశపరిచారు!

"ఈ వేళ వచ్చిన పాతిక మందిలో నీ కెవరైనా నచ్చారా రాజా!"అడిగింది హాస్యంగా.

ఆ వచ్చిన వాళ్ళంతా నా కన్నా పెద్ద వాళ్ళే! నేనేం జవాబు చెప్పాలి రాధకు!

"మన వాడికన్నా పెద్దవాళ్ళైన వారిని కూడా ఇంటర్వ్యూకి ఎందుకు పిలిచావు రాధా! వీళ్ళలో ఏ ఒక్కరూ రాజుకు తగరని తెలిసి కూడా ఇవాళంతా ఇలా ఎందుకు వేస్టు చేశావు?..."అడిగాడు చారి కాస్త సీరియస్‌గా!

"డిగ్రీ రాగానే మీకో వుద్యోగం దొరకడం వల్ల మీకు నిరుద్యోగుల మనస్తత్వం తెలీదు" అంటూ నా వంక తిరిగి, "నీ వప్లై చేసిన ప్రతిసారి 'వుద్యోగం వచ్చినా రాకున్నా కనీసం ఇంటర్వ్యూ కాలైనా వస్తే చాలు' అనుకునే వాడివి కదూ!..."అంది రాధ.

"మన మింకా నయం వదినా! కొన్ని కంపెనీలైతే తమ కంపెనీలోని వాడికి ప్రమోషన్‌పై ఆ తర్వాతి పోస్టు ఇవ్వాలని నిశ్చయించుకుని పత్రికల్లో ప్రకటనలు వేసి, వారాల తరబడి అందర్నీ ఇంటర్వ్యూ చేసి చివరికి

## వృత్రాసుర వృత్తాంతం



# ధర్మపథం

బులుసు వేంకట రమణయ్య

వెనుకటి పురాణ గాథలనుబట్టి ఇంద్రుడు మహాబలిష్ఠుడైన వృత్రాసురుణ్ణి చంప డానికి ఎంతో ప్రయత్నం చెయ్యవలసి వచ్చిందనీ, వృత్రుని పక్షీయులైన యాజకులు అతన్ని మోసగించి, యింద్రుని కనుకూల మైన రీతినే మంత్రాల నుచ్చరించి, అతనిని వధించడంలో ఇంద్రునికి తోడ్పడ్డారనీ తెలుస్తూ ఉన్నది.

తక్కిన గాథలలో వలెనే ఇందులో కూడా అంతరార్థ మున్నది.

ప్రకృతి సిద్ధాలై-ప్రజోపయుక్తా లయిన మహాపదార్థాలకు దేవత్వాన్ని ఆరోపించి, స్తుతించడం వేదకాలంనుంచీ వస్తూనే ఉన్నది. ఆ దేవతల ప్రతి ద్వంద్వులు దానవులుగా చెప్పబడేవారు కూడా.

ఈ వృత్రాసుర వృత్తాంతమున్నూ అట్టిదే! కథా రూపంలో ప్రకృతి విషయాలను గ్రంథస్థం చెయ్యడం మన ప్రాచీనుల పరిపాటి.

ప్రజల యీతి బాధలలో అనావృష్టి ఒకటి. వర్షాభావం వల్ల పంటలు పండవు. జనులు నీటికోసం తహతహలాడిపోతారు. ఈ అనావృష్టి నెలల సంఖ్యలోనే కాక ఏళ్ల సంఖ్యలో కూడా సంభవింపవచ్చును. అట్టి స్థితిలో ప్రజలు వర్షాధిదేవతయైన ఇంద్రుణ్ణి ప్రార్థిస్తారు. ఆయన వారిని అనుగ్రహించి, వర్షం కురిపిస్తాడు.

నీల మేఘాలు ఆకాశాన్ని ఆవరించి ఉన్నపుడు విద్యుదాఘాతంవల్ల అవి శిథిలాలయి, వర్షం ధారదారలుగా కురుస్తుంది. ఆ కారు మేఘాలే వృత్రాసురుని సూచిస్తాయి. విద్యుదాఘాతం ఇంద్రుడు వృత్రుని సంహరించ డానికి సూచకం. ఆ సంహారంవల్ల ప్రజలు ఆనందించారంటే ఎక్కువ వానలు కురిసి వారికి అధికమైన ఆనందం కలిగిందనీ, పంటలు పండి వారి కష్టాలు గట్టెక్కినవనీ భావించాలి. అంగిరసులు ఆ వర్షధారలను నేలపాలు పడేటట్లు చేస్తారట! అంటే ఇంద్రుని గురువైన బృహస్పతి ఈ వృత్ర సంహారానికి సలహా ఇచ్చి వుండవచ్చు

వర్షాలకోసం యాగాలు చెయ్యడం, మంత్రవేత్తలు జపాలు చెయ్యడం ఇప్పుడున్నూ ఉన్నది కదా! వాటి మూలంగా వర్షాలు కురియడం కూడా ప్రత్యక్ష నిదర్శనమే!

వృత్రాసుర సంహారం విరివిగా వర్షాలు కురిసి, జనం కరువునుంచి విడుదల పొంద డానికి సూచకమని చెప్పవలసి యున్నది

---

తమ కంపెనీ వాడికే ఆ పోస్టునిచ్చుకుంటారు" అన్నాను.

ఆ తరువాతి ఐదు రోజులూ కూడా వచ్చిన వారినిదే విషయంపై చర్చించమంది రాధ. ఓ అమ్మాయైతే "ఈ విషయంపైనే నిప్పటికే పది కథలు, రెండు నవలలు రాశాను. మీరు చదవలేదా!" అనేసింది. ఆ రోజు సాయంత్రం వారంతా వెళ్ళిపోయాక "నువ్వెవరినైనా చేసుకోగానీ ఆ రచయిత్రిని మాత్రం చేసికోకురా" అంటూ చారి చెప్పసాగాడు, "ఈ రచయిత్రిని నేను కున్నావనుకో రేపు నీ వామెను కోసంగా చూస్తే, వంటలో కారమెక్కువైందంటే ఇక చూసుకో నీమీద నీ దుష్టత్వం మీద వరుసగా పది కథలు రాసి పడేస్తుంది...కొంప తీసి ఎప్పుడైనా తిట్టావనుకో నిన్నే విలన్‌గా పెట్టి ఓనవలనే రాసేస్తుంది..స్వానుభవంపై చెబుతున్నా విను."

అప్పుడు రాధ మాకు నిజంగానే ఉప్పులేని పుప్పొ, చక్కెరలేని టీ ఇచ్చింది!

## వధువు కావలెను !

ఇంకో రోజున ఓ అమ్మాయి "అసలు పతిసేవేమిటి నాన్సెన్స్. తరతరాలుగా ఇలా చేసే మన స్త్రీలు పురుషులకు బానిసలై పోయారు! ఇకమీద స్త్రీ లోకమంతా మేల్కొని పురుషులచేత 'పత్నిసేవ' చేయించు కోవాలి!" అంది 'ఉమెన్స్ లిబ్' మీద ఆమె రాసిన పది వ్యాసాలు వివిధ ఆంగ్లపత్రికల్లో వచ్చాయని ఆ తర్వాత తెలిసింది!

ఇలా జరీ చీరలను, బంగారు గాజులను, టెరిలీన్ చీరలను, వెంకటగిరి గద్వాల్ వగైరా వగైరా చీరలను-పోనీ టెయిల్స్, పేరు సరిగ్గా తెలియని గోపురాల్లాటి ముడులను, సాధనా కట్‌లను, మూర్తులను, యుంగిలను, పరికిణీలను, స్లీవ్‌లెస్‌లను, ఏటకేలను, ఇంకా ఎన్నెన్నో కనిపించి కనిపించకుండాపున్న అందాలన్నింటినీ చూస్తుంటే ఇట్టే ఆరోజులూ గడిచిపోయాయి!

రెండో రౌండుకు అర్హులుగా కేవలం ముగ్గురమ్మాయిలు మాత్రమే మిగిలారు! ముగ్గురూ అందగత్తెలే! ముగ్గురూ గ్రాడ్యుయేట్లే! ముగ్గురి తండ్రులు 'పెద్ద పొజిషన్'లో వున్నవాళ్ళే! మరోవారం గడిచాక ఓ రోజున ఆ ముగ్గుర్ని పిలిపించి వారిచేత వంటచేయించి, బట్టలు ఉతికించి, ఇంకా ఇలాంటి బోల్డు పనులు చేయించింది రాధ. పాపం! ముగ్గురూ చెప్పిన పనులన్నీ చక్కగా చేశారు.

సాయంత్రం నాన్న చేసిన కాఫీ టిఫిన్లు సేవించాక ముగ్గుర్నీ అసలు విషయాన్ని సూటిగా అడిగింది రాధ.

"మీ ముగ్గురి తండ్రులు ఇంకొకరికి మంచి వుద్యోగం ఇప్పించే స్థితిలోనే వున్నారు గదా! మరి మీ కాబోయే శ్రీవారికి వారు ఉద్యోగం ఇప్పించగలరా?"

వెంటనే ఒకమ్మాయి ముఖం చిట్లించి, "ఛా! మానాన్న అలాంటివారు కాదండి. అధికార దుర్వినియోగం చేయడు..." అంది.

"నా కాబోయే శ్రీవారు తనంతతాను ఉద్యోగం సంపాదించుకోవాలి గాని మామగార్ని

అడిగి ఉద్యోగం వేయించుకోడం సిగ్గుచేటు కాదుటండీ! నాకలాంటిది ఇష్టముండదు" అనేసింది రెండో అమ్మాయి.

"అల్లుడికి ఉద్యోగంలేదంటే మానాన్నకు నామోషీ గదండీ! వెంటనే అతగాడికో మంచి ఉద్యోగం ఇప్పించేస్తాడు మా నాన్న" అంది మూడో అమ్మాయి గర్వంగా!

ముగ్గురమ్మాయిలూ వెళ్లిపోయాక, అధికార దుర్వినియోగం చేయడం ఇష్టపడని వాడి కూతురిగా పుట్టిన నేరానికి మొదటి అమ్మాయిని, మొగుడికుద్యోగం వేయించమని కన్నతండ్రిని అడుగనంత స్వాభిమానం వున్న నేరానికి రెండో అమ్మాయిని మూడోరౌండుకు అనర్హులుగా నిశ్చయం చేశాము!

ఇక మూడో రౌండుకు మిగిలిందా మూడో అమ్మాయి మాత్రమే గాబట్టి మూడ్రోజుల తర్వాత రాధ ఆ అమ్మాయిని పిలిచింది మా నిర్ణయం వినిపించడానికి.

"నీవు నాకు నచ్చావు..." అని అనడానికి సిగ్గుపడి చారి వైపు చూశాను— ఆ అమ్మాయికి మా నిర్ణయం వినిపించమన్నట్టుగా.

అప్పుడు చారి మందహాసంతో ఆ అమ్మాయిని చూస్తూ, "మీరు మాకు నచ్చారండీ" అంటూ ఏదో అనబోయేసరికి, "మీరు నాకు మరీ బాగా నచ్చారండీ. మీకిప్పుడు నిజంగా ఏ ఉద్యోగమూ లేకుండా వుంటే మన పెళ్లయ్యాక మీకోమంచి ఉద్యోగం వేయించేస్తాను. అన్నట్టు ... మీరు మా యింటికెప్పుడొస్తున్నారు అన్నయ్యగారూ...మీరు కూడా రావాలి అక్కయ్యా..." అంటూ నన్నాదరవూ అడిగేసరికి ముగ్గురమూ తెల్లబోయాము! మేమెందుకలాగయ్యామో తెలీక ఆ అమ్మాయీ తెల్లబోయింది.

# డాక్టర్ సలహాలు — డా॥ కె. వెంకటేశ్వరరావు

## టి ఎస్—అంభారీపేట

నాకు ఎంత అన్నము తినినను, నా శరీరము జబ్బు చేసినట్లు వుంటుంది. కాళ్లు చేతులు గుంజుతుంటాయి. ఎన్ని మందులు వాడినా ఫలితము కన్పించలేదు.

అన్నం తినటంలో—పరిమాణం ఎంత అన్నది లెఖ్ఖలోకి రాదు. "గంగిగోవు పాలు గరిటెడైనను చాలు" అన్నట్లుగా మన శరీరానికి కావలసిన పోషక పదార్థాలను తగు ప్రమాణంలో ఇవ్వగల ఆహార పదార్థాలు—మితంగా తిన్నా ఎక్కువ బలం చేకూరుతుంది.

నాగరికత వెర్రితలలు వేస్తూ, మన పాత సాంప్రదాయాలను (కనీసం— ఆహార విషయాలలో) తోసి పుచ్చుతున్న— "డబుల్ పాలిష్ బియ్యం"— ఒక మర్యాద చిహ్నంగా మారిన ఈ రోజుల్లో, మన ఇంట్లో దొరికే మునగాకు కన్నా, కిలోరూపాయికి కొని వేయించిన బంగాళా దుంపల కూర గృహస్థుని విలువ పెంచే ఈ రోజుల్లో— ప్రతివారూ, కాళ్లు పీకటం, 30 సం. కు ముసలివారులాగా కనబడటం, టానిక్‌ల మీద కు ఎగబాకటం, అవి ఫలించకపోతే నిరాశ, నిస్పృహ చెందటం జరుగుతున్నది. మీరు పైనాటి దృష్ట్యా ఆహార విషయాలకు తగిన శ్రద్ధ చూపండి.

## పి.ఎస్—కర్నూలు

మా అబ్బాయికి 6 వ నెల. ఆరోగ్యముగా వున్నాడు. కొన్ని రోజులనుండి బుగ్గలపై తెల్లని మచ్చలు కన్పించుచున్నవి. మచ్చలు రావటానికి కారణము, మందులు తెలియచేయండి.

6 నెలల పాపలను, ముద్దొచ్చేవారి చేష్టలను చూడాలని చూసి ఆనందించేవారు మనలో కొందరు మాత్రమే! ప్రతివారూ—ఆ పాపలను, చేతులలోకి తీసుకుని, తమ నోటిలోని లాలాజలమంతా పాపకు తగిలేలా ముద్దాడితే గాని వారికితృప్తిగా వుండదు. ఒక్కోసారి పాపను తీసుకుని ముద్దాడకపోతే, పాప తలిదండ్రులకు కోపంరావటం, వారే నిష్ఠూరంగా మాట్లాడటంకూడా నిజమే! మరి కొందరు, పిల్లలను గిల్లి ఏడిపించటం, ఎగురవేయటం చేసి ఆనందిస్తారు.

ఇలా 'లాలాజలం' (ఎంగిలి) పలువురిది పాప మృదువైన, చర్మం పైపడిన జలంలోని 'ఫంగస్' చర్మానికి ప్రవేశించటం వల్ల ఈ తెల్లమచ్చలు, బుగ్గల మీద ఏర్పడతాయి "కెనలాగ్—" —పై పూతకి, గ్రైసో ఎస్ రోజుకి 1 చెంచా 10 రోజులువాడండి.

## ఎమ్. ఆర్ — ఖమ్మం

నేను చాలా రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాను. దగ్గరిలో వున్న సర్జన్లకు చూపించాను. మందులు వాడినా తగ్గలేదు. ఆపరేషన్ చెయ్యాలన్నారు. ఆపరేషన్ చేయించుకుంటే ఏమైనా ప్రమాదమా?

కడుపులో నెప్పి అనేది దీర్ఘకాలంగా ఉంటూ వస్తున్నప్పుడు— మందుల ద్వారా తగ్గనపుడు శస్త్ర చికిత్స మాత్రమే శరణ్యం అవుతుంది. చంద్రుని మీద కాలూనిన మానవ వైజ్ఞానిక యుగంలో, వైద్య శాస్త్రం నానాటికి ముందంజ వేస్తున్న ప్రస్తుతపరిస్థితిలో, మీ కడుపునెప్పికి, ఆపరేషన్ చేయించుకోటం— ఏమంత ప్రమాదం కాదు. ఏదైనా మానవాతీత కారణాల వల్ల, అనాంతరం సంభవించితే తప్ప మామూలు పరిస్థితులలో ఈ శస్త్రచికిత్సవల్ల ప్రమాదం ఏర్పడటంజరుగదు.

## కె. వి. ఎల్—వైజాగ్


మా వారి వయస్సు 27 సం.లు. వివాహమై 2 సం.లు అయినది. వారికి కొంచము పొట్ట వచ్చినది. పొట్ట వచ్చినవాళ్లు బంగాళ దుంప, చిలకడదుంప తినకూడదని ఎవరో చెప్పారు. పొట్ట వచ్చిన వాళ్లు ఏమేమి తినకూడదో తెల్పండి

పొట్ట రావటానికి, మీరు వ్రాసిన దుంపలకి సంబంధం ఏమిటో తెలియక నా దుంప తెగుతోంది.

పొట్ట రావటానికి, కడుపు మీది కండరాల పటుత్వం తగ్గటం, కడుపు లోపల భాగంలో క్రొవ్వు పదార్థం చేరటం, ఇంకా మరికొన్ని కారణాలు.

దుంపకూరలు—పిండి పదార్థాలనుమాత్రమే ఎక్కువగా కలిగి ఉంటాయి. కాని శరీరంలోని కాలేయంలో ఈ పిండి పదార్థాలను క్రొవ్వుగా మార్చే అవకాశం ఉంది.

నూనె, నెయ్యి తగ్గించి, రోజూ రెండు పూటలా, 2 మైళ్లు నడిచి, ఆహారం పరిమాణం తగ్గిస్తే దానంతట అదే పోతుంది.



సీరియల్

# గాజుమేడ

—పోలాప్రగడ రాజ్యలక్ష్మి

*(గత సంచిక తరువాయి)*

"నాకు మర్యాదలేమిటండీ!" అంటూ వచ్చి తిన్నగా భద్రయ్య పక్కని ఆ కుక్కి మంచంపక్కమీదే కూర్చున్నాడు ప్రభాకరం.

"నిజమే నాయనా! మమత ఉన్న చోట మర్యాద అవసరంలేదు మీనాన్నకూడా ఇలాగే నే నంటే ఎంతో ఆప్యాయంగా ఉండేవాడు. అచ్చు మచ్చుఅతనిపద్ధతులే నీవన్నీ. ఏవిటో నువ్వుమెడిసన్ చదివి వస్తావు వస్తావుఅంటూ ఎంత సంబరపడిపోతూ ఆ బిల్డింగ్ కట్టించాడో తీరా నువ్వువచ్చి, ఉన్న ఊళ్ళో ఇలా ప్రాక్టీసు పెట్టుకోవడం కళ్ళతో చూసుకొనే యోగం లేకపోయింది అతనికి... ప్చ్..." భద్రయ్య చెబుతూన్న పాత జ్ఞాపకాలతో ప్రభాకరం ముఖం విషాదంగా మారిపోయింది. ఆత్మీయుడైన వ్యక్తి జ్ఞాపకంవచ్చి భద్రయ్య అసలే బాధగా కూర్చున్నాడు గంభీరంగాఉన్న ఆ సమయంలో ఏం చెయ్యాలో, ఎలా మాట్లాడాలో తెలియక తనూ మౌనంగానే ఉండిపోయాడు మురళి.

కాస్సేపటికి ఆ నిశ్శబ్దాన్ని ఉషే ఛేదించాల్సి వచ్చింది.

"గుండెలో శ్లేష్మం ఎలా ఉందో చూడండి నాన్నకి" అంది ఉష దాంతో ప్రభాకరం తన ఆలోచనల్లోంచి తెరుకొని స్టెతస్కోపుతో ఊపిరితిత్తులు పరీక్షచేసి, వెనక్కితిరగమని, భద్రయ్య నెమ్మదిగా గాలిపీల్చి వదులుతూంటే, వీపుమీదకూడా స్టెతోస్కోపు ఉంచి పరీక్ష చేశాడు. ఆ తర్వాత పక్కటెముకలమీద ఎడంచెయ్యి ఆన్చి కుడిచేతి వేళ్ళతో కొట్టిచూశాడు.

అంతసేపూ ఉషా మురళీ ఇద్దరూ నిశ్శబ్దంగా చూస్తూ నిలబడ్డారు. ప్రభాకరం లేస్తూ "మీరు రెగ్యులర్‌గా మందు పుచ్చుకోవాలి అశ్రద్ధ చెయ్యడానికి వీలులేదు" అన్నాడు

"ఎందుకొచ్చిన మందులయ్యా! ఇప్పుడో ఇంకాస్సేపటికో అన్నట్లు ఉన్నాను పొద్దు వాలిపోతోంది. నాచేత ఇంకా చేదుమందులు తాగించకుబాబూ నీకు పుణ్యం ఉంటుంది"

"అలాఅంటే ఎలా? పోనీ చేదుమందు తాగలేకపోతే ఇంజక్షనులు ఇస్తానులెండి"

"ఏమిటి? సూదిమందా? నాయనా ఈ రోజుసరికి సూదిమందు ఎరగను. ఈ వయసులో ఒళ్ళంతా తూట్లు పొడిపించుకోవడం ఎందుకు? ఏదో ఈ ఘటాన్ని ఇలా పోనియ్యి"

"ఉహుఁ! మీరేం మాట్లాడకండి... నేనే మందిస్తే, అది తీసుకోవడమే తెలిసిందా?"

కాస్సేపు ఎవ్వరూ మాట్లాడలేదు.

ప్రభాకరం లేస్తూ దిండుమీదఉన్న డబ్బు చూసి "ఇదేవిటి ఇంత డబ్బిలా నిర్లక్ష్యంగా ఇక్కడ పెట్టారు? ఏ పెట్లోనో బీరువాలోనో పెట్టకపోయారా?" అన్నాడు.

"అహ!... ఇప్పుడే అంకరాజు తెచ్చి ఇచ్చేనూ..."

"అంకరాజు మీకు డబ్బు ఇవ్వడమా!" — ప్రభాకరం తెల్లబోయి చూశాడు.

"తన మిల్లులో గొడౌన్ కీపరుగా నాకు ఉద్యోగం ఇచ్చి, అడ్వాన్సు జీతంగా ఆ వందా ముందిచ్చి వెళ్ళాడు" అన్నాడు మురళి.

ప్రభాకరం ఉలిక్కిపడి "ఏమిటీ? అంకరాజు దగ్గర ఉద్యోగమా? వాడెటువంటి వాడో తెలుసుగా? పాము వడగనిడని పని చెయ్యడంలాంటిది వాడిదగ్గర ఉద్యోగం అంటే ... నామాటవిని వాడిడబ్బు తీసుకొని వాడిమొహాన్న కొట్టి తిన్నగా నాదగ్గరికి రా... నాదగ్గర ఏ కాంపౌండరుగానో చేరుదుగాని నీకంతగా ఉద్యోగం చేయాలని ఉంటే ... అయినా ఆ చదువేదో పూర్తి చెయ్యకుండా ఈ గొర్రెతోక ఉద్యోగా లేమిటయ్యా ... ఇప్పుడైనా మించిపోయింది లేదు. నువ్వు చదువుకుంటానంటే నేను చెప్పిస్తాను చదువు..., ఏం? ... ఏమంటావు?"

> *జరిగిన కథ 1 :* భద్రయ్య గారి పిల్లలు మురళి, ఉషలు. భద్రయ్య గారి ఆస్తంతా దానధర్మాలతో హరించి పోయింది. చదువంటకపోయినా చిత్రలేఖనం నేర్చుకుంటాడు మురళి.

"పాతికేళ్ళు వస్తూవుంటే ఇప్పుడు నాకు చదువేమిటి?"

"అదిగో నాయనా అదీ వాడి మొండి వైఖరి. సరిగ్గా చదివితే, ఏ తలో తాకట్టు పెట్టి నేను చదివించకపోయానా?"

"ఏం లేదండీ! ... ఆ పెయింటింగ్‌మీదా ఆర్ట్‌మీదా దృష్టిపడింది. దాంతో చదువంటే విముఖత ఏర్పడింది ఈ లలితకళలతోఉన్న చిక్కేఇది. ఏ కళ అయినా పట్టుబడిందో ఇంకా మనిషి, దేనిమీదా మనస్సు లగ్నం చెయ్యలేడు. అసలా కళలే అటువంటివి. ఇంక దేనిపన్నా వాటికి కిట్టవు అందుకే ఇంగ్లీషులో వీటిని 'జెలసీఆర్ట్స్' అంటారు."

"కళలు తిండి పెడతాయా చెప్పు"

"అందులో మనదేశంలో..."

"నే నప్పుడప్పుడు అదే అనుకుంటాను. ఆకాస్త చదువైనా వీడికి చెప్పించావేమిటి? ఇదే ఉషకి చెప్పిస్తేనా, అది అలాఅలా అందుకొని చకచకా పై చదువులు చదివేసి ఉండును...దానికి ఉన్నపాటి పట్టుదల, లోకజ్ఞానం, వివేకం వీడికి లేవేమిటి? గడుసుదనం లేకుండా వీధిలోకి వెళ్ళవలసిన మగాడు బతకడం ఎలాగయ్యా! నాకెప్పుడూ వీడి గురించే బెంగ"

ప్రభాకరం నవ్వి "మీరేం బెంగపడకండి. ఇలాంటి సత్ప్రవర్తనలపు అబ్బాయిలకి గడుసువాయిల్లాంటి పెళ్ళాలు వస్తారు ఇద్దరికీ సరిపడ్డ తెలివితో వాళ్ళే సంసారాన్ని నడిపేస్తారు" అన్నాడు. ఆ మాటలకి మురళి అయితే సిగ్గుపడి తలవంచుకున్నాడు కాని ఉష మాత్రం చిన్నగా నవ్వింది...

"వాడూ...వాడి పెళ్ళీ...వాడి పెళ్ళికేం తొందరొచ్చింది?... ముందు చూడవలసింది అదిగో, దానికి..."

"ఏమిటి? ఉషకా?...అమ్మో... ఎవడో స్త్రీడో కాని వాడిని ముక్కు పట్టుకుని ఆడించెయ్యదూ?" అన్నాడు ప్రభాకరం ఉషకేసి నవ్వుతూ చూసి.

ఈమాటకు మురళి నవ్వాడు. ఉష మూతి ముడుచుకుంది. కూతురి పెళ్లి చెయ్యాలనే ఆలోచన వచ్చేసరికి భద్రయ్యకి ఏదో పెద్ద బెంగ కడుపులో ప్రవేసించింది. చేతిలో నయా పైసలేదు. కట్నంలేకుండా మంచి సంబంధం ఏం వస్తుంది? అలాగతి బంగారపు బొమ్మ లాంటి పిల్లని వీధిన పోయేవాడికిచ్చి కట్టబెట్టలేం కదా?

"ఏం బుంగతిమూతి పెట్టావు పెళ్లి అక్కర్లేదా?" అన్నాడు ప్రభాకరం నవ్వుతూ ఉషని చూసి.

"నేను పెళ్లి చేసుకోను" అంది కోపంగా...

"మరేం చేస్తావు? చదువుకుంటావా? పోనీ అలా చెయ్యి. మురళి చదవకుండుకు నువ్వైనా బాగా చదువుకొని పైకివస్తే మీ నాన్నగారూ సంతోషిస్తారు, మీకుటుంబానికి, మంచి భవిష్యత్తు వస్తుంది."

"ఆడపిల్లకి చదువా?"

"అలా అనకండి భద్రయ్యగారూ! అది వెనకటి మాట ... ఇప్పుడు వాళ్లే మగాళ్లకంటే బాగా చదువుతున్నారు. అన్ని ఫస్ట్ మార్కులూ వాళ్లవే! ఆ మధ్య ఢిల్లీ యూనివర్శిటీలో ఏంజరిగిందో తెలుసా? కాలేజీల్లో కేవలం మెరిట్ మీదే సీట్లు ఇస్తాం అనేటప్పటికి, నూటికి ఎనభై తొంభై సీట్లు లేడీస్‌కే వచ్చాయి"

"అయితేమాత్రం? దాన్ని చదివించటం ఎలా కుదురుతుందయ్యా?"

"ఏమండీ! ... కుదరక? మీరు 'ఊఁ' అనండి...తను ఎంత దాకా చదువుతానంటే అంత దాకా చదివించే పూచీ నాది..."

"నానాసేటండి, ఎవరు చదువుతారా? ఎవరిని చదివిద్దామా? అనే సరదా!" దాదాపు తనలో అనుకున్నట్టుగా పైకి అంది ఉష.

"డాక్టరుగారు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పెట్టారేమో" అన్నాడు మురళి నవ్వుతూ.

"మీ అన్నా చెల్లెళ్లకిద్దరికీ నా మాట లంటే వేళాకోళంగా కనిపిస్తున్నాయేమిటి? ఇద్దరినీ కాళ్లూ చేతులూ కట్టేసి, తీసికెళ్లి కాలేజీలో పడేస్తే తెలుస్తుంది వేళాకోళం ఏమిటో" అన్నాడు ప్రభాకరం కోపాన్ని అభినయిస్తూ.

"వాళ్లమాటలకేం గాని నాయనా... ఈ ఆయాసం లేకుండా ఏదైనా చూద్దూ ..."

"ఆయాసం, దగ్గూ, బాధా, అన్నీ తగ్గుతాయి. మీరుమాత్రం రెగ్యులర్‌గా మందు తీసుకోండి...మరినేను వస్తాను...వస్తానోయ్ మురళీ...ఆ లంకరాజిచ్చే ఉద్యోగంలో, కాస్త ఆలోచించి మరీచేరు ... అది సరే ... రేపో ఎల్లుండో ఓమారు వీలు చూచుకొని మా యింటికోమారు రా ... అమ్మకూమా చూసి చాలా రోజులైంది అంటోంది"

"అలాగే"

"వచ్చేటప్పుడు అదిగో, ముక్కుమీదకోపం ఉండే ఆ కోతి పిల్లని కూడా తీసుకురా, మరిచిపోకు."

ఉష కోరగా ప్రభాకరంకేసి చూసింది.

ప్రభాకరం నవ్వుకుంటూ వెళ్లిపోయాడు.

"వాళ్లనాన్న చూసుకోడానికి లేకపోయింది కానీ, కుర్రాడు ఏం బుద్ధిమంతుడు...ఏం వినయం...ఏం ఆప్యాయత..." అంటూ భద్రయ్య ప్రభాకరాన్ని పొగుడుతూ ఉంటే.


"పావకాశంగా పొగుడుదుకానిలే నాన్నా... ముందు భోజనానికిలే..." అంది ఉష విసుగ్గా.

"నాకిప్పుడు ఆకలి లేదమ్మా... అయినా రాత్రిపూట భోజనం మానెయ్యడమే మంచిది తిన్న దగ్గరనుంచీ దగ్గూ ఆయాసమేగా?... నువ్వులేరా బాబూ...లేచి రెండు మెతుకులు నోట్లో వేసుకు నిరా" అంటూ భద్రయ్య కొడుకు వీపుమీద చెయ్యి వేశాడు. కంగారుగా వెన్ను నిమిరి "ఏమిట్రా నాయనా! వెన్నుపూస అంతా కనిపిస్తూ ఇలా ఉన్నావు! ఈ వయస్సులో ఎలా ఉండాలి... ఏమైనా బెంగెట్టుకున్నావేమిట్రా బాబూ!" అన్నాడు ఆదుర్దాగా.


నాన్న తనని మరీ అలా చిన్న పిల్లాడిలా బుజ్జగిస్తుంటే సిగ్గుపడి "ఏం లేదునాన్నా" లంటూ లేచాడు మురళి.

"రేపు ఈ డబ్బు పట్టుకెళ్లి అంకరాజుకిచ్చెయ్యి" అన్నాడు భద్రయ్య "అలాగే!" అంటూ డబ్బు తీసుకున్నాడు మురళి.

(41 వ పేజీ చూడండి)



లోకం పోకడ - ఉమేన్




# సినిమా

## వాణిశ్రీ ద్విపాత్రాభినయం !

ప్రముఖ చిత్ర నిర్మాత మల్లెమాల సుందరరామిరెడ్డి నిర్మిస్తున్న జానపద చిత్రంలో, ఆంధ్రుల అగ్రనటి వాణిశ్రీ ద్విపాత్రాభినయం చెయ్యబోతున్నది. ఈ చిత్రంలో రామకృష్ణ కథానాయకుడు.

ప్రజలకు నచ్చిన ఒక చారిత్రాత్మక కథను ఆధారంగా గొని, సహజకవి ఒక కొత్త కదను సృష్టించారు. మాట, పాటలను కూడా "మల్లెమాల" రాస్తారు.

భారీ ఎత్తున వర్ణచిత్రంగా నిర్మితమయ్యే ఈ జానపద కథకు "దొరలు-దొంగలు" అని పేరెట్టారు రెడ్డిగారు.

## కోటలో పాగా !

ఎన్నో విజయాలను చవిచూచిన విరలాచార్య జూన్ యిరవై ఆరున ఆరంభించిన జానపద చిత్రానికి "కోటలో పాగా" అని పేరెట్టారు. దీనికి కథకుడు, సినిమా అనువాదకుడు, దర్శకుడు విరలాచార్యే.

ఈ చిత్రంలో రామకృష్ణ, జయసుధ, రాజనాల, మిక్కిలినేని, ముక్కామల, సత్యప్రియ, కేశవరావు, రామకుమార్ ప్రధాన తారాగణం.

కన్నడ నటుడు సుదర్శన్ ఒక ముఖ్య పాత్రను, విఖ్యాత హాస్యనటుడు విదూషక పాత్రను పోషిస్తున్నారు.

జానపద రచనా శైలిలో గట్టివాడని పించుకున్న జి. కె. మూర్తి సంభాషణాన్ని. రాఘవులు సంగీతాన్ని, వేణు ఛాయాగ్రహణాన్ని, నాగరాజన్ కళను నిర్వహిస్తున్నారు.

రెండవ యూనిట్ దర్శకులుగా వైకుంఠ రామశర్మ, విశ్వనాథన్ పని చేస్తున్నారు.

సంభ్రమాశ్చర్యాలను గొలిపే కథా వస్తువును గొనియున్న "కోటలో పాగా" చిత్రం ప్రేక్షకులను ఆకర్షించగలదు.

జానపద చిత్రాలను ప్రేక్షక జనరంజకంగా, సామాన్యుడు మెచ్చేవిధంగా అందించగల ప్రతిభా సంపత్తిని బడసియున్న దర్శకుడు విరలాచార్య, తన స్వంత చిత్రాలనే గాక బయటివాళ్ళ చిత్రాలను కూడా చెయ్యడానికి, అభ్యంతరం లేదన్న నిజాన్ని, నే జరిపిన సంభాషణంద్వారా గ్రహించగలిగాను.

### వెరైటీ వేషాల రాజు !

చిత్ర చిత్ర ప్రవర్ధమానమవుతున్న నటుడుగా కృష్ణంరాజును ప్రేక్షకులు అంగీకరిస్తున్నారనేది నిజాన్ని, యిటీవల మదరాసు వచ్చిన వివిధ అభిమాన సంఘాల ప్రతినిధులు వెల్లడించారు

ఈమధ్య విడుదలైన ''పుట్టింటి గౌరవం'' చిత్రంలో కృష్ణంరాజు రొమాంటిక్ హీరోగా బలేగా వున్నారని, అక్కినేని అభిమానులు పేర్కొన్నారు

''భారతి'' చిత్రంలో కరుణరసాన్ని చక్కగా పోషించారని, ఎన్టీఆర్ అభిమానులు మెచ్చుకొన్నారు

ఏ పాత్రకైనా, కృష్ణంరాజు న్యాయం చెయ్యగలడన్న నమ్మకాన్ని శోభన్ అభిమానులు వ్యక్తపరచారు

తనను అభిమానించే ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా తక్కువ చిత్రాలను అంగీకరించారు రాజు ''రక్తపాశం, భక్త కన్నప్ప, రవీంద్ర ఆర్ట్ పిక్చర్స్, అమానుష్, ఇద్దరూ యిద్దరే, సుభాషిణీ ఆర్ట్ పిక్చర్స్, శ్రీ నళినిశ్రీ కంబైన్స్'' చిత్రాలలో వెరైటీ కృష్ణంరాజు కనిపిస్తారు

### ఆశయసిద్ధి

రవి చిత్ర వారి ''నిప్పులాంటి మనిషి'' శతదినోత్సవ వేదికమీద, దర్శకుడు ఎస్ డి లాల్ ఒక డేరింగ్ స్టేట్‌మెంటును యిచ్చారు రామారావు గారు నటించే చిత్రాలను మాత్రమే తను డైరెక్ట్ చేస్తానని అంత ధైర్యంగా అనగలిగినందుకు, ప్రతిఫలం సిద్ధించిందనే చెప్పాలి

గజలక్ష్మి చిత్ర వారి ''అన్నదమ్ముల అనుబంధం'' చిత్రం లాల్ ఖ్యాతిని మరింత పెంచి, ఎన్టీఆర్ హృదయంలో బలమైన చోటును లాల్‌కు ఏర్పరచగలిగింది నమ్ముకున్నవాళ్ళకు రక్షణనిచ్చే స్వభావం ''నటరత్న''కు వున్నది గనక, లాల్ ప్రతిభలో ఆయనకు నమ్మకం వున్నది గనక, ఆనాటి లాల్ ప్రకటనకు ఫలితం దక్కింది అనే చెప్పాలి

రవి చిత్ర రావ్‌గారి ''రోటీ'' చిత్రానికి గజలక్ష్మి చిత్ర వారి తరువాతి చిత్రానికి ఎస్ డి లాల్ దర్శకత్వం వహించడం వరకు వాస్తవమే

### వైజయంతీ మూవీస్ !

''నటరత్న'' రామారావు, అగ్రనటి వాణిశ్రీ ప్రధాన జంటగా నిర్మాత అశ్వినీదత్ నిర్మిస్తున్న వర్ణచిత్రం షూటింగు చాలావరకు పూర్తయినట్టు, వైజయంతీమూవీస్ అధినేత ద్వారా తెలుసుకొన్నాను

ఈమధ్య ఊటీలో జరిగిన షూటింగు దృశ్యాలు మరీ మరీ బాగున్నట్టు, రషస్ చూసినవాళ్ళు, పరవశించిన నిజాన్ని వెల్లడించారు

### అతిరథ శ్రేష్ఠులు !

నిర్మాత అందర్లోకి వయసులో చిన్నవాడగు అశ్వినీదత్ తన చిత్రంలో పెద్ద నటీనటులెందరినో పెట్టే మహా యజ్ఞాన్ని ప్రారంభించాడు

ప్రేక్షకుల నాకర్షించే అంశాలన్నిటిని తన కథలో జొప్పించారు, కథా రచయితలు భమిడిపాటి, ఆరుద్రగార్లు శ్రోతలను ఆనందపరిచే రాగాలను పాడిగారు సంగీత దర్శకుడు మహదేవన్

ఈ చిత్రంలో జగ్గయ్య, సత్యనారాయణ, రాజబాబు, ప్రభాకరరెడ్డి, అల్లు రామలింగయ్య, కాంతారావు, నిర్మలవంటి అతిరథ శ్రేష్ఠులు ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు సహాయ నాయికగా హేమమాలినిని పోలిన పద్మప్రియ నటిస్తున్నది నవరసాలు నిండిన యీ వర్ణ చిత్రాన్ని వివిధరంగాల వ్యక్తులు వెరీ గుడ్ అనే విధంగా, బాపయ్య రూపొందిస్తున్నారు ఈ చిత్రానికి ఎస్ వెంకటరత్నం యిస్పెట్

### రామారావుతో తర్వాతి చిత్రం

వైజయంతీ మూవీస్ అధినేతను, నాయర్ రోడ్డులోని వారి ఆఫీసులో కలిశాను తన తర్వాతి చిత్రం కూడా రామారావుగారితోనే తీస్తానని చెప్పారు ''నటరత్న'' గారి సహాయ సహకారాలను తనెన్నడూ మరువజాలనని చెప్పారు ''దీవార్'' లాంటి కథను వెతుకుతున్నట్టు, నిర్మాత అశ్వినీదత్ చెప్పారు దర్శకత్వం బాపయ్య నిర్వహించగలరట

### బాపయ్య భవిష్యత్తు

''కృషి, దక్షత, సమయస్ఫూర్తి'' వంటి విలువయిన వస్తువులను విశ్వసించే బాపయ్యకు భవిష్యత్తు బలేగా వుండకపోతుందా ? బాపయ్య దర్శకత్వం నిర్వహించిన చిత్రాలలో ఆయన ''స్పిరిట్'' అందరినీ ఆకట్టుకొనడం అబద్ధంకాదు

ప్రస్తుతం సురేష్‌వారి ''సోగ్గాడు'', వైజయంతీ మూవీస్ వారి చిత్రం, రామకృష్ణ ఆర్ట్స్ వారి ''వైకుంఠపాళి'' చిత్రాలు బాపయ్య ప్రతిభను ప్రదర్శిస్తాయి



''ఆదిమానవులు''లో ఒక దృశ్యం



''విప్లవ వనిత''లో విజయ లలిత ★★



''బాగ్దాద్ వీరుడు''లో శుభ ★★



''ఆస్తికోసం''లో జయమాలిని

### తాతయ్యను ఏడిపించిన మనవడు

ఒకొక రమణీయ హర్మ్యం ఆ భవంతిలో ఒక మూలగా కూచుని, దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు ఒరసై నిండిన తాతయ్య తాతయ్యను, ఆయన వాలకాన్ని యిరవై నిండిన మనవడు పసిగట్టాడు తాతయ్యకు వేరువగా వెళ్లాడు

''తాతా ! బాగున్నావా ! ఏం

రారా బాగున్నావా

ఏంగారుగున్నావు, కంగుతింటున్నావు,

ముడుచుకోనున్నావు, మూల కూచున్నావు''

అంటూ తాతయ్యను ఏడిపించాడు ''కట్'' అన్నారు దర్శకుడు దాసరి నారాయణరావు ఈ గమ్మత్తయిన దృశ్యం ఆదిత్య చిత్ర వారి ''బంగారు పతకం'' వర్ణ చిత్రంలో కనిపించి, కడుపుబ్బ నవ్విస్తుంది డాక్టర్ నారాయణరెడ్డి పాట రాజేశ్వరరావు సంగీతం బాలుది గానం తాతయ్యగా సత్యనారాయణ, మనవడుగా రామారావు నటించారు

ఆదిత్య చిత్ర వారి షూటింగు బెంగుళూరు మహారాజా పాలెస్‌లో పక్షంరోజులు జరిగింది ఇంత వరకు తెలుగు నిర్మాతలెవరూ మహారాజా పాలెస్‌లోని అంతర్భాగాన్ని వాడియుండలేదు

ఈ షెడ్యూలులో నటరత్నతో బాటు, మంజుల, సత్యనారాయణ, అల్లురామలింగయ్య, నాగేష్, రాజశ్రీ, రమాప్రభ, కాకరాల పాల్గొన్నారు

ఆదిత్య చిత్ర వారి ''బంగారు పతకం'' చిత్రంలో ఎన్టీఆర్ వైవిధ్య స్వభావాలను గొన్న తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు జమున హీరోయిన్‌గా నటిస్తున్న యీ చిత్రాన్ని దుద్దు వెంకటేశ్వరరావు, వి మహేష్ నిర్మిస్తున్నారు ఆర్ట్ డైరెక్టర్ రాజేంద్రకుమార్ సమర్పకుడు

ఈ చిత్రంలో రామారావుగారిని చూచిన ప్రతి వ్యక్తి రెండవ యవ్వనం ఆయనకు సంప్రాప్తించిందా అని అనక తప్పిందికాదు


## సినిమా

### జిల్లా కలెక్టరుగా రామారావు

నీతి, నిజాయితి, ధర్మం, దక్షత తన ధ్యేయంగా గొని, న్యాయపరిపాలన చేసే జిల్లా కలెక్టరుగా ''నటరత్న'' రామారావు త్రివేణి ప్రొడక్షన్స్ వారి ''బంగారు మనిషి'' చిత్రంలో నటిస్తున్నారు

''బడిపంతులు'' వంటి విలువయిన చిత్రాన్ని నిర్మించిన పేరాజుగారు యీసారి సమాజ శ్రేయస్సుకు దోహదంచేసే కథావస్తువును ఎన్నుకొన్నారు

విఖ్యాత దర్శకుడు భీంసింగ్, విఖ్యాత రచయిత గొల్లపూడి, విఖ్యాత సంగీత దర్శకుడు మహాదేవన్ సాంకేతిక శాఖలకు అధిపతులయ్యుండ, లక్ష్మి, గుమ్మడి, ప్రభాకరరెడ్డి, శ్రీధర్, అల్లురామలింగయ్య, రమాప్రభ, శరత్ లాంటి అనుభవజ్ఞులు సహాయ పాత్రధారులైయ్యుండ, ''బంగారు మనిషి'' చిత్రం గూర్చి బంగారుకలలు కనడంలో తప్పేముంది ?



''ముత్యాల ముగ్గు''లో సాక్షి రంగారావు, కాకరాల

### విప్లవ వనితగా విజయలలిత

నటిస్తున్న చిత్రాన్ని శ్రీ శ్రీనివాసమంగమాంబ ప్రొడక్షన్స్ అధినేత డి వి వెంకటరంగారెడ్డి నిర్మిస్తున్నారు

నేటి సమాజంలో జరుగుతున్న అక్రమాలను, దుర్మార్గాలను, రాజకీయ నాయకుల లోగుట్టు రహస్యాలను, మఠాధిపతుల మర్మ చర్యలను తూర్పారబట్టే చిత్రమే ''విప్లవ వనిత'' కథను కె రాములు రాశారు మాట, పాటలను రాజశ్రీ రచించారు ఈ చిత్రానికి ఎస్. రంగారావు సంగీతాన్ని సమకూరుస్తున్నారు ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను హలం, రాధ, రాజేష్, గంగాధర్, బాలకృష్ణ పోషిస్తున్నారు

''గుండెలుతీసిన మొనగాడు'' చిత్రం ద్వారా మొనగాడు అనిపించుకున్న చక్రవర్తి ''విప్లవ వనిత'' చిత్రం యొక్క తమిళ, కన్నడ ప్రతులకు కూడా దర్శకత్వం నిర్వహిస్తున్నారు

విజయలలిత పాత్రలో థ్రిల్, సస్పెన్స్, సెక్స్ వున్నాయి ప్రేక్షకులాశించే హాస్యం, శృంగారం, సాహసం ''విప్లవ వనిత'' చిత్రంలో దండిగా వున్నాయి

### కె. ఎస్ రెడ్డికి ప్రశంసల వర్షం

''పిన్నీలి పెళ్లి'' చిత్రాన్ని, ఇటీవల మద్రాసులోని ఫిలింఛేంబర్ థియేటర్లో వివిధరంగాల వ్యక్తులు చూశారు

అందరిదీ ఒకేమాట ''చిత్రం మహిళా ప్రపంచాన్ని విశేషంగా ఆకర్షిస్తుంది ప్రతి కుటుంబం చూడదగిన ఇతివృత్తాన్ని గొనియున్నది విజయనిర్మల, రాజబాబు, గుమ్మడి పోటీపడి నటించి, చిత్రాన్ని రక్తికట్టించారు సత్యం సంగీతం మధుర మధురంగా వున్నది కె ఎస్ రెడ్డి దర్శకత్వం ప్రశంసనీయంగా వున్నది''



## చక్రవర్తి కొత్త చిత్రం

జయవాణి ఆర్ట్స్ అనెడి నూతన చిత్ర నిర్మాణ సంస్థ గత ఏడు మెపి, ''పూజాపుష్పాలు'' అనెడి చిత్రాన్ని ప్రారంభించిన విషయం పాఠకులకు తెలియనిదికాదు

''పూజాపుష్పాలు'' చిత్రంకోసం రాసుకున్న కొన్ని దృశ్యాలు, ఇటీవల విడుదలైన ఒక చిత్రంలో వుండిన నిజాన్ని కళ్లారా చూచిన నిర్మాత బి వీరరాజు తన కథను మార్చవలసి వచ్చింది

తమిళ రచయిత గుహనాధన్ రాసిన కథను కొన్నారు వీటూరి మాటలను రాశారు సత్యం సంగీత సారధి

చిత్రంలోని ప్రధాన పాత్రలను 'షావుకారు' జానకి, సత్యనారాయణ, చంద్రమోహన్, ప్రభ పోషిస్తున్నారు దుష్టనాయకుడి భూమికను, 'ఈకాలపు పిల్లలు' దేవదాసు ధరిస్తారు ఈ చిత్రానికి చక్రవర్తి దర్శకుడు ఈ చిత్రం షూటింగు జులై 4 న ప్రారంభమవుతుంది

## ముగ్గురికి మార్కులు

అనంతలక్ష్మి కంబైన్స్ నిర్మిస్తున్న ''ఈకాలపు పిల్లలు'' చిత్రం యొక్క పదివేల అడుగుల రషస్‌ను ముఖ్యులు కొందరు చూశారు

చిత్రం దర్శకుడు లక్ష్మీదీపక్ చేత రమణీయంగా రూపం అందుకొంటున్నది అని ఏకగ్రీవ అభిప్రాయాన్ని వెల్లడించారు

తారాగణంలో ముగ్గురికి సమాన మార్కుల నిచ్చారు లెక్చరర్ రామకృష్ణ, విద్యార్థి దేవదాస్, విద్యార్థిని ప్రభ పోటీపడి నటించబట్టి, చిత్రం చక్కగా వచ్చింది అన్నారు

సత్యం సమకూర్చిన సంగీతం హుషారుగా వున్నదని, రామకృష్ణరావు ఛాయాగ్రహణం ప్రశంసనీయంగా వున్నదని వక్కాణించారు

సహాయ పాత్రధారులగు ప్రభాకరరెడ్డి, కాంతారావు, శ్రీదేవి, జి వరలక్ష్మి, త్యాగరాజు, జయమాలిని, సారధి సమర్థవంతంగా చేశారట జ్యోతిలక్ష్మి నృత్యం ప్రత్యేకంగా వున్నదట నిర్మాత దగ్గుపాటి భాస్కరరావుకు డబ్బు పుష్కలంగా తెచ్చిపెట్టగలదట

## ''జయత్రయం''

తెలుగు చిత్ర రంగంలో జయత్రయం బిజీ అవుతున్న నిజం కనిపిస్తున్నది

''జయసుధ, జయప్రద, జయచిత్ర''లకు తెలుగు నిర్మాతలు హీరోయిన్ పాత్రలను యివ్వడానికి సుముఖంగా వున్నారు

డబ్బును విపరీతంగా పెంచుతున్న ఆర్టిస్టులను పెట్టుకోవడానికి, అనేకమంది నిర్మాతలు సంశయిస్తున్నారు

ప్రేక్షకుల్లో హీరోలకు వర్‌షిప్ వున్నదే గాని, మరొకరికి లేదని నిర్మాతలు అభిప్రాయపడడంవల్ల, పెద్ద హీరోల సరసన కొత్తగా రంగప్రవేశం చేసి ''జయత్రయం''తో సర్దుబాటు చేసుకొంటున్నారు

''జయత్రయం''లో సుధ, ప్రద, చిత్రల మధ్య పోటీ అనివార్యం అనిపిస్తున్నది ఈ ముగ్గురిలో అదృష్టదేవత ఎవర్ని వరించగలదో ? వేచిచూడాలి

## రమాప్రభకు కొత్త హోదా

ప్రేక్షకులమెచ్చే నటవర్గంలో రమాప్రభ ఒకరైనా గాబట్టే దశాబ్దంగా పేరు ప్రఖ్యాతులు పెరుగుతూ వున్నాయి

ఇంతవరకు నటిగా వుండిన రమాప్రభకు కొత్తహోదా లభించింది

## వింత ఇల్లు - సంతగోల

కరుణ చిత్ర తలపెట్టిన యీ వినోదాత్మక చిత్రానికి, రమాప్రభ సమర్పకురాలని, ఆవిడ భర్త శరత్ చెప్పగా తెలిసింది ఈ సంస్థను కె. కమలాకరరావు, టి ఎన్ బి నాగరాజు స్థాపించారు.

ఈ చిత్రానికి పి లక్ష్మీదీపక్, శంకర్, దేవరాజ్ ముఖ్య సాంకేతిక సారధులు. ప్రధాన పాత్రలను శరత్‌బాబు, రాజబాబు, నాగభూషణం, చంద్రమోహన్, పద్మనాభం, గిరిబాబు, రంగారావు, అల్లు రామలింగయ్య, జయసుధ, రమాప్రభ, ప్రభ (గెస్టు) పోషించగలరని, శరత్ వెల్లడించారు.

ఈ చిత్రం షూటింగు ఆగస్టులో ఆరంభం అవుతుందట. ఆద్యంతం నవ్వించే హుషారైన సన్నివేశాలు నిండిన కథను యీ చిత్రం గొనియున్నది.

''పూజ''లో రామకృష్ణ, కుమారి మంజుల ★★★★★ శ్రీ గౌతమ్ పిక్చర్స్ మూడో చిత్రంలో ఒక దృశ్యం





## సినిమా

### శరత్కాలమ్ !

"రామరాజ్యం" చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైన శరత్‌బాబుకు, ఆరంభం ఆశాజనకంగా కనిపించలేదుగాని, యిప్పుడు శరత్కాలం జరుగుతున్న నిజాన్ని ఎవరూ కాదనలేరు.

"అభిమానవతి" చిత్రం చూచిన తరువాత, శరత్‌బాబుకు ఏం తక్కువ అనిపించింది. అందం, అవయవసౌష్ఠవం, నటనా ప్రాభవం వున్న శరత్‌ను వెన్నెల ప్రేమించకుండా వుండగలదా ?

ప్రేమించబట్టే, యిప్పుడు శరత్‌బాబు బిజీ నటుడు కాగలిగాడు. ప్రస్తుతం విభిన్న మన సత్వాలు గొన్న పాత్రలను పోషిస్తున్నాడు. అవేమిటంటే.

"త్రివేణి వారి "బంగారు మనిషి", కృషివల్ వారి "వయసొచ్చిన పిల్ల", చక్రపాణి వారి పెళ్లి కాని తండ్రి, సూర్య చిత్ర కంబైన్స్ వారి మంచి రోజా, నరేంద్రావారి 'నవ్వుతూ బ్రతకాలి', ప్రియదర్శిని క్రియేషన్స్ వారి "పసుపు — కుంకుమ". మున్నగు చిత్రాలలో శరత్‌బాబు వెరైటీ వేషాలను వేస్తున్నాడంటే, పరిశ్రమలో పదికాలాలపాటు నటుడుగా నిలబడే యోగ్యతను పొందినట్టేగా.

### పెద్దింటి కోడలు !

నిన్న, మొన్నటి వరకు "మట్టిమనుషులు" గా పరిచయమైన ప్రేమాలయా మూవీస్ వారి చిత్రం యిప్పట్నుంచి "పెద్దింటి కోడలు" గా పేరుమార్చుకున్నట్టు, చిత్ర దర్శకుడు శ్రీనివాసరెడ్డి చెప్పారు.

"పెద్దింటి కోడలు" చిత్రంలో స్వర్గీయ రంగారావు అద్భుతంగా నటించారు. ముఖ్య పాత్రలను నాగభూషణం, 'గీత' ప్రసాద్, రాజశ్రీ, వై. విజయ పోషించారు.

ఈ చిత్రానికి దేవరాజ్ ఛాయాగ్రహణం యస్సెట్ అంటున్నారు. దర్శకుడు శ్రీనివాసరెడ్డి తన చాతుర్యాన్ని చూపెట్టిన నిజాన్ని ప్రేక్షకులు అంగీకరించగలరు.

### తమిళ చిత్రానికి దర్శకత్వం

"ఉత్తమురాలు" చిత్రాన్ని, తమిళ సోదరులు చూచి, దర్శకుడు శ్రీనివాసరెడ్డిని, కథను, కథనాన్ని మెచ్చుకొని, తమిళ వెర్షన్‌కు, తెలుగుచిత్ర దర్శకుడ్నే పెట్టుకొన్నారు. తెలుగులో జగ్గయ్య ధరించిన భూమికను తమిళంలో ముత్తురామన్ చెయ్యగలరని తెలిసింది.



"పూర్ణమ్మ కథ"లో రోజా

### రాజబాబు నాయకత్వం

అఖిలాంధ్ర ప్రజల ఏకైక (అభిమాన) హాస్య కథానాయకుడు అంటె రాజబాబు ముఖ్య పాత్రను పోషించనున్న చిత్రానికి,

విజయవాడ నిర్మాతలు తలపెట్టిన పూర్తి అవుట్‌డోర్ చిత్రానికి,

"తనే దర్శకత్వం నిర్వహించబోతున్నట్టు, "పెద్దింటి కోడలు, ఉత్తమురాలు" చిత్రాల దర్శకుడగు (నెల్లూరీయుడు) శ్రీనివాసరెడ్డి చెప్పారు.

### శోభన్ చిత్రానికి కృష్ణ దర్శకుడు

"హీ—మాన్" శోభన్‌బాబు కథానాయకుడుగా నటిస్తున్న వైజాగ్ త్రివిక్రమరావుగారి వర్ణ చిత్రానికి, టి. కృష్ణ దర్శకత్వం నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం షూటింగు అక్టోబరులో ఆరంభమవుతుంది. ప్రముఖ తారాగణం ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను పోషించగలరు.

### కృష్ణ జీనియస్ !

"ఖయిదీ బాబాయ్" చిత్రం చూచిన ప్రతి వ్యక్తి, దర్శకత్వం నెరపిన కృష్ణగారి పనితనాన్ని, ప్రతిభను ప్రశంసించిననిజాన్ని పరిశ్రమ మర్చిపోలేదు.

అంత పేరు సార్జించిన కృష్ణ మళ్లీ చిత్రాన్ని డైరెక్టు చెయ్యకపోవడానికి కారణం లేకపోలేదు. నాకు తెలిసి నాల్గయిదు చిత్రాలను వద్దన్నారు. "మంచి కథ, ఆరోగ్యవంతమైన నిర్మాత, తనమీద నమ్మకంవుంచే టీమ్" లభిస్తేనే గాని, చిత్రం అంగీకరించకూడదు అని ఓపిక పట్టారు. తనకు అనుగుణమైన "పార్టీ" దొరికింది. కథ నచ్చింది. తనకు యిష్టమైన హీరో నటిస్తున్నారు. "జీనియస్" అని పేరు తెచ్చుకొన్న కృష్ణ, దాన్ని నిలబెట్టుకోవాలి.

— శ్రీనివాస్

సీరియల్

# యుగసంధి

'విశాఖ'

**జరిగిన కథ 3 :** పూర్వకాలం మనిషి యాజులుగారి సంతానం శాస్త్రి, మూర్తి, వెంకటలక్ష్మి, మహాలక్ష్మిలు. సుందరం, వేణు, మాలతిలు శాస్త్రిగారి సంతానమైతే మాధవి, రేవతులు మూర్తిగారి కూతుళ్లు. మాలతి బాల్య వితంతువు. గుమాస్తా గోపాలం మాధవిల వివాహానికి ఆటంకంగా నిలుస్తారు మూర్తిగారు. శ్రీను, సుజాత వెంకటలక్ష్మి పిల్లలు. శ్రీను స్నేహితుడు అశోక్ మళయాళీ. అశోక్, సుజాత పెళ్లి చేసుకోవాలనుకుంటారు. మహాలక్ష్మి కొడుకు రామానికి మాలతంటే ఇష్టం. సుందరం సాయంతో మాధవి, గోపాల్‌లకి రహస్యంగా రిజిష్టరు మారేజి చేసి పంపివేస్తాడు వేణు. జానకితో సుందరం వివాహం నిశ్చయిస్తారు యాజులుగారు.

*(గత సంచిక తరువాయి)*

"ఎందుకవుతుంది అంటే రాబోయే నీ భార్య చెడ్డదని నేను అనటంలేదు. మనిషి మంచిదయినా, కొన్నాళ్లకి ఊర్లోవాళ్ల చెప్పుడు మాటలవీ విని మాలతిని సరిగ్గా చూడకపోతేను. మనింటికి మనకంటే వచ్చేపోయే జనం ఎక్కువకదా! అందులో సినిమాల్లో సూరేకాంతంలాంటివారు చాలామంది. అప్పుడు మాలతి గతి ?"

సుందరం మౌనంగా వూరుకున్నాడు. రేపు జానకి వచ్చాక మాలతికేదో చెడుపు జరుగుతుందన్న విషయంలో నమ్మకం లేకపోయినా, మాలతి యిన్నాళ్లూ ఏ కోరికలూ లేకుండా పెరిగింది. రేపు జానకిని చూసి ఆ కోరికలు తలెత్తితే ?

"అందుకే సుందరం, మాలతికి మళ్లీ పెళ్లి చెయ్యటం సరైనది" అన్నాడు రామం.

"మళ్లీ పెళ్లా? దీనికి తాతగారు ఒప్పుకుంటారా ?"

"ఒప్పుకోరు."

"పోనీ ఒప్పుకున్నారు. దాన్ని మళ్లీ పెళ్లి ఎవరు చేసుకుంటారయ్యా, నీ పిచ్చిగాని."

"పోదూ ఎవరిపిచ్చి వారికానందం. నేనే చేసుకుంటాను ఏం ?"

సుందరం ఆశ్చర్యపోయాడు

"నాకు నాన్నలేదు అమ్మలేదు—తోడబుట్టిన వాళ్లు లేరు. అలాంటప్పుడు అన్నింటికీ పెద్ద మన తాతగారేను. నేను మాలతిని చేసుకున్నందువలన ఏ యిబ్బందులూ రావు సరేనా !"

అంటూన్న రామం చేతిని తన చేతుల్లో తీసుకున్నాడు సుందరం కృతజ్ఞతలో హృదయం నిండిపోయింది

"రామం నిజంగానే అంటూన్నావా ?"

"నిజంగానే సుందరం"

"అయితే పెళ్లి తప్పకుండా చేసుకుంటావా?"

"అవును సుందరం బుద్ధితెలియని వయస్సులో పెళ్లి చేసారు. పెళ్లి అయ్యాక కాపరాని కెళ్ళే వయస్సు రాకుండానే భర్త పోయాడు. మరి మాలతి ఏ విధంగా వివాహిత ? అందుకే నేను నిర్ణయించుకున్నాను. కావాలంటే ఇప్పుడే నీ ఎదురుగా 'ధర్మేమేచ యర్థేచ కామేచ . నాతి చరామి' అనేసి మానసికంగా మాలతిని వివాహం చేసుకుంటాను "

"మరి మాలతి అభిప్రాయమో ?"

"అది నువ్వే కనుక్కో. దానికి అభిప్రాయం ఉండదు. కనుక చేసుకోమని సర్దిచెప్పు. నన్ను నన్నుగా ఇష్టపడకపోతే మాత్రం ఈ పెళ్లి జరగదు" అన్నాడు. సుందరం రామంకి మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

ఆ రోజు భోజనాల దగ్గర సుందరం తండ్రీ తాతగారూ కలిసి కబుర్లు చెప్పుకోవటంతో సుందరానికి తెల్సిన విషయం — సుజాతని వేణుకి చేసుకోమని కలకత్తానుంచి అత్తయ్య ఉత్తరం వ్రాసిందని.

దానికి తాతగారు "కావాల్సిన సంబంధం వుండంగా బయటి వారికెందుకు వెళ్తాం. వెంకటలక్ష్మికి సుజాతని సుందరానికివ్వడానికిష్టముండదని నాకు తెల్సు పట్నవాసం కెళ్లిందిగా! చదువుకున్న వాళ్లే కావాలి. అదీ సుందరం మనూళ్లోనే వున్నాడు. అంగువల్లే వేణుకి చెప్పివుంటుంది."

"వేణు మాత్రం పట్నంలో వుంటాడన్న నమ్మకం ఎలాగుంది ? నేనిక్కడ నర్సింగుహోము తెరవమంటే ?" అని అడిగిన తండ్రికేసి చూస్తూ సుందరం "ఈ వూళ్లో ఎలా నాన్నా ? ఏం ప్రాక్టీసుంటుంది. పట్నంలో అయితే నలుగుర్ని చూసి నేర్చుకోవచ్చు." అన్నాడు

దానికి శాస్త్రిగారు

"పట్నంలో వీధికొక డాక్టరున్నాక క్రొత్తగా బోర్డుకట్టిన వీడి దగ్గరకి ఎవరొస్తారోయ్" అన్నారు

"అదీ నిజమేరా" అన్నాడు రామం.

రామం, సుందరం ఆలోచనలో పడ్డారు.

"వేణుకి పట్నం వదలటం నచ్చుతుందా ?"

"నచ్చకపోవటం ఏమిటి ?" అన్న తాతగారితో రామం

"అదికాదండీ తాతగారూ ! పట్నంలో వుంటే మడి ఆచారం అవీ అక్కరలేకుండా బల్లమీద భోజనాలు అవీ కదా ! డాక్టర్లు హడావుడిగా ఉంటే యివన్నీ ఎలా కుదుర్తాయి."

"అబ్బ ఇదో ప్రశ్నా! మధ్యాహ్నాలు వాడిష్టమొచ్చినట్లే ఆ నర్సింగుహోములో ఉండొచ్చు రాత్రి ఇంటికొచ్చి స్నానం ముగించి మనింటి పద్ధతిలో ఉండవచ్చు."

ఇప్పుడిలా అంటారుగానీ తీరా వచ్చాక ఎన్ని సాధిస్తారో ఈ తాతగారు అన్నీ తెలుసు నాకు అని అనుకున్నాడు రామం.

భోజనాలయ్యాక సుందరం రామూ లిద్దరూ కూడా ఈ క్రొత్త ప్రశ్నని గురించి మాట్లాడుకున్నారు. సుజాత కిష్టంలేదని స్పష్టంగా కన్పిస్తోంది కదా! ఇలాంటప్పుడు వేణుని సుజాతకి వరుడవమంటం అన్యాయం కదా! అందుకే విసుగ్గా సుందరం అన్నాడు.

"ఈ పెద్దవాళ్ళు మనమూ పెరుగుతున్నాం అని గుర్తించరేం ? ఎంతసేపూ మనల్ని వాళ్ళు తయారుచేసిన బొమ్మల్లాగా చూస్తారు. ఒక బొమ్మని పెళ్లికూతురని, ఒక బొమ్మని పెళ్లికొడుకనీ అని వాళ్ళిష్టం వచ్చినట్లు పెళ్లి చేసి ముచ్చట తీర్చుకుంటారు. అంతేకానీ మనం ప్రాణమున్న మనుష్యులం అని గుర్తించరేం ఖర్మ !" అన్నాడు.

"ఇదే వీళ్లతో వచ్చిన చిక్కు. పెళ్లి విషయం ఎందుకు ? ప్రతీ చిన్న విషయానికీ అంతే ! చిన్నప్పుడు నేను ఎర్రలాగూ తెల్లచొక్కా వేసుకోవాలనుకుంటే నాన్న ససేమిరా వద్దు బళ్లోకి అలా రంగుబట్టలు వేసుకోకు. కాకీనిక్కరు, తెల్లచొక్కా వేసుకో అనేవారు నేను క్రాపుని ఎడంవేపు పాపిడితో దువ్వుకుంటే అమ్మ "కుడివేపు తీసుకోరా! చిన్నవాడిలా కన్పిస్తావు" అని క్రాపు చెరిపి మళ్లీ తనే దువ్వేది పచ్చడి బాగుందని రెండోసారి తిందామంటే అన్నీతినాలి చారు అన్నం తిను అనేది. ఇలాగే అనుకో. ప్రతిదానికీ వాళ్ల అభిప్రాయం, మన అభిప్రాయం ఒక్కటి అవనే అవదు."

"వీటన్నింటినీ వదులు. ఇప్పుడు సుజాత విషయం వేణుకి చెప్పవద్దూ! వాడికి తెలిస్తే వాడెలాగ ఒప్పుకుంటాడు చెప్పు" అన్న సుందరంతో రామం

"ఎలాగు నీ పెళ్లికి అందరూ వస్తారుకదా! అప్పుడు వేణుకి మనం ఈ విషయం చెప్పి వాడి అభిప్రాయం తెల్సుకుందాం " అన్నాడు

"వాడసలు పట్నం వదిలి రాడు. పెళ్లిమాట ఎలాగున్నా ప్రాక్టీసు వాడు పట్నంలోనే పెడతాడు."

"పోతే పోనియ్యి. వాడి విషయంలో వాడు తాతగారితో పేచీపెట్టగలడు. కార్యాన్ని సాధించనూ గలడు. మనకెందుకీ అనవసర కంఠశోష !" అన్నాడు రామం.

"అదిసరేగానీ ఎప్పుడూ వాడే ఎదిరించి వాడికే ఎందుకు చెడ్డపేరు రావాలి ? మొన్న మాధవి పెళ్లి విషయంలో నాకు ప్రమేయం ఉంది. కానీ ఎవ్వరికీ తెలవదు. వాడు దాన్ని రహస్యంగా ఉంచేసాడు అందువల్ల ఈ విషయంలో వాడితరఫున తాతగారితోనే మాట్లాడుదా మనుకుంటున్నాను."

"నువ్వు మాట్లాడినా చెడ్డపేరు వాడికే వస్తుంది. కావాలనే నీచేత అడిగించాడంటారు "

"పెళ్లికి బాబాయి వస్తాడా ?"

"రాకేం నిక్షేపంలా వస్తారు. మావయ్యకి పిల్ల తప్పు చెయ్యలేదన్నది తెలీదేమిటి ? ప్రపంచానికి వెరిచి అలా బిహేవు చేసివుంటారు చూస్తాండు




చీకటి వెలుగులు
ఈస్ట్మన్ కలర్
దర్శకత్వం
ర్ ఆఫ్ ఫొటోగ్రఫీ
యస్.ఆర్.స్వామి W.I.C.A
టలు
ల్లపూడి వెంకటరమణ
తం కళ
క్రవర్తి మోహన
హరిరావు
సొంత డిస్ట్రిబ్యూటర్స్ · లక్ష్మీ కంబైన్స్
లక్ష్మీ ఫిలింస్ రిలీజ్

వాళ్లంతా వస్తారు. అల్లుణ్ణి తీసుకురాకపోయినా కూతుర్ని తీసుకువస్తారు. తప్పకుండా వస్తారు."

"రాకపోతే ఊళ్లోవాళ్లకి జవాబు చెప్పేసరికి మన ప్రాణాలు పోతాయి."

"వాళ్ళూ వస్తారు. కలకత్తావాళ్ళూ వస్తారు. సందేహంలేదు. మనూరి పెళ్లి అంటే అందరికీ సరదానేను, రాకుండాపోరు" అన్నాడు రామం.

"రావాలనే ప్రార్థించుదాం." అన్నాడు సుందరం.

## 10

సుందరం పెళ్లి శుభలేఖలు అచ్చువేసారు. పిలుపులకీ వాటికీ ముందరే రమ్మని మెడ్రాసుకీ, కలకత్తాకీ ఉత్తరాలు వెళ్లాయి. కలకత్తా నుంచి ఆడవాళ్లిద్దరూ మెడ్రాసు నుంచి రుక్మిణి, రేవతీ ముందరే వచ్చారు.

రుక్మిణి వచ్చేటప్పుడే మెడ్రాసు నుంచి పెళ్లి బట్టలు కొనేసింది. ఇంటిముందరంతా పందిరి వేసారు. కొబ్బరి ఆకులతో స్థంబాలకి ఆకుపచ్చని కాంతి ఎది. పైనంతా పూలకుండీలు పూలూ అమర్చారు. వేణు కూడా త్వరగానే వచ్చేశాడు

హడావుడిగా అన్నయ్య పెళ్లికని మందుగుండు సామాన్లు, తారాజువ్వలు, పువ్వుల మతాబాలూ చిమ్మబుడ్లు మొదలైన బాణసంచా తయారు చేయించాడు. స్నాతకంకి వచ్చిన వారికోసమని గాడి పొయ్యి తవ్వించారు. కరెంటు పోతే అవసరం అని పెట్రొమాక్సు దీపాలు తెప్పించారు. ఇంటికంతకీ వెల్ల వేయించారు. పెరట్లోని చెట్లు సంపెంగ, మల్లెలు అన్నీ విరబూసాయి. వీటన్నింటితోనూ సువాసనలతో ఇంటికి పెళ్లి శోభ వచ్చింది.

సుజాత దర్జాగా తిరుగుతూ తాతగారితో వాదాలు వేసుకుంటూ వేణు, సుందరాలతో చిలిపి కజ్జాలు పెడుతూ మధ్య మధ్యలో పెద్ద ఆరిందాలా దీర్ఘాలుతీస్తూ పెద్దవారిని అనుకరిస్తూ హడావుడిగా తిరుగుతోంది.

హడావుడి లేనిదల్లా మాలతి మాత్రమేను. ఎప్పటిలా నిర్లిప్తంగా వుండిపోయింది. అత్తయ్యగానీ పిన్నిగానీ అప్పగించిన పని చేస్తూ చేయిస్తూ ఇంటి బాధ్యత నెత్తిమీద వేసుకున్నా అన్నింటిలో కల్పిపోక తామరాకుమీద నీటిబొట్టులా ప్రత్యేకంగా వుండి పోయింది. సుజాత దూకుడు హడావుడికూడా



ప్రస్తుతం మాలతినేం చేయనేరకపోయాయి.

ఎల్లుండి పెళ్లి అనగా బళ్ళతో పెళ్లివారు వచ్చేసారు. వెంకటలక్ష్మి అత్తవారు రుక్మిణి పుట్టింటివారు యాజులుగారి దాయాదులు అందరూ వచ్చారు. స్నాతకంకి ఊళ్లోవాళ్ళందరికీ భోజనాలు. అంతా అయ్యాక మూడు బస్సుల్లో ఊరి జనం రెండు కార్లలో ఇంటిలోవారు వెళ్లాలని ప్రయత్నం. మాలతి బట్టలూ అవీ తీసుకోలేదు దూరపు బంధువు నరసమ్మగారితో ఇంటికి కాపలాగా వుండా లని తీర్మానించుకుంది. పల్లెటూళ్ళలో ఇంటిని పట్నవాసాలలోలాగా తాళాలు పెట్టడం కష్టం.

స్నాతకం వేళకే వచ్చిన రామం సుజాతని పిల్చి మాలతి వస్తోందా కనుక్కోమన్నాడు. సుజాత కంత వరకూ మాలతి రాదేమోనన్న సందేహమే కల్గలేదు. రామం అలా అనేసరికి వెళ్లి మాలతి నడిగింది

"నువ్వే పెట్టెలో పెట్టుకున్నావు బట్ట లన్నీను?" అని.

"నే నెందుకు సర్దుకోవటం" అంది మాలతి.

"అదేం రావటంలా ?"

"వచ్చి ఏం చెయ్యాలి సుజాతా. వెనకనే ఉండాలి. అంతకంటె ఇంట్లో ఉండి ఇల్లు చూసుకోవచ్చును."

"అదేం కుదర్దు. స్వంత అన్నయ్య పెళ్లికి రాకపోవడమేమిటి ?"

అటువైపే వస్తున్న సుందరాన్నుద్దేశించి "చూడు బావా మాలతి నీ పెళ్లికి రాదుట" అంటూ ఫిర్యాదు చేసింది.

అంతవరకూ ఆ విషయం తోచని సుందరం కూడా నిశ్చేష్టుడైనాడు.

"అదేం మాలతీ ? ఎందుకు రావు ?" అంటే మాలతి మవునం పాటించింది.

వేణు సుందరం సుజాత ఎంత బలవంతం చేసినా ఇంక పెదిమ విప్పలేదు. వస్తానని అననూ లేదు వేణు కింక తాతగారితో పేచీకి మంచి ఛాన్సు దొరికింది.

"తాతగారండీ, మాలతి పెళ్లికి వస్తే పెళ్లి పందిట్లోకి రాకూడదాండీ ?" అంటూ ప్రశ్నించాడు.

రాబోయే యుద్ధ సూచనల్ని గుర్తిస్తూనే "ఎలా వస్తుందిరా ? నల్గురు పెద్దమనుష్యులుంటారా ? అందర్లోకీ ఎలా వస్తుంది ? తప్పు కదూ ?" అన్నారు.

"తప్పేవిటి ? బావ పోతే తప్పు మాలతిదా ? బావతోటే అన్నీ సమాధి అయిపోవాలా ? అన్నయ్య పెళ్లి చూడాలని వుండదా ?"

"చూడాలని వుంటుందిరా, ఎందుకుండదు ? ఏ తలుపువారగానో నిల్చుని చూస్తుంది."

"అయితే మీకు తీసుకెళ్లే ఉద్దేశం వుందన్న మాట ఫర్వాలేదు." అంటూనే మళ్లీ తిరిగి ఎందుకు సభలోకి రాకూడదూ అంటూ యుద్ధం ప్రకటించాడు. ఆ యుద్ధం ఒక గంటసేపు వాద ప్రతివాదాలతో నడిచింది. ఎవరెన్ని చెప్పినా మాలతి మాత్రం అట్టే వుండిపోయింది. పెళ్లివారితో వెళ్ళలేదు.



పెళ్ళి బాగా జరిగింది. రామానికీ, వేణుకీ, సుందరానికి కూడా అర్థంలేని పెద్దవాళ్ళ ఛాందసం వల్లే మాలతి రాలేదన్న కోపం లోలోపల వుండింది. సుముహూర్తం అయ్యాక వచ్చిన జనం చాలామంది వెళ్ళిపోయారు. సుజాత నల్లూరితో కబుర్లు చెపుతూంటే అది యాజులుగారికి కోపంవచ్చి విడిదిలోకి రాగానే మందలించారు. వేణు అప్పటికి వూరుకున్నాడు. మర్నాడు ప్రక్కవూరి జమీందారు వచ్చి, భోగం మేళం గురించి ఎత్తేసరికి వేణుకి ఆగ్రహం పట్టలేదు. తండ్రిని పిల్చి ఆ మేళం పెడితే మొగపిల్లలంతా సుందరంతో సహా వూరుకి వెళ్ళిపోతామన్నాడు.

యాజులుగారికి కోపం తారస్థాయిన వచ్చింది.

"వెధవ్వేషాలు వెయ్యకండి! మన తాహతుకి మేళం పెట్టితీరాలి పెట్టకపోతే ఎంత అవమానం పెళ్ళి ఘనంగా చేసేమని ఎవ్వరంటారు? అవ్వ! నవ్విపోతారు."

"తాతగారూ! హోదాకి తగ్గట్టు సదస్యం జరిపించండి. అంతేకాని రికార్డు డాన్సులు, భోగం మేళాలూ చస్తే పనికిరావు. వాళ్ళు అసభ్యంగా నాట్యం చేస్తూంటే, మీరనే పెద్ద మనుష్యులు చవుకగా ప్రవర్తిస్తూంటే నాకు ఒళ్ళు మండిపోతుంది."

"ఏవిట్రా ఆ మాటలు! చిన్నంతరం పెద్దంతరం లేకుండా? భామాకలాపం, మేళం లేకుండా పెద్దింటి పెళ్ళిళ్ళు జరగవు. నలుగురూ నానామాటలూ అంటారు."

"తాతగారు మాలతి పెళ్ళికి రాకుండా వుండటానికి కారణం భర్తపోయిన కారణంగా అది పూలు ముడుచుకోకూడదు. బొట్టు పెట్టుకోకూడదు. నల్లూరిలోకి రాకూడదు అనేకదా! కానీ భార్యపోయిన మనూరి రంగనాథవూవాళ్ళూ పెళ్ళి కొచ్చారు. భోగం మేళం వుంటే కుర్రకారు, పెద్దవారూ కూడా అసహ్యంగా ప్రవర్తిస్తారు. అందుకే వద్దు. మద్రాసులో ఎన్ని పెళ్ళిళ్ళు ఎంత గ్రాండుగా జరుగుతున్నాయి వాటిల్లో మేళం వుందా? మనూర్లో మాత్రం ఎందుకు? చిట్టిబాబుగారిలాంటివారి వీణకచ్చేరి పెట్టండి. బాలమురళిలాంటి వారి గాత్రకచ్చేరి పెట్టండి. మీ తాహతుకి తగ్గట్టు సంగీత కచ్చేరీలని ఏర్పాట్లు చెయ్యించండి వద్దనం. కానీ దీన్ని మేం ఎంత మాత్రం ఒప్పుకోం." అంటూ పేచీపెట్టాడు. ఈ గొడవ విన్న నల్లూరు పెద్దమనుష్యులు (?) హడావుడిగా విడిది వదిలి వెళ్ళిపోయారు. శాస్త్రి గారూ మూర్తిగారు కల్పి ఎలాగైతేనేం పిల్లల్ని సమాధానపర్చి మేళం పెట్టించారు. మేళం జరుగుతున్నంతసేపు వేణు సణుగుతూనే వున్నాడు. సుజాతతో లోపలకి వచ్చి, వాళ్ళకి తెల్సినవాళ్ళంతా ఎంతసహ్యంగా చవుకగా ప్రవర్తిస్తున్నారో వర్ణించి విసుక్కునేవాడు వీళ్ళిద్దరూ యిలా మాట్లాడుకోవడం చూసి పెద్దవారు వాళ్ళ పెళ్ళి తలపెట్టొచ్చు నన్నట్టు తృప్తిగా చూసారు వాళ్ళని.

సదస్యం బాగా జరిగింది. సదస్యంవాడు సంభావనలన్నీ జరిగాక, రామం, వేణూ కల్సి పూరికి కారులో వచ్చారు. రామానికి మాలతిని చూస్తే కడుపు తరుక్కుపోయింది. అందరూ పట్టుచీరలతో నగలతో తిరుగుతూన్న సమయాన్న ఒక్కర్తే ముసలి నరసమ్మత్తతో కూర్చుని భాగవతం చదువుతోంది. అప్పుడే రామం వేణుతో తన అభిప్రాయం చెప్పాడు.

వేణు చాలా సంతోషించాడు.

"రామం బావా! ఎలాగైనా ఈ పెళ్ళి జరిపే పూచీ నాది. తాతగారితో యుద్ధం చేసైనా తప్పకుండా ఈ పెళ్ళి చేయిస్తా. మాలతితో మాట్లాడు తాను" అన్నాడు.

"ఏవిటి మేళం విషయంలోలానా" అని పరాచికాలాడిన రామంకేసి తీక్షణంగా చూస్తూ "అది వేరే విషయం ఇది వేరే విషయం. ఇందులో ఊరుకునేది లేదు. తెలుసా?" అన్నాడు.

"ఊరికే అన్నా వేణూ. ఎలాగైనా ఈ సాయం మువ్వే చెయ్యాలి." అన్న రామానికి అభయమిచ్చాడు వేణు. నాగవల్లి అయ్యాక మూడు నిద్రలకని పెళ్ళివారంతా యాజులుగారింటికి వచ్చారు. వెంకటేశ్వర దీపారాధన, సత్యనారాయణ వ్రతం అయ్యాక వచ్చిన చుట్టాలందర్నీ చీరచావులు బహుమతులు ఇచ్చి పంపారు. మద్రాసు వారూ, కలకత్తావారూ కూడా వెళ్ళిపోయారు. ఒక్క వేణూ, రామాలు వుండిపోయారు. మణుగుడుపులయి జానకి, సుందరాలు మళ్ళీ వచ్చేసారు. ఇల్లు కాస్త సందడిగా వుండింది. మాలతి జానకితో కాస్త మాట్లాడ్డం ప్రారంభించింది. వదినా ఆడపడుచులు కబుర్లు చెప్పకుంటూ తిరుగుతున్నారు. ఇన్నాళ్ళకి ఆ యింటిలో తోడుదొరికిన సంతోషం మాలతి ముఖంలో స్పష్టంగా కన్పించుతోంది. ఆ ముఖంలో ఆనందపు రేఖలు చూసిన రామానికి చాలా సంతోషంగా అన్పించింది. వేణుతో మాలతి అభిప్రాయం కనుక్కోవడానికి ఇదే సమయం అని చెప్పాడు. వేణు సుందరా లిద్దరూ కూడబలుక్కుని మాలతీ, జానకీ ఒంటరిగా వుండగా వచ్చి సుందరం జానకితో కాస్త దూరంగా వెళ్ళాలనీ, ఆ సమయాన్న వేణు మాలతికి నచ్చచెప్పాలనీ పథకం వేసారు. మాలతి ఏమంటుందోనన్న భయం రామానికి లేకపోలేదు.

## 11

కలకత్తాలో అల్లర్లు జరిగినందువలన సుజాత పరీక్షలు జరగలేదు. రామం అన్నయ్య పరీక్ష లయ్యాక పెళ్ళి విషయం చూద్దాం అన్నాడుకదా అని సుజాత, శ్రీనూ లిద్దరూ కూడా వూరుకున్నారు. ఇంక ఆ ఏడాదికి పరీక్ష లుండవు అనేసరికి సుజాత ఏం చేద్దామా అన్న సందిగ్ధంలో పడింది. మెల్లగా వూరుకుందామా అనుకుని సుజాత వున్నప్పుడు ఇంట్లో సుజాతని వేణు కివ్వడమని తల్లిదండ్రు లనుకోవడం విన్న సుజాత యింక చెప్పితీరాలని నిర్ణయించుకుంది. మెల్లగా శ్రీను ఆ విషయాన్ని తండ్రితో చెప్పాడు. తండ్రి మౌనంగా వుండిపోయాడు కానీ తల్లి మాత్రం నానారభసా చేసింది

సుజాత ససేమిరా వేణుని పెళ్ళాడనంది వేణు, సుందరంలు కూడా తనకి శ్రీను, రామాల లాగేను అంది. సుజాత తల్లి యాజులుగారికి సుజాత గురించి వ్రాస్తూ శాపనార్థాలు పెడుతూ ముగించింది దానికి యాజులుగారు సుందరాన్ని జవాబు వ్రాయమన్నారు. పిల్లలెప్పుడు తల్లి శపించకూడదని వ్రాయమన్నారు. ఉపశమనంగా నాల్గుముక్కలు వ్రాయమని కొడుక్కి చెప్పారు.

విధిలేక సుజాత పెళ్ళిని అశోకుతో చేసారు సుజాత తల్లిదండ్రులు. శ్రీనుతో సుజాతని సాధిస్తూనే వుండావిడ. కానీ శ్రీనుకి బాగా తెల్సు, తల్లికి అశోకంటే ప్రాణమని. అందువల్ల ఈనాడు కాకపోతే మరోనాడైనా తప్పకుండా అశోకుని మునపటిలాగే ఆదరిస్తుందని అందువలనే తల్లి అన్న మాటల్ని చెల్లెలితో చెప్పలేదు. పెళ్ళయ్యాక సుజాత అశోకు వాళ్ళ యింటికి మ్యా ఆలీపూరుకి వెళ్ళిపోయింది. సుజాత యిలా ఎదురించిందన్న విషయమే తల్లిని ఎక్కువ బాధపెట్టింది. అశోకుని పెళ్ళాడ్డంకన్న తనని

# * * యువతరం * *

తెరమీద స్త్రీ పురుషుల బొమ్మలు ముద్దులు పెట్టుకున్నట్లు చూపటం, అర్ధనగ్న దృశ్యాలు చూపెట్టడం ఏమాత్రం యిష్టంలేదని చెపుతున్న ఆయుర్వేద వైద్య కళాశాల బి. ఏ. ఎమ్. ఎస్. వైద్య విద్యార్థి కమపర్తి భాస్వంతరావుకి తెలుగు సినిమాలంటేనే మక్కువ ఎక్కువ అని చెప్పాడు. నాటకాల్లో వేషాలు వేయటమే గాక వాటి దర్శకత్వం కూడా వహిస్తుంటాడు. చిన్నప్పట్నుంచీ



రచనలు చేస్తున్నాడని, 1965–66 గుంటూరులో కళాశాలలో జరిగిన ఒక పోటీలో తన గేయాన్ని పాడిన బృందానికి ప్రయిజు వచ్చిందని భాస్వంతరావు చెప్పాడు. రేడియోలో యువవాణిలో భాస్వంత్ గేయాలు, పాటలు అవివివిసిస్తుంటాయి. శివాజీ మీద రాసిన గేయం యీమధ్యనే బహుమతి పొందింది.

మార్పు రావాలంటాడు. అది అనివార్యమంటాడు యీ భవిష్యదాయుర్వేద వైద్యుడు. సోషలిజాన్ని సినిమాలు ప్రబోధించాలని కూడా ఇతని ఆశ. సమాజంలోను, సాహిత్యంలోను మార్పు వస్తూంది అని యింకా రావాలని కోరే యీ యువకునికి గుర్రం జాషువాగారన్నా, శ్రీశ్రీ అన్నా మక్కువ ఎక్కువ. రంగనాయకమ్మ అభిమాన రచయిత్రి. వైద్యం, కవిత్వం రెండూ తనకు ముమ్ముందు ప్రజాసేవ చేయటానికి ఉపయోగపడే ఉపకరణాలని అనుకుంటున్న యీ భాస్వంతరావు రైట్ డైరక్షన్‌లోనే వున్నాడనుకోవాలి.

[ వీరాజీ ]



## చిరుపాపల చిర్నవ్వులకోసం 'చిర్నిధి' సేవలు

విజయవాడ రైల్వే ఆసుపత్రిలో పిల్లల వార్డులో ఉన్న పది పదిహేనుమంది బాలరోగులకు చికిత్సలో భాగం కాని ఒక, 'ఆనందం' లభిస్తూంటుంది ఆ 'పాప' లందరికి చిన్న చిన్న ఆటబొమ్మలు, వారి వారి అభిరుచులను కూడా సాధ్యమైనంతవరకు గుర్తుంచుకుని పంచిపెడు తుంటారు ఇది రైల్వే ఆసుపత్రివారి ఖర్చు కాదు దీనికోసం స్వచ్ఛంద సేవాసంస్థ వుంది అది చేసే సేవ చిన్నదే దానికయ్యే వ్యయంకూడా (నెలకో 80 రూ ల నుంచి వంద) తక్కువే కానీ అది బాల రోగులకు అందించే 'నవ్వుల' విధి మాత్రం గణనీయమైంది

దీన్ని 1971 ఏప్రియల్‌లో రైల్వే వుద్యోగి జి చంద్రమౌళీశ్వరరావు అనేఆయన ప్రారంభించారు అతన్ని 1967 ప్రాంతంలో రీడర్స్ డైజస్ట్‌లో పడ్డ వ్యాసం "ఫండ్ ఫర్ స్మాల్ ప్లెజర్స్" అనేది యిందుకు ప్రభావితుణ్ని చేసింది అతని యీ 'ఆటబొమ్మల పంపిణీ' నిధికి చేయూత రైల్వే అధికార అనధికార వర్గాలనుంచి, సహచరులనుంచి కూడా లభించటంలో రోజూ యీ 'చిర్నిధి' సభ్యులొకరు పాపలకు బొమ్మలు అందజేసేటందుకు అనువుగా ఆసుపత్రిలోనే ఒక బీరువానిండా బొమ్మలు, ఆనాడున్న బాలరోగుల జాబితా ఏర్పాటు అన్నీ వున్నాయి 'బొమ్మలతో ఆడుకుంటున్న పాపల మొహంలో వెలిగే ఆనందం చూస్తే' యీ పథకం యితర ప్రాంతాలలోకూడా అనుసరణీయం అనికూడా అనిపిస్తూంది ! దీనికున్న 'నిధులు' చిన్నవేగాని బ్యాంకులోవేసి వాటిని కాపాడటం, వడ్డీ ద్వారా పెంచటం చేస్తూంటాం అని చంద్రమౌళీశ్వర రావుగారు చెప్పారు [—వీ]

ఎదురించినదన్న విషయమే ఆవిడని బాధపెట్టింది

సుజాత తండ్రి ఎప్పుడూ దేనికీ కోపం తెచ్చుకోరు ఈ ప్రపంచంలో కోపం తెచ్చుకోతగ్గ విషయాలేవీ లేవనీ తన కోపమే తన శత్రువని నమ్మే మనిషి అతను

యాజులుగారు తన మనవరాలు యిలా చేసిందన్న కోపంతో నాల్గురోజులు ఎవరితోనూ మాట్లాడలేదు కానీ రక్తసంబంధం వల్ల ఆ ముసలాయన మనవరాలు ఎక్కడున్నా సుఖపడితే చాలునని మళ్ళీ మనస్సుని సమాధానపర్చుకున్నారు కానీ పూర్వంలా సాయంత్రాలు నల్గురితో కాలక్షేపం కబుర్లు మానేసారు నుదిటి నున్న విభూతిరేకలు ఆ మనిషి నొసలు చిట్లించినపుడల్లా అది బయటకి తెలీకుండా వుంచినట్లే అతని గంభీరత అతని మనస్సులోని ఆందోళనలని దాచేసింది తండ్రి మనస్సులో ఏం బాధపడుతున్నారోనని శాస్త్రిగారు కుమిలిపోయారు ఫలానావారి మనవరాలు యిలా చేసిందంటారని తండ్రి ఏం కుమిలిపోతున్నారోనని శాస్త్రిగారు తండ్రి ఎదుటపడ్డం మానేసారు

సుందరం మాత్రం జానకితో అన్నాడు "సుజాత మాకు ఈ విషయం ఎప్పుడో చెప్పింది వేణుతో పెళ్లి నిశ్చయిస్తామని వాళ్ళు గొడవ చెయ్యకపోతే తను త్వరపడేదికాదు "

జానకికి ఈ విషయంలో సుందరంకున్న అభిప్రాయమేను తల్లిదండ్రుల మీద పగలేదు సుజాతకి కానీ మనస్సిచ్చింది గనుక పెళ్లి చేసు

## యుగసంధి

కుందామనుకుంది దానికి వాళ్ళేరో వాళ్ళని అవమానపర్చిందని ఎందుకు అనుకోవాలి ? వాళ్ళ కిష్టం లేని పని చేసిందనుకుంటే వేరేను ఏదో కావాలని పగబట్టి వారిని అవమానపర్చిందనుకోవడం అనవసరమని యిద్దరూ అనుకున్నారు

వేణు, మాలతి పారిజాతాలు గుచ్చుతున్నపుడు వచ్చి, మాలతితో మాట్లాడాలని అడిగాడు మాలతి ఏమీ అర్థంగాక చూసింది

"మాలతీ ! రామంబావ ఎలాంటివాడమ్మా" అని అడిగాడు

"రామానికేమిటి అన్నయ్యా ! మంచివాడేను "

"మనస్ఫూర్తిగా అంటున్నావా ?"

"ఆ !"

"జానకిని చూస్తే నీకూ అలా పూవులు అవీ పెట్టుకోవాలని అన్పించదూ ?"

"నే పెట్టుకోకూడదుకదా !"

"పెట్టుకోకూడదు అనటం వేరు పెట్టుకోవాలనిపించడంలేదూ ?"

"పెట్టుకోకూడదు అన్నారు కనుక ఆ ఆలోచనే నాకు రాదన్నయ్యా "

అబ్బ ఎంత అమాయకురాలు ! కానీ ఈ అమాయకత ఎన్నాళ్ళు యిలా వుంటుంది ? అను కున్న వేణు అన్నాడు

"నువ్వూ జానకీ ఒకలాంటివారేకదా ! వదిన అలంకరించుకుంటూ వుంటే నీకూ అన్పించదూ ఇవాళ అన్పించకపోయినా రేపు అన్పించదని ఎలా అంటావు ?"

"ఎవరికర్మ కెవరు బాధ్యులన్నయ్యా ! ఏ పూర్వజన్మ పాపమో యీనాడు నాకిలా అయింది అందరూ ఒక్కలా ఎలావుంటారు గుడిమెట్లు రాతితోచేసినవేను గుళ్ళో దేముడివిగ్రహమూ ఆ రాతి తోనే చెయ్యబడింది అందువల్ల రెండూ ఒకటేనా దేముణ్ని పూజిస్తాం గుడిమెట్లని త్రొక్కి వెళతాం కదా పూలు అంతే కొన్ని దేముడి పూజకి వాడతాం కొన్ని రాలిపోతాయి వాటిని కాళ్ళక్రింద పడినా తొక్కుతూ వెళతాంకదా !" అంది

వేణు ఆశ్చర్యపోయాడు మాలతి తత్వ పరిశోధనకి మెల్లగా చెప్పసాగాడు

"మాలూ ! నువ్వెప్పుడూ యిలాగేవుంటే ఫర్వాలేదుగానీ, రేపెపుడయినా నీ మనస్సు వేరే దిశకి మారితే దాన్ని భరించి వేదనపడేది నువ్వు మాత్రమేను "

మాలతి అనుకుంది 'ఇప్పుడుమాత్రం నా యీ మనస్సు రామం బావని కోరటంలేదా ? ఈ సుందరం అన్నయ్య పెళ్లినాటినుంచీ నా మనస్సులో నన్నూ రామాన్ని పెళ్లి పీటలమీద వూహించు కోవటంలేదూ ? కానీ దానికి పెట్టిపుట్టవద్దా అని నన్ను నేనే సమాధానపర్చుకుంటున్నాను' అని 'నిద్రపోయే హృదయం మేల్కొంటే' అని వేణు అంటూంటే 'మేల్కొననివ్వకుండా జోల పాడు తున్నా' ననుకుంది మాలతి

వేణు "అందుకే నీకు మళ్ళీ పెళ్లి చేద్దామని

సుందరం అన్నయ్య అన్నాడు'' అని అసలువిషయం చెప్పాడు.

''వేణూ ! మీకేం పిచ్చిపట్టిందా ! నాకు పెళ్లి చేద్దామనుకున్నా చేసుకోవడానికెవరు సిద్ధ పడతారు ?'' అని ఆందోళనగా అడిగింది మాలతి.

''ఎవరో ఏమిటి ? రామమే అడిగాడు.''

**మాలతి** మనస్సు సంతోషంతో పొంగి పోయింది. కానీ అంతలోనే సందేహం.

''మీలాగే బావకూడా జాలిపడ్డాడేమో నన్నయ్యా ! ఆ జాలి జీవితాంతం వుంటుందా ?''

''జాలికొద్దీకాదు కానీ — రామానికి మొద ట్నుంచీ నువ్వంటే యిష్టం మాలతీ !'' అన్న వేణుని చూస్తూ సూటిగా అడిగింది.

''దీనికి తాతగారు ఒప్పుకుంటారా ?''

వేణు మవునంగా వుండిపోయాడు.

''మాధవి విషయం విన్న తాతగారు నన్ను పరీక్షకి కూర్చోనియ్యలేదుకదా ! అలాంటి తాతగారు ఈ పెళ్లికి ఒప్పుకుంటారా ?''

''ఒప్పుకోరు. కానీ మేం యిద్దరం ఎలాగైనా, పేచీపెట్టయినా చేయిస్తాం.''

''వద్దన్నయ్యా నాన్నగారు, తాతగారు మాధవి పెళ్లయినప్పటినుంచే అదోలాగ వున్నారు. ఆ దెబ్బనుంచి కోలుకోకుండానే సుజాత మరో దెబ్బకొట్టింది. అలాంటప్పుడు మనం మళ్ళీ ఇప్పుడు ఈ ప్రశ్నని రేపడం న్యాయంకాదు.''

''అలా అని ఎన్నాళ్ళూరుకుంటాం ? తాతగారి ప్రాణం ఆదేహంలోవున్నంతకాలంఅతనుఒప్పుకోరు.''

''అందుకని అతను పోయాక చేద్దామంటావా? అదీ న్యాయంకాదు ఎప్పుడెప్పుడా ముసలిప్రాణం పోతుందా అని కాచుక్కూర్చునట్లు వద్దు వేణూ వద్దు నా మాటవిని ఈ విషయం మర్చిపొండి''

''ఊహూ ! నేనెలాగైనా తాతగారిని ఒప్పిస్తాను''

''తాతగారు ఒప్పుకుంటే సరేను లేకపోతే వ్రాతంమాపెళ్లి జరగదు''అంది ధృడంగా మాలతి

ఈ సంభాషణంతా వెనకాలే వుండి విన్న యాజులుగారు మవునంగా తన పూజ గదిలోకి వెళ్లిన విషయాన్ని యిద్దరూ గమనించలేదు

రామం, సుందరం యిద్దరూ వచ్చి వేణుతో బాటు మాలతికి చెప్పారు, తాతగారిని ఒప్పించే బాధ్యత తమదని.

జానకి ఈ విషయం తెల్సి చాలా సంతో షించింది భర్త అన్నదే ఎరుగని మాలతి జీవితంకి దారి చూపబోతూన్న భర్తనీ, మరదినీ, రామాన్ని మనస్సులోనే [illegible]ంచింది, మాలతికి [illegible] [illegible] మాలతి, జానకి యిద్దరూ యింకా సన్నిహితులయ్యారు. **తాతగారితో** యీ విషయం ఎలా చెప్పాలా అని అందరూ ఆలో చించారు మొదట తండ్రి మందువా గదిలో వున్నపుడు చెపితే తాతగారికి ఏ ఉపోద్ఘాతమూ లేకుండా విషయం తెల్సిపోతుందని నిర్ణయించారు. తండ్రికి మాత్రం విషయాన్ని ఎలా చెప్పటమా అన్న సందేహం లేకపోలేదు.

కానీ, ఆ అవకాశం తనంతట తనే కల్పించారు శాస్త్రిగారు శాస్త్రిగారికి తెల్సినవాళ్లెవరో ఇంటిని అమ్మటానికని వచ్చారు ఆ ఇల్లు కొని బాగు చేయించి దాన్ని నర్సింగుహోముగా మార్చుదామని ప్రయత్నం మొదలెట్టారు. ఈ విషయమై తాత గారితో ఘర్షణపడ్డ వేణుని, తండ్రితో మాట్లాడ టానికి పిలిపించాడు సుందరం. వేణు మొండిగా ''మీరు మడి, ఆచారం అంటూ గొడవలుతీస్తే నేనిక్కడ వుండను. నా యిష్టప్రకారం నన్ను వుండనిస్తే నేనిక్కడ వుండి ప్రాక్టీసు పెడతాను. లేకపోతే నే మద్రాసుకే వెళ్ళిపోతాను'' అన్నాడు.

దానితో దుమారం రేగింది.

''అన్నింటిలోనూ ఇంతే మీరు. పెద్దవాళ్ళం పెద్దవాళ్ళం అని అన్నింటికీ మీ యిష్టాలనే మాకు రుద్దుతారు. ఇష్టం లేకపోయినా మీరు చెప్పిన చదువే చదవాలి. బొమ్మల పెళ్లిలా మాలతికి వయస్సు రాకుండా పెళ్లి చేసారు. అది యిప్పుడు కన్యా? వివాహితా ? దాన్ని పూలు పెట్టుకోకూడ దన్నారు. బొట్టు పెట్టుకోకూడదన్నారు పోనీ చదువైనా చెప్పించారుకాదు. ప్రయివేటుగా సుందరం అన్నయ్య చెప్పిస్తున్నా, మాధవి యిష్ట మొచ్చిన పెళ్లాడగానే, పరీక్షకి కూర్చోనియ్యలేదు. చదువూలేక వ్యాపకమూలేక అది ఎన్నాళ్ళుంటుం దిలా ?'' అని నిలదీసాడు

తండ్రి మవునంగా వుండటంతో కాస్త ధైర్యం పుంజుకొని ''పోనీ అని దానికని సంసారం వుందా అంటే అదీ లేదు. కాపురానికి వెళ్ళకుండానే బావ పోయాడుకదా ! ఏం చూసుకుని అది జీవిస్తుంది? పోనీ అని మళ్ళీ పెళ్లి చేద్దామనేనా అనుకోరు'' అంటూన్న వేణుని సగంలో ఆపేసారు శాస్త్రిగారు

''ఏమిటిరా ! వూరుకున్నకొద్దీ పేట్రేగిపోతు న్నావు. మళ్ళీ పెళ్ళా ! ఇదెవరి ఇల్లనుకున్నావు ? యాజులుగారిల్లు. వెర్రి వెర్రి వేషాలు వెయ్యక !'' అంటూ శివతాండవం చేసారు వేణు వూరుకో లేదు వూరుకోదల్చుకోలేదు

''ఏం ఎందుకని ?''

''తరతరాలుగా వస్తున్న సాంప్రదాయాలురా ! మానం మర్యాదా పరువు ప్రతిష్ట అన్నవింక వున్నాయిరా !''

''ఉన్నాయండీ !! పెద్దమావయ్య నానా తిరుగుళ్ళు తిరిగినపుడు పోలేదా ఆ మర్యాద ! సుజాత వర్ణాంతరం చేసుకున్నపుడు పోలేదా పరువు! ఆ పోయిన పరువు యింకా ఎక్కడుంటుంది ?''

''ఒరే ! నువ్విలా మాట్లాడకు. చిన్నవారు ఉద్రేకంగా తప్పులు చెయ్యడం, వాటి పరిణామాలని పెద్దవారు భరించడం. కానీ ఇది జరగకూడదురా ! జరగడానికి వీల్లేదు.''

''నాన్నగారూ ! యిది ఈ తరంలోనేకాదు — [illegible]లుగా వస్తున్నదేను. వీరేశలింగంగారు మా **తరంకాదు. మీ** తరంవారూ కాదు. తాతగారికంటె ముందుతరంవారు. ప్రతీ యుగంలోనూ చిన్నవారికీ పెద్దవారికీ అభిప్రాయ బేధాలు వస్తూనేవున్నాయి. ఇది ఈరోజు క్రొత్తకాదు.''

''పెళ్లి చేస్తామన్నా చేసుకునేవాడెవరోయ్? ఉప న్యాసాలు దంచడంకాదు. ఇప్పుడు నువ్వు చేస్తానన్నా చేసుకునేవారెవరోయ్?''అన్నారుకోపంగా శాస్త్రిగారు

''అదే తేడా నాన్నగారూ ! కబుర్లేకాదు. మేం చేతల్లోకూడా తీసిపోము. మాలక్ష్మత్తయ్యగారి రామం వున్నాడు సిద్ధంగానేను వాడు దాన్ని పెళ్లి చేసుకుంటానన్నాడు. అలా అయినా అత్తయ్య ఆత్మకి శాంతి చేకూరుతుందేమోను.''

సుందరం వచ్చి అన్నాడు.

''అవును నాన్నా ! అత్తయ్యకు మనం ఎలాగూ సాయం చెయ్యలేదుకదా...'' అంటూంటే శాస్త్రి గారు తన చేతకానితనాన్ని అందరూ వేలెత్తి చూపుతున్నారనుకుని ఉడికిపోయారు.

''అంటే మీ ఉద్దేశ్యం ?''

''అదే నాన్నగారూ ! అత్తయ్య వస్తానన్నా, రామం ఎన్ని అడిగినా మనం తీసుకురాలేదుకదా ! పోనీ అని రామం యిప్పుడు మాలతిని అడుగు తున్నాడు. అదేనా చేద్దామని'' అన్నాడు సుందరం.

రామం లోపలకి వచ్చి అన్నాడు

''మావయ్యా ! నిన్ను తప్పుబట్టటంలేదు అమ్మ కెంత ఋణం వుందో అన్నాళ్ళూ వుంది ఆ ఋణం తీరిపోయాక వెళ్లిపోయింది. మాలతిని నేను చేసుకుంటా మావయ్యా !''

''అబ్బే అది కుదరదు'' అంటున్న శాస్త్రి గార్ని చూస్తూ లోపలకి వచ్చిన యాజులుగారు ''ఎందుకు కుదరదురా ! నావల్లేకదా నువ్విలా అంటున్నావు ఆనాడూ నావల్లే మాలక్ష్మిని తెచ్చుకున్నావుకాదు ఆ బాధ నీ మనస్సులో లేదూ ! నా మనస్సూ దానికోసరం ఏడ్చిందిరా ! సంప్ర దాయం కోసరమనీ, భర్త వదిలేసిన ఆడదాన్ని లోకం లోకువ చేస్తుందనీ, నే పెదిమ విప్పలేదురా! కానీ మనస్సులో నువ్వు నన్ను ఎదురించి తీసుకొస్తా వేమో నా పిల్ల నాకు దక్కుతుందేమోనని ఎదురు చూసాను కానీ నువ్వు పిరికివాడివి. వేణుకున్న ధైర్యమే నీకుండివుంటె అది చచ్చిపోయేదికాదురా !'' అంటూన్న తండ్రిని చూస్తూ బొమ్మలా చేష్ట లుడిగి నిల్చుండిపోయారు శాస్త్రిగారు

''వేణూ ! నాయనా ! మీయిష్టమే కానీండి ఎక్కడ ఏ తిరుపతిలోనో అన్నవరంలోనో పెళ్లిచేసి తీసుకురండిరా ! ఆశీర్వదిస్తాను. కానీ కాశి ఇక్కడ మాత్రం చెయ్యమనకండి నన్నూ ఆ పెళ్లికి రమ్మనకండి పిల్లలు బాగుంటే చాలురా తండ్రీ ! బ్రతికి పచ్చగావుంటే చాలు నాయనా ! ఇంకేం కోరను. నువ్వు నీకిష్టమైతే యిక్కడే వుండు లేదా మద్రాసుకే వెళ్లిపో నే బలవంతం చెయ్యనురా శాస్త్రీ ! నాది పాతయుగం, వీళ్లది క్రొత్తయుగం మధ్యలో నీలాంటివారు నలిగిపోతారీ యుగసంధి లోను. నేను మనస్ఫూర్తిగా వప్పుకుంటున్నారా ! కావాలంటే నువ్వూ వెళ్ళు. పెళ్లి చేయించు'' అంటున్న తాతగారిని చూస్తుండిపోయారు మనవలు దిగ్భ్రమతో మాలతీ, జానకీ కూడావచ్చారు.

రామం **మాలతి చేయిని పట్టుకుని తాతగారికి** నమస్కరించాడు. ఇద్దరినీ లేవనెత్తి ఆయాస పడుతూ కళ్ళుతిరిగి పడిపోయారా ముసలాయన మాలతి హడావుడిగా మంచినీళ్లు తెచ్చింది. మడీ ఆచారం అనకుండా ఆ నీళ్లని ముఖంమీద చల్లారు శాస్త్రిగారు. కొంచెం నీళ్ళు త్రాగించింది మాలతి ముసలాయన కళ్ళుతెరిచి చూసారు అందర్నీ చూస్తూ ఏదో చెప్పబోయారు మళ్ళీ మైకం కమ్మింది. కను రెప్పలు మూతపడ్డాయి

(అయిపోయింది.)

# అల్లుడా — ఆటంకం

ఉద్దీవర్ఘుల సన్యాసిరావు

**'డ్యూటీకి పోతున్నా' కేకవేసి బయలుదేరాడుఆనందు. రెండయింది!**

కంపెనీ బస్సు రావడానికి పది నిమిషాలుంది. సిగరెట్టు కొని ముట్టించాడు.

''ఏంవోయి కొత్త పెళ్లికొడుకా ఎలాగున్నావ్'' కుశలప్రశ్నవేశాడు టెలిఫోన్ఆపరేటరు మోహనరావు.

''బాగానే వున్నానండి మీ దయవల్ల.''

'వెధవని రెండు తంతే బాగుణ్ను' అనుకున్నాడు మనసులో.

కొత్తగా పెళ్లయిన సంగతి, ఆషాఢమాసం సంగతి తెలిసే కావాలని అడుగుతున్నాడు.

'ఈడియట్.' మామగారు మరీను. మంచిరోజని ఆషాఢమాసం రావడానికి మూడురోజులు ముందుగానే తీసికొని వెళ్లిపోయారు. అత్తారి వూరు పదిహేనుమైళ్ల దూరమే అయినా వెళ్లకూడదు. లక్ష్మి వెళ్లి వారంరోజు లయింది.

మొన్న శనాదివారాలు వీక్లీఆఫ్ కద, వెళ్దా నంటే యింట్లో బామ్మ దగ్గర నుంచి చెల్లెళ్ల వరకు వార్నింగ్ వెళ్లకూడదని, వెళ్లితే ఏవేవో అనర్థాలవుతాయని. ఏమిటో ఆ అనర్థాలు చెప్పలేదు.

'ఆషాఢమాసంలో అల్లుడు, అత్తగారు ఓ గడప దాటకూడదురా ఆనందూ' అంటూ ఏవేవో ఏకరువు పెడుతుంది బామ్మ. దానికంటె పూర్తిగా అరవ సినిమా చూడ్డం నయం. ఇవాళింకా లక్ష్మి వారం. రెండురోజులు చేస్తేనేగాని వీక్లీఆఫ్ రాదు. తరువాత డే షిఫ్టు. అంతా గానుగెద్దువాటం.

''ఏంటోయి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు. అదిగో మన బస్సు.'' అనడంతో ఆనందు ఈ లోకంలో పడ్డాడు. వెంటనే మెరుపులాంటి అయిడియా వచ్చింది.

'' 'సిక్' అని మా షిఫ్టుఇంజనీరుకి చెప్పండి'' అనడం బస్సు వెళ్లిపోవడం వెంట వెంటనే జరిగాయి. తర్వాత జ్ఞాపకమొచ్చింది శలవులన్నీ అయిపోయాయని, యిది లాస్ఆఫ్ పే అవుతుందని.

'ఈ బేగ్ నీ దగ్గరుంచు.' అంటూ పాన్ షాపులో పడేసాడు.

దొండపర్తి నుంచి న్యూకాలనీ బస్స్టాపుకి వచ్చాడు.

మరో సిగరెట్టు ముట్టించాడు.

తనక్కడికి వచ్చిన పావుగంటలోను రెండు పదమూడులు వచ్చి 'ధన్ ధన్' మని శబ్దంతో కదిలాయి.

'తనక్కావలసినపుడు ఈ బస్సులు రావు!' విసుక్కున్నాడు. అంతలోనే వచ్చింది మాడుగుల బస్సు. వెంటనే బస్సు ఎక్కాడు.

బస్సు కదిలింది.

'అత్తగారు, మావగారు ఏమనుకుంటారో ఏమో ?'

'అనుకుంటే అనుకోని, మనసులోకద ఏడుస్తారు.'

'నాన్నకి తెలిస్తే ? ...'

'ఎవరేం అనుకుంటే ఏం.'

'బామ్మ అన్నట్టు తనని వాళ్ల యింట్లోకి రానిస్తారా ?''

'రానీయకేం చేస్తారు ? అల్లుడు వస్తే పొమ్మనరుగద.' అల్లుడుగా ధైర్యం తెచ్చుకున్నాడు.

సబ్బవరం దగ్గర బస్సు ఆగింది. బస్సు ఎక్కుతున్నవారితో దిగుతున్నవారితో తన బట్టలు నలిగిపోతాయేమోనని బెంగ.

ముందు సీట్లో వున్నవాళ్లకీ పట్టింపులు లేవట్లున్నాయి.

'అదృష్టవంతులు.'

'మావయ్యగారు వస్తామండి.' అంది ముందు సీట్లో కొత్తకోడలు.

'విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్.'

అదృష్టవంతులు. హనీమూన్కి వెళ్తున్నట్లున్నారు.



( 47వ పేజీ చూడండి)

"... ... ... ..."

ఏమని సంబోధించాలో తెలియక సంబోధన దగ్గర ఖాళీస్థలం పూర్తి చెయ్యకుండా ఉంచేశా.

వివాహమనేది పవిత్రమైన బంధం. కాని ఆ పదాన్ని పలకడానికి కూడా మీకు అర్హతలేదు. ఎవరికెంత ఋణానుబంధమో ఎవ్వరికీ తెలియదు మన ఋణం తీరి పోయింది అంతే. నేను ఇంగ్లీషు చదువులు చదువుకోని శుద్ధ మొద్దును కావచ్చుకాని గీతలోని ఈ శ్లోకాన్ని చూడండి.

'అభయం సత్త్వ సంశుద్ధి
జ్ఞాన యోగ వ్యవస్థితిః
దానం దమశ్చ యజ్ఞశ్చ
స్వాధ్యాయస్తప ఆర్జవమ్ !'

ఇందులో 'ఆర్జవమ్'అనే పదానికి అర్థం తెలుసుకోవాలని ఎప్పుడైనా ప్రయత్నించారా? శరీరము, మాట, మనస్సు, ఈ మూడునూ ఒకే రీతిగా వర్తించుట. అనగా త్రికరణశుద్ధి కలిగియుండుట. విష జంతువులగు సర్పాదులు వక్రస్వభావముతో ప్రవర్తించును. కావున వక్ర స్వభావముతో ప్రవర్తించు మానవులునూ విష జంతువులతో సమానులే.

నీవు శరీరము వేరు, మాట వేరు మనస్సు వేరు అన్నట్లు ప్రవర్తిస్తావు ఊసర వెల్లిగా, సమయానుకూలంగా రంగులు మారుస్తావు. అది మధ్యాంతాల మధ్య అటూ-యిటూ ఊగిసలాడుతూ స్థిరత్వంలేని నీలో నా జీవితం ముడిపడ్డందుకు సిగ్గుపడుతున్నాను.

ఆ జీవితం మీద రోత, అసహ్యం జుగుప్స కలిగి వెళ్ళిపోతున్నాను. సహజవాంఛలనే బురఖా క్రింద పెడత్రోవ పట్టావు నీవు. కాని నేను జితేంద్ర సంరక్షణలో, వాడి క్రమానుగత వికాసంలో ,వాడి పురోగతిలో పునీతురాలనవడానికి వాణ్ని తీసుకొని నీకు అందని సుదూర తీరాలకి వెళ్ళిపోతున్నా. అనవసరంగా నాకోసం వెదికించే ప్రయత్నం చెయ్యొద్దు. అభాసు పాలవగలవు.

ఇట్లు
రేఖ.

రైలు వేగాన్ని పుంజుకొన్న కొలదీ రేఖ ఆలోచనల ఒరవడీ ఎక్కువైంది. ట్రైన్ వెంబడి పరుగెత్తినట్లనిపించే చెట్లు చేమాదులు, ఎలక్ట్రిక్ స్తంభాలు, వాటితాలూకు తీగలు, వెనక్కి మళ్ళుతున్నట్లుగానే రేఖ ఆలోచనలు వెనక్కు మళ్ళాయి.



# అభిమానవతులు

వసంత

అమ్మ చల్లని ఒడిలో, ఆప్యాయాను రాగాల్ని రంగరించి పోసే కన్నతల్లి చేతిలో తండ్రిలేని లోటులేకుండా పెరిగింది.

బోలెడంత ఆస్తి, లంకంత ఇల్లు దేనికి కొదువలేదు. భార్య చచ్చిపోతే ద్వితీయం చేసుకొన్నాడని అన్న మొదటి భార్య కొడుకు రాఘవను తెచ్చి రేఖతోపాటు పెంచింది. సీతమ్మ వాళ్ళను చూసి తన రెండు కళ్ళని మురిసిపోయేది.

ఇద్దర్నీ చిన్నప్పటినుండీ 'మొగుడూ, పెళ్ళాం' అని పిలిచేవాళ్ళు మగపిల్లవాడైనా రాఘవ బయట పడేవాడుకాదు కానీ, బావను చూసినపుడల్లా పురివిప్పిన మయూరిలా రేఖ మనస్సు సంతోషంతో నాట్యం చేసేది. ఇద్దరూ కలిసి చదువుకునేవాళ్ళు, ఆడుకునేవాళ్ళు. కాసేపు బావ కనబడకపొయ్యేసరికి బెంగపెట్టుకొని తల్లడిల్లేది రేఖ.

పల్లెటూరి చదువు అయిపోయింది. ఆడపిల్లకు చదువులెందుకు లెమ్మని సీతమ్మ అనడంతో రేఖ చదువుకు ఫుల్‌స్టాప్ పడింది. రాఘవ పట్నం వెళ్ళాడు.

సెలవులు ఎప్పుడు వస్తాయా, బావను ఎప్పుడు కన్నుల నిండుగా చూస్తానా అని తహతహ లాడేది రేఖ. రావడం కొంచెం ఆలస్యమైతే ప్రేమతో కూడిన అనురాగంతో విసుగుకునేది. ముద్దుముద్దుగా ఇంతాలస్యమా రావడానికి అంటూ బుంగమూతి పెట్టేది. రేఖను సముదాయించి ప్రసన్నురాలిని చేసుకునేసరికి తలప్రాణం తోకకు వచ్చేది రాఘవకి.

సెలవులన్నీ యిట్టే అయిపొయ్యేవి. యిద్దరూ చెట్టాపట్టా లేసుకుని గట్ల వెంబడి తిరిగేవాళ్ళు. కొబ్బరి బొండాలు పాలాయిచేత కొట్టించుకొని కడుపునిండా త్రాగి సేద తీరేవాళ్ళు. ఎండాకాలమైతే ముంజిలు ఎంచక్కా తిని వచ్చేవాళ్ళు. సీతమ్మ 'అన్నాలకి లేవండ్రా' అంటే 'ఆకలి లేదంటూ' నసిగేవాళ్ళు. సుతారంగా కోపడుతున్నట్లుగానే ''అన్నాలు తినకపోతే ఎలాగ్రా ? ఇంకా చిన్న పిల్లలా మీరు గోరు ముద్దలు తినడానికంటూ' ఆప్యాయంగా కసురుకుంటూ బతిమలాడి తినిపించేది వాళ్ళిద్దరికీను.

రాఘవ సమక్షంలో కాలం ముందుకు నడుస్తున్నట్లే తెలిసేది కాదు. అంతా మైమరుపు, మైకంగా వుండేది రేఖకు.

''బావా ! బావా ! అంటూ వెన్నంటి తిరిగేది. సీతమ్మ ముసి ముసిగా నవ్వుకొని ఉల్లాసపడుతూ పైకి మాత్రం 'బావ వస్తే మాత్రం, ఒళ్ళు, గిళ్ళు తెలియదమ్మా పిల్లకి'' అనేది.

బావ వ్రాసిన వుత్తరం చూసి మురిసి పోయింది రేఖ. స్టేషను దగ్గరకు వెళ్ళడానికి సింగారించుకొని పోలయ్యను బండి కట్టమంది.

సీతమ్మ సుస్మితంగా మందలించింది రేఖను ''బావతో మునుపటిలా అంత చనువుతో తిరుగకూడదు. ఆ మూడు ముళ్ళు

పడనియ్యి. ఆ తర్వాత మీ ఇష్టం''అంటూ సిగ్గేసి లోపలికి తుర్రుమంది రేఖ. అద్దం ముందు నిలబడింది. తనలో వచ్చిన మార్పుకు తనకే ఆశ్చర్య మనిపించింది. అందమైన ఒంపులతో మలచిన పాలరాతి శిల్పంలా వున్న శరీరం, వింత కాంతుల్ని వెదజల్లుతున్న నయనాలు, శంఖంలా నిగ నిగా మెరిసే మెడ, ముద్ద మందారంలా ఉన్న చెక్కిళ్ళు, చిరు గాలికి చిందులేసే ముంగురులూ — అంత పరీక్షగా చూసుకోలేదు ఎప్పుడునూ. చైతన్య స్రవంతిలా వుంది.

బావ వచ్చేసినట్లున్నాడు ఎదురెళ్ళడానికి సిగ్గేసింది. అలాగే నిలబడింది రేఖ. ''రేఖ ఏది అత్తా!'' అంటూ రాఘవ అడుగు తుంటే రేఖ శరీరం పులకరించింది, ఆనందా తిశయం వల్ల.

రేఖ గదిలోకి వచ్చేడు రాఘవ, అతని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. ఎర్రని గులాబీలా మృదువుగా, సున్నితంగా చంద్ర బింబంలా మెరుస్తున్న గుండ్రని వదనంతో —కళ్ళు మరి త్రిప్పుకోలేకపోయ్యాడు రాఘవ.

రెప్పవాల్చకుండా తననే చూస్తుంటే రేఖ కనురెప్పలు క్రిందకు వాలాయి సిగ్గుల బరువుతో.

రాఘవ నెమ్మదిగా తడబడే అడుగులతో రేఖ దగ్గరకు వచ్చాడు. చటుక్కున వంగి ఇంద్ర ధనస్సులా వంగి ఉన్న రేఖ పెదాల్ని, తన పెదవులతో...ఆ తీయటి మధురానుభూతి హాయినిచ్చినా స్త్రీకి శీలం నిప్పుకణికలాంటిది. వ్యక్తిత్వాన్ని, నిలుపుకోవాలి. చివరికి భర్త కాబోయే బావదగ్గరైనా అంటూ అంతరాత్మ ఎదురు తిరిగేసరికి రేఖ చివాలున బావను తప్పించుకొని యివతలకి వచ్చేసింది. బావ దగ్గరకు వెళ్ళాలని ఇంకా ఏమేమో మృదు మధురపు ఆలోచనలతో తీయటి కోరికలతో శరీరం ప్రభావితమైనా మనస్సు నిదానించింది.

సీతమ్మ అడిగింది ''బాబూ ! తొందరగా ఆ రెండు అక్షింతలూ వేయించేస్తే''అంటూ

''చదువు అవనీయి అత్తా''అని వినయ విధేయతల్ని ప్రదర్శించాడు రాఘవ.

''అలాగేలే బాబూ! పెళ్ళవుతే చదువు బాగా సాగదు''అంటూ నవ్వింది సీతమ్మ. రేఖకి ఇద్దరిమీద మండుకొచ్చింది. కాని తను బయటపడేస్తే బరితెగించిన ఆడదని తనను చూసి నవ్వరూ. తనను అడగ కూడదూ ? వెంటనే 'సరే'అంటూ తలూపేది. ఎన్నాళ్ళీ విడ బాటు!... ఎందుకీతడబాటు విసుగేసింది రేఖకి.

బావ ఈసారి పట్నం వెళ్ళేటప్పుడు రేఖ కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

'పిచ్చి పిల్లా !' అంటూ ఆప్యాయంగా తల నిమిరింది సీతమ్మ.

సెలవులకు క్రమంగా ఫల్లెటూరు రావడం తగ్గించేసాడు. అమ్మగోల భరించలేక వచ్చినా ఒకటి అరా రోజాలుండి – తోచడం లేదూ, చదువుకోవాలంటూ వెళ్ళిపోయేవాడు, పెద్ద చదువు కదా, కష్టపడి చదువుకోవాలిఅంటూ సమాధానపడేది - సీతమ్మ.

ఉద్యోగంలో చేరిన రాఘవను చూసి సీతమ్మ గర్వపడింది. ఆ కళ్ళు వింతకాంతుల్ని వెదజల్లాయి గర్వాతిరేకంవల్ల.

గంభీరంగా, హుందాగా, పెద్దమనిషితనం కొట్టవస్తున్నట్టు కనపడ్డ బావను చూసి సిగ్గుపడి తలుపు చాటున నక్కింది రేఖ.

''ఏరా! ఇప్పుడైనా చేసుకుంటావా పెళ్ళి'' సీతమ్మ అడిగింది. ఏమంటాడోనన్న ఆదుర్దా, ఆందోళనతో కొంచెము ముందుకు వచ్చి చూచింది రేఖ బావవైపు.

క్రీగంట రేఖనే చూస్తూ అర్థయుక్తంగా నవ్వాడు రాఘవ. సిగ్గులమొగ్గై తూనీగలా తుర్రుమంది లోపలికి రేఖ.

సిద్ధాంతి వచ్చాడు. లగ్నాలు నిశ్చయిం చాడు. కోరుకున్న భర్త, వలపులు పండించు కునేవేళ నా జన్మ సార్థకమైనదనుకుంటూ అతని ఒడిలో వొరిగిపోయికరిగిపోయింది రేఖ.

''పట్నం కాపురం ఎప్పుడు పెడతావు బాబూ!'' అడిగింది సీతమ్మ.

''ఇప్పుడు కాదులే అత్తయ్యా! నెంకి ఇరవై రోజులు క్యాంపులో వుండాలి. అది ఒకత్తె వుండలేదు. 'చిన్నపిల్ల' '' అన్నాడు రాఘవ.

'చిన్నపిల్ల' అన్నందుకు రేఖకు చిరుకోపం వచ్చింది.

''చిందులేసే ఆ చిరుకోపమంటేనే నా కిష్టం'' అంటూ రేఖ చెవిలో గుసగుసలాడి సీతమ్మ చూడకుండా ఆ పెదాలమీద మెత్తగా ముద్రవేశాడు రాఘవ. ముడిసి పోయింది రేఖ.

పెళ్ళై నాలుగేళ్ళయింది. వారి దాంపత్య జీవనానికి చిహ్నంగా కొడుకు పుట్టాడు. వాడిని 'జితేంద్ర' 'జితేంద్ర' అంటూ అపురూపంగా చూసుకొని మురిసి పోయ్యేది రేఖ.




విశ్రాంతి పొందండి! చార్మినార్ త్రాగండి.
అచ్చమైన మేలిరకం
పొగాకుల పరిమళము
కమ్మదనం అనుభవించండి
69* పైసలకు
10
CHARMINAR
చార్మినార్
భారతదేశపు అత్యధికంగా
అమ్ముడుబోయే సిగరెట్
వి ఎస్ టి తయారీ

భర్త వచ్చినప్పుడల్లా ఖస్సు, బుస్సు మంటూ ఉండేది రేఖ. "బిడ్డ తల్లిని అయ్యాను. ఇంకా పుట్టింట్లో ఏమిటి బావా?" అంటూ. అత్తింటికి వెళ్ళి అడపా దడపా పుట్టింటికి వస్తుంటే అదొక అనిర్వచనీయమైన ఆనందము. పుట్టిన దగ్గరనుండీ, పుట్టిన ప్రాంతంలోనే వుండి ఎప్పుడో చుట్టపు చూపుగా భర్త వస్తుంటే రేఖకు చిరచిర లాడుతుండేది.

అప్పటికి గట్టిగానే అడిగేది.

"పెళ్ళైన తర్వాత భర్త దగ్గర కెళ్ళడం రివాజు అమ్మను అంటి పెట్టుకొని ఉండడం నలుగురిలో నాకు చిన్నతనంగా ఉంది"

"పిచ్చిదానా! నేను సరిగ్గా యింట్లోనే వుండను. ఒంటరిగా చంటి పిల్లవాడితో ఎలాగుంటావు చెప్పు. ఇన్నాళ్ళు ఓపిక పట్టావు. ఇంకా కొన్నాళ్ళు ఓపిక పట్టావంటే ప్రమోషన్ వస్తుంది క్యాంపు లుండవు ఇంటిపట్టున వుండవచ్చు" అప్పుడు తప్పక తీసికెళ్తా అంటూ సమాధాన పరిచాడు రాఘవ.

ఉన్నట్టుండి ఒకరోజు సీతమ్మ విరుచుకొని పడిపోయింది బ్లీడింగ్ ఎడతెరిపిలేని రక్తస్రావము. ఆ పల్లెటూరి డాక్టరు శాయశక్తులా ప్రయత్నం చేసాడు కానీ బ్లీడింగ్ కంట్రోలవలేదు. జితేంద్రను పొలాయి దగ్గర పదిరి జాగ్రత్తగా ఉండమని చెప్పి అపస్మారక స్థితిలోవున్న సీతమ్మను పట్నం తీసికెళ్ళి ఆస్పత్రిలో జాయిన్ చేసింది ఆ డాక్టరు సాయంతో.

అక్కడ డాక్టర్లు ముఖం వాచేలా చివాట్లు వేశారు. "సారం గుట్టూ, రోగం రట్టూ" అని తెలియకుండా యిదేదో

# అభిమానవతులు

మహాపరాధం అని చెప్పడం మానేస్తారు' కొంపలంటుకున్న తర్వాత పశ్చాత్తాప పడ్తారు కాని అప్పటికే పరిస్థితి చేయిజారి పోతుంది. ఎటువంటి రోగమైనా మొదట్లో జాగ్రత్తపడితే తగ్గిపోతుంది. 'ధూమ్ ధాం' అంటూనే అన్నీ తనిఖీలు చకా చకా చేశారు. కాన్సర్ సర్విక్స్ ఆఖరిస్టేజిలో వుంది. ఊపిరి తిత్తులలో కూడ సెకండరీస్ బయలుదేరాయి. బ్రతకడం కష్టం. ఉపశాంతికి మాత్రం ట్రీట్‌మెంటు యిస్తామని తేల్చి చెప్పారు.

బావ ఎడ్రస్సు కూడ సరిగ్గా తెలియదు రేఖకి. ఇన్నాళ్ళు ఆ అవసరం రాలేదు. అందుకనే తెలుసుకోలేదు తెల్పిన సీతమ్మ అపస్మారక స్థితిలో ఉంది.

సీతమ్మ మంచము దగ్గరున్న స్టూలు మీద కూర్చుంది రేఖ దిగులుగా బయటకి అలా చూస్తూ ఉండిపోయింది అయోమయంగా.

బావ అదుర్దాగా వస్తూ కనబడ్డాడు. ధైర్యంతో, సంతోషంతో రేఖ కళ్ళు మిలమిల లాడాయి.

చివాలున లేచి "బావా! బావా!" అంటూ పరుగెత్తింది అప్పుడు కాకపోతే మళ్లీ బావ జాడ తెలియదేమో అన్నంత గాభరాగా.

రేఖను చూసి ఆగాడు రాఘవ. అతని భృకుటి ముడిపడింది, రేఖను చూసిన సంతోషం అతనిలో ఛాయగానైనా లేదు. కానీ రేఖ అతని స్థితిని గమనించే పరిస్థితిలోలేదు.

అతని చేతిని గట్టిగా పట్టుకొని వార్డులోకి లాక్కుపోయింది రాఘవను.

అపస్మారకంగా పడిఉన్న సీతమ్మను చూడగానే ఉలిక్కి పడ్డాడు. చైతన్యాన్ని కోల్పోయి. మాటా మంతీ లేకుండా పడి వున్న అత్తను చూడగానే అతని అంతరంగంలో చిన్న బాధ లాంటిది కలిగింది.

"అత్తయ్యా!" అంటూ ఆర్ద్రంగా పిలిచాడు పలుకుతుందేమోనని.

"మూడు రోజులనుండి యింతే బావా!" దిగులుగా అంది రేఖ.

"ఇన్నాళ్ళ ఎందుకు ఊరుకొన్నారు?"

"చివరి దాకా నాకు తెలియదు బావా."

"డాక్టరుతో నేను మాట్లాడుతా. గాభరా పడక" అంటూ గబగబా వెళ్ళిపోయ్యాడు రేఖ ఉనికినే మరచినట్లుగా.


ఉస్సూరుమంది, రేఖ. 'కనీసం మన యింటికి వెళ్దాం. వస్తావా?' అనికూడ అడుగలేదు. "మనయిల్లు" అని అనుకోగానే రేఖ వొళ్ళు ఝల్లుమంది వింతైన అనుభూతితో.

బావ తిరిగి వచ్చేదాక ఒంటరిగా, స్పృహ తప్పి ఉన్న అమ్మదగ్గర ఉండాలంటే పిచ్చి పట్టినట్లుగా ఉంది. మనస్సు స్థిమితంగా ఉండలేదు. ఆలోచనలను రానివ్వకుండా కాసేపైనా ఉండాలని వార్డు బయటికి వచ్చింది రేఖ ప్రక్క వార్డులో బావ కనబడ్డాడు. తన కళ్లను తనే నమ్మలేక పోయింది ఆ వార్డు దగ్గిరగా వెళ్లి నిలబడింది రేఖ. బావే... నిజంగా తన బావే. అతను వెళ్లేదాకా నిశ్శబ్దంగా నిలబడింది రేఖ. బావ అర్ధగంట తర్వాత వెళ్లాడు.

బావ నిలబడిన బెడ్ దగ్గరికి తడబడే అడుగులతో వెళ్లింది రేఖ. ఒక ముసలమ్మ దిగులుగా కూర్చొని ఉంది ప్రక్కస్టూలు మీద.

"ఈమె మీకు ఏమవుతుందండీ? జబ్బేమిటి?" ఇటువంటి కుశలప్రశ్నలు హాస్పిటల్‌లో అలవాటే.

అందుకనే మామూలుగానే "నాకూతురికి ఎబార్షన్ అయింది. అప్పటికే నెత్తీ, నోరు కొట్టుకుంటూ చెప్తున్నా. ఉన్న యిద్దరు చాలు, ఇక పిల్లలెందుకని? మగ పిల్లవాడు కావాలట వంశాన్ని ఉద్ధరించాలట. చదువుకొని ఉద్యోగాలు చేస్తున్నా ఈ ఛాదస్తాలేమిటో" తన సొద వెళ్లబోసుకొంది ముసలమ్మ. పాతకాలపు మనిషైనా నవీనతలోకి తొంగి చూస్తున్నాయి ఆమె భావాలు



# అ భి మా న వ తు లు

"ఇప్పుడు వచ్చి వెళ్ళిందెవరు?"

"అల్లుడు"

"అల్లుడా? అంటే ?! "

"ఏంటలా ఆశ్చర్యపోతావు! నా కూతురి మొగుడు"

నెత్తిమీద పిడుగు పడ్డట్లైంది రేఖకి. కళ్ళు బైర్లు కమ్ముతూంటే ఇక అక్కడ నిలబడలేక గిరుక్కున వెనుతిరిగి వచ్చింది.

"అమ్మా!" అంటూ ఆక్రోశిస్తూనే అమ్మ దగ్గరికి వెళ్ళింది. నిర్జీవమైన తల్లి శరీరాన్నిచూసి కొయ్యబారిపోయింది. సీతమ్మ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయి అప్పటికే చాలసేపైంది. ఇక రేఖను ఓదార్చి సేద తీర్చేవాళ్ళు ఎవరు ?

రాఘవ వచ్చి ఓదార్చబోతే రేఖ వొళ్ళు భగ భగా మండింది. అమ్మ చితికి నిప్పు అంటిస్తూంటే వారించాలనుకుంది రేఖ. కానీ అది అమ్మ చిరకాల వాంఛ. అల్లుడి చేతుల్లో ప్రాణాలు పోవాలనీ, బూడిద అవాలనీను.

అమ్మ లేకుండా వొంటరిగా వచ్చింది, ఇంటికి తర్వాత వస్తానని చెప్పిన రాఘవను ఏవగింపుగా చూసి: బోసిగాఉన్న యింటినీ, అమాయకంగా బోసినోటి నవ్వుతో మురిపిస్తున్న జితేంద్రను చూసి గుండెలు తరుక్కుపోగా కుళ్ళి కుళ్ళి ఏడ్చింది రేఖ.

తిరిగ్గా వచ్చాడు రాఘవ. సీతమ్మ దిన వారాలు ఘనంగానే చేశాడు. ఈసారి మొండికేసింది రేఖ "నన్ను వెంట తీసికెళ్ళ"మని.

తర్వాత తీసికెళ్తానని నచ్చచెప్పపోయ్యాడు రాఘవ. కానీ ఆ ఊళ్లో పెద్దలు కూడ "అమ్మాయి బాగ దిగులేసుకొంది. పిల్లాణ్ని పెట్టుకొని ఒంటరిగా ఉండలేదు తీసికెళ్ళ మ"ని బోడి సలహా యిచ్చారు.

పల్లెటూళ్లలో ప్రతివారి సంగతీ తమకే కావాలంటూరు అని విసుక్కుంటూనే ప్రయాణం చేయించాడు రేఖను. భర్త ఇంటికి వెళ్తున్న ఆనందమే లేదు ఆమెకు. అదంతా తల్లిపోయిందనే దిగులని సరిపెట్టుకొన్నారు యిరుగు పొరుగువాళ్ళు. జీవచ్ఛవంగా గృహ ప్రవేశం చేసింది రేఖ.

హాస్పిటల్లో రేఖను చూసిన మునమ్మ బోసి నోరంతా తెరచి నవ్వుతూ "మా అల్లుడి చుట్టానివా ? మరి ఆ సంగతి నాకు చెప్పలేదే" అంటూ చంకలోని పిల్లవాణ్ణి తీసికొంది.

తదేకంగా పిల్లవాణ్ణి చూసింది లోపల పండుకొని నిద్రపోతున్న పిల్లల్ని లేపితీసుకొచ్చి ముగ్గురి ముఖాల్లోకి గుచ్చి గుచ్చి చూసిందిమునలమ్మ. ఆ ముగ్గురి పిల్లల్లోనూ రాఘవ పోలికలు కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. ఆమె ముఖం వివర్ణమైంది.

రేఖవైపు చూసింది మునలమ్మ. ఆ చూపుల వేడిని తట్టుకోలేక తలవాల్చేసింది రేఖ.

"అత్తయ్యా! వాళ్ళకి కావలసినది చూడు" అంటూ చల్లగా జారుకున్నాడు రాఘవ.

జితేంద్రను ఆడిస్తున్నారు ఆ పిల్లలిద్దరూ కలిసి. పసిహృదయాలు, కలుషితం కాని మనస్సులు వాళ్ళవి.

రేఖ చేతిని ఆప్యాయంగా పట్టుకొని వంటింట్లోకి తీసికెళ్ళిందామె. నెమ్మదిగా సంగతులన్నీ తెలుసుకొంది. తలపట్టుకొంది బాధతో.

"అమ్మాయీ ! అంటే నీ పెళ్ళికి నాలు గేళ్ళకి ముందుగానే రాఘవ, కల్యాణీ రిజిష్టరు మ్యారేజీ చేసుకొన్నారు. వాళ్ళకి చదువు కుంటున్నప్పటి నుంచీ పరిచయం. ఇప్పుడు కూడ అది రాఘవకిష్టంగా చేస్తుంది ఆ ప్రయివేటు కంపెనీలో. అప్పటికీ నేను తొందర పడవద్దని హెచ్చరించాను. ఆయన అటువంటి వారు కాదమ్మా అనేది కళ్యాణి. కళ్యాణిని చేసికొన్నప్పుడు కూడ నిన్ను ఎందుకు చేసికొన్నట్లు? మాటవరుసకైనా మాతో చెప్పలేదు మేనత్త దగ్గర పెరిగానని,మేనత్త కూతురు ఉందనీ."

రేఖ చేత బలవంతంగా ఎంగిలి చేయించిందామె. ఆమె మమతానురాగాలకి దూరమైపోయిన అమ్మ పదే పదే గుర్తుకి వచ్చింది రేఖకి.

హుషారుగా వచ్చిన కళ్యాణి సంగతంతా విని ప్రాణ్పడి పోయింది.

ఆ రాత్రి రాఘవ యింటికి రానేలేదు. ఆ వాతావరణానికి ఆడవాళ్ళిద్దరూ సర్దుబాటు చేసికొన్నాక వెళ్దామనే ఉద్దేశ్యంతో.

రాత్రంతా దీర్ఘాలోచన చేసింది కళ్యాణి.

తెల్లవారగానే రేఖ రెండు చేతులూ పట్టుకొని "ఇందులో నా పొరపాటు ఏమీ లేదు. తెల్లనివన్నీ పాలు—నల్లనివన్నీ నీళ్ళు అనుకునే నేను,రాఘవ తేనె మాటలకు మోసపొయ్యాను. రాఘవతో నా బంధాలన్నింటిని త్రెంచుకొని,

నా పిల్లల్ని తీసికొని వెళ్ళిపోతున్నా. తండ్రి లేని వాళ్ళైనా నా పిల్లలు తల్లి లేనివాళ్ళు కాదు. నీ నాడు నీవు ఆదరించు.'' అంటూ తల్లినీ, పిల్లల్నీ తీసికొని వెళ్ళిపోయింది కళ్యాణి.

రేఖ దిగ్భ్రాంతురాలైంది. ఈ సంఘటననూ, ఈ పరిణామాన్ని తను ఊహించలేదు. కళ్యాణికీ, తనకూ వాగ్యుద్ధంలాంటిది జరుగుతుందనీ, కళ్యాణిని అవమానపరిచి అవహేళన చెయ్యాలనీ, బలవంతంగానైనా సరే ఆమెను బయటికి ఈడ్చిపారెయ్యాలనీ ఎన్నెన్నో అనుకుంటూ వచ్చింది. కానీ ఇక్కడికి వచ్చాక తద్విరుద్ధంగా జరిగింది. జరిగినదానికి పశ్చాత్తాపంలాంటిది కలిగింది రేఖకి. కళ్యాణి విశిష్టవ్యక్తిత్వం, ముక్కుకి సూటిగా పొయ్యే గుణం, తను నమ్మిన బాట మీద ధైర్యంగా, సాహసంగా ముందడుగు వెయ్యడం ఎంతో నచ్చాయి రేఖకి.

కళ్యాణిపట్ల రేఖహృదయం ఆర్ద్రమైంది. తన బావ చేసిన నేరానికి యింకో స్త్రీ అవమానపడడం— మోసగింప బడడం సహించలేకపోయింది. అందుకనే తనూ, తన బిడ్డా దూరంగా వెళ్ళిపోతే కళ్యాణీ, రాఘవల మధ్య రాజీ ఏర్పడుతుందని తలచి యిల్లు వదిలేసి ప్రయాణం చేస్తుంది.

రేఖ ఉత్తరం చదవగానే, వాళ్ల ఊరు పరుగెత్తాడు రాఘవ. ఇంటికి వేసి ఉన్న పెద్ద తాళం కప్ప వెక్కిరిస్తూ కనబడింది. వాకబు చేశాడు. పొలాన్నంతా కౌలు కిచ్చేసి వెళ్ళిందని తెలిసింది. ఎక్కడ న్నదీ అడిగాడు. ఎవ్వరూ చెప్పలేక పోయారు. పాలేరు పోలయ్యను తఱచి, తఱచి అడిగాడు. ఎందుకో అతనికి తెలుసుననిపించింది రాఘవకి. ముందు తెలియదన్నాడు. గట్టిగా అడిగేసరికి ''నాకు తెలుసు బాబూ! కాని మీ లాంటి పయోముఖ విషకుంభం లాంటి వాళ్ళకి ఆ చల్లనితల్లి ఆచూకీ యిచ్చి పాపం కట్టుకోలేను. వాళ్ల ఉప్పు కారంతో పెరిగిన శరీరమన్న మమకారమే కాదు, ఆ అమ్మకి యింకా అన్యాయం జరుగుతే ప్రపంచమే తల క్రిందులవుతుందని'' అంటూ కళ్లనుండి ఉబికివస్తున్న నీటిని పైపంచతో తుడుచుకొన్నాడు పోలయ్య.

రెక్కలు కట్టుకొని కళ్యాణి దగ్గర వాలాడు రాఘవ.

''ఇలా చెప్పా పెట్టాకుండా రావడం ధర్మమేనా కళ్యాణీ. ఆలుమగల అనుబంధం అంత తేలిగ్గా తీసిపారేసే గడ్డిపోచలాంటిది కాదు కళ్యాణీ. చిన్నప్పుడే అత్తయ్య నన్ను చేరదీసి పెంచి,యింతటివాణ్నిగా తీర్చిదిద్దింది అందుకనే తల్లిలాంటి అత్తయ్య నోరువిప్పి అడిగినప్పుడు కాదనలేకపోయ్యా.''

''అంటే...ప్రేమకోసం ఒక పెళ్ళి... పెద్దల్ని తృప్తిపరచడానికి ఒక పెళ్ళా? చాల బాగుంది. కానీ పెళ్ళి అనేది మీ దృష్టిలో ఒక వ్యాపారం లాంటిది కావచ్చు. కాని నా దృష్టిలో అదొక పవిత్రమైన బంధం. నూరేళ్ళ పంట. పెద్దలు చేసినా, యువతీ యువకులు ముందంజ వేసి చేసికొన్నా అది జయప్రదం, మంగళప్రదం అవాలంటే వాళ్ళ మనస్తత్వాల్ని బట్టి గుణగణాదుల్నిబట్టీ వుంటుంది. యువతీ యువకులమధ్య తళుకు బెళుకుల ఆకర్షణలకన్నా,పరస్పర అవగాహనం, కష్టసుఖాల్లో, క్లిష్టపరిస్థితుల్లో కూడ ఒకే బాట, ఒకేమాటగా వున్నప్పుడే ఆ దాంపత్యం చిరకాలం వర్ధిల్లేది. నీవు పెళ్ళి అనే పదానికే తలవంపులు తెచ్చావు మిష్టర్ రాఘవా! అమాయకురాలైన రేఖకు అన్యాయం జరగడం నేను సహించలేను. సహించను.''

''కళ్యాణీ! రేఖ నాతో తనకున్న సంబంధ బాంధవ్యాలన్నీ తెంపుకొని వెళ్ళిపోయింది. నీవైనా నన్ను అర్థం చేసికో...ప్లీజ్...''

''నీ తేనె మాటలకు, పైమెరుగుకు, పరవశించి పోవడానికి నేను మునుపటి కళ్యాణిని కాదు ఏది ఏమైనా నా నిశ్చయాన్ని బ్రహ్మ రుద్రాదులు వచ్చినా మార్చ లేరు. అభిజాత్యం ఎక్కువగాకల మిమ్మల్ని నేను అభిలషించడంలేదు. అభిమానించలేను. మన్నించలేను. కాదుకూడదని మీరు మరీ మొండికేస్తే కోర్టుకి ఎక్కుతాను. ద్రౌపదికి అయిదుగురు భర్తలూ, శ్రీకృష్ణునికి పట్టపురాణులు ఎనిమిదిమందే కాక పదహారు వేల గోపికలూ—ఆ నాటి సాంఘిక పరిస్థితుల ప్రాబల్యం కావచ్చు. కానీ నేడు భార్య బ్రతికి ఉండగా మరొకరి మెడలో ఉరి త్రాడు బిగించడం మహా నేరం. కోర్టుకు ఎక్కిన అవమానం, అప్రదిష్ట పొందాలంటే మీ యిష్టం.'' కర్కశంగా, దృఢంగా పల్కుతున్న కళ్యాణిని, చూస నివ్వెర పొయ్యాడు రాఘవ.

నిన్నటిదాక నాగస్వరం విన్న నాగుపాములా తానన్నమాటకి అవుననే కళ్యాణీ, నేడు పడగ విప్పి బుసలు కొడుతున్న నాగుపాము. స్త్రీశక్తి ఆది శక్తి అన్నారందుకనే కాబోలు.

పారేయకండి :




## సీసాలు డబ్బాలతో పూలకుండీలు ...

'ఎస్' డబ్బా మొదలు, ఎవరెడీ డబ్బాలు, షాంపూ సీసాలదాకా ఎన్నో మనం ఎందుకూ పనికిరావనుకుని పారేస్తుంటాం. కాని వాటితో పూలకుండీలు (ఫ్లవర్‌వాజ్‌స్) చేయవచ్చును. మనం పూలకుండీగా తయారు చేసుకోదలచిన డబ్బాకు చుట్టూరా పెట్టి కుట్టడానికి చాలినంత మందపాటి పాత పూల గుడ్డను కత్తిరించండి. దాన్ని డబ్బాకి చుట్టి గుండు సూదులతో బిగించండి! సరదా వుంటే సొంతంగా ''ఫాబ్రిక్ పెయింట్స్'' లేదా వాటి మీదే ఒక డిజైన్డ్ ఫ్లవర్ చేసి వేయండి. దానిలో ప్లాస్టిక్ పూల గుత్తులు, బరువుగా నిలిచేటందుకు యిసుక పోసి మధ్యలో పూలగుత్తులను పెట్టి పేరువాలు, బల్లలా వాటి మీద పెట్టండి. బరేగా వుంటాయి. ఇలాగే రకరకాల పౌడర్స్ వచ్చే షాంపూ సీసాలు కూడా వాటి మీద కుంచెతో రంగులు డిజైన్లు వేసి వాడండి! (పిల్లలకి అందుతే ప్రమాదం.పగులగొట్టడమే కాక చేతులకు గాయాలు చేసుకుంటారు.)

— జె. పద్మ

కానీ స్టాఫ్ సమక్షంలో, పుర ప్రముఖుల సమక్షంలో తను వివాహం ఘనంగా జరిగింది. పలువురు ప్రశంసించారు తమ ఆదర్శ వివాహాన్ని. కానీ నేడు తానూ, కళ్యాణి విడిపోయ్యారంటే తనెంత అపహాస్యానికి గురి అవ్వాలి. వాళ్ళ గుసగుసలకూ, నిందలకూ తలవంచాలి. పోనీ కళ్యాణి అక్కడైనా ఉద్యోగం మానేస్తే

# పేపర్ డైరీ

**టీడబ్బులడిగితే హత్య!**

జూన్ అయిదో తేదీ రాత్రి సికింద్రాబాద్‌లోని వో టీ షాపులో బాలకృష్ణమ్మనే ఒకతను, అతని మిత్రుడు టీ తాగి హాయిగా బయలుదేరారట. టీ షాపు సొంతదారు టీ డబ్బు లొచ్చినో కేక పెట్టినా వారు వినిపించుకోలేదు సరికదా ఆయనో ముగ్గురు వ్యక్తులను వారివెంట తరిమాడట. బాలకృష్ణమ్మకు కోపం వచ్చి టీ డబ్బులడగ వచ్చిన ముగ్గురిలో 24 ఏళ్ళ షేక్‌అబ్దుల్లా అనే అతన్ని కత్తితో పొడిచి చంపి చక్కాపోయాడట.

**అవమానిస్తే హత్య!**

తనను దూషించి అవమానించావన్న కోపంలో మైసయ్యఅనే ఒకతను తన బంధువు పోచయ్యను 5వ తేదీరాత్రి నిద్రపోతుండగా పొడిచి చంపి మరీ పారిపోయాడట.

**పూర్వజన్మస్మృతి**

విశాఖ పట్నానికి చెందిన వో రైల్వేఉద్యోగి సింహాచలం అనే ఆయన కూతురు ఇరవై ఏళ్ళ సావిత్రికి ఆమె ఎనిమిదో ఏట పూర్వజన్మస్మృతి కలిగిందట. రాను రాను అది అభివృద్ధి అయి ఆమె చాలా కచ్చితంగా తన గతజన్మ వృత్తాంతం చెప్పిందట. తనపూర్వజన్మలో మురిపేపల్లి అనే గ్రామంలో పుట్టినట్టు, ఆ జన్మలో ఎనిమిదో తరగతి వరకు చదివినట్టు, 1947 లో తన పదిహేడోఏట భావిలోపడి చనిపోయినట్టూ చెప్పడమేగాక, మురిపేపల్లి తీసుకువెళ్ళి గత జన్మలో తనతల్లిని, తండ్రిని, తోబుట్టిన వారిని, తను చదువుకున్న స్కూలు, వూరు, అన్నికూడా ఎంచక్కా ఆనవాలు కట్టిందట.

**నిరాడంబర వివాహం**

చంబా గ్రామంలో పనిచేస్తున్న వో కోటీశ్వరులైన డాక్టరుగారు నలుగురు స్నేహితులతో తను పెళ్ళాడబోయిన వారింటికివెళ్ళి పెళ్ళికూతురును తీసుకు వో ఆలయానికి వెళ్ళి అక్కడ అతి నిరాడంబరంగా వివాహం చేసుకున్నారట. ఈ కోటీశ్వరుని పెళ్ళికి కేవలం ఇరవై యొక్క రూపాయేనట ఖర్చయినది. శుభం — కాని కట్నకానుకలు తీసుకోకుండా నేనుక నిన్ను జేసుకున్నానోచ్చనాకావె చెవిలో ఇల్లుగట్టుకోకుండా వుంటే అతనభినందనీయుడే!

**తలుపు తెరవగానే పొడవడమా!**

కర్నూలు కుక్కటేట్‌లో హెడ్‌క్లార్కుగా పనిచేస్తున్న నరసింగరావు అనే ఆయన కుమారుడు 22 ఏళ్ళ సత్యమూర్తి మే 25వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో భోంచేస్తూండగా ఎవరో వచ్చి పిలిచారట. "ఎవరదీ" అంటూ అతను వీధి తలుపు తీసేసరికి ఎవరో కొందరతన్ని పొడిచి పారిపోయారట. సత్యమూర్తి కర్నూలా సుపత్రిలో కోలుకుంటున్నట్టే కనబడి, చివరికి చని పోయాడట.

**రంగుల కళ్ళద్దాలు కళ్ళకే చెరుపా!**

ఎండకు భయపడి కళ్ళను కాపాడుకోవాలనే తాపత్రయంతోగాని, లేక ఫ్యాషను కోసం గాని రంగు కళ్ళజోళ్ళను పెట్టుకునే వారు నిజంగా తమ కళ్ళను తామే శక్తి కొద్దీ పాడు చేసుకుంటున్నారని న్యూయార్కుకు చెందిన "పీటర్ విజన్ ఇన్‌స్టిట్యూట్" డైరెక్టరు లారెన్స్ ఆసెన్ అన్నారట. బజారులో కంటికి అందంగా కనపడిన కళ్ళజోడు కొనుక్కొని రూపాన్ని తగిలించుకు తిరగడం వల్ల తలనొప్పి, కళ్ళు పీకుట, కళ్ళ నుంచి నీరు కారుట, కళ్ళ దురద వంటివి వస్తాయట. ఈ అద్దాలు ఏ మాత్రం సూర్యరశ్మిలో నున్న ఇన్ఫ్రారెడ్‌కానీ, అల్ట్రావయిలెట్ కిరణాల నుంచి గాని కంటిని కాపాడలేవని ఆయన నిర్మొహమాటంగా అనేశారట. కళ్ళజోడు చాలా ఖరీదు పెట్టి కొన్నా ఆ ధరంతా ఫ్రేముదే అయి ఉండి, ఒక్కొక్కసారి అద్దాలు చాలాతక్కువ రకంవి ఉండవచ్చునని, కనుక కళ్ళజోడు ఎక్కువ ఖరీదుతో కొన్నంత మాత్రాన నా జోడు మాంచిదోచ్చనుకోరాదనీ, కూడా ఆయన హెచ్చరించాడట. ఏ జోడూ లేకుండా కళ్ళను అలానే వదిలేయడం మంచిదని, ఎండ కళ్ళ మీదట్ట రాకుండా చూసుకోవడం, కళ్ళకు పనిలేనప్పుడు కళ్ళు మూసుకొని కళ్ళకు విశ్రాంతి నివ్వడం చాలా మంచి పద్ధతి అని ఆ ఇన్‌స్టిట్యూట్ అభిప్రాయపడ్డదట. ఒక వేళ కళ్ళకు జోడు పెట్టుకోదలిస్తే "గ్రే" రంగు (ఎండు గడ్డి లేకపూదా రంగనచ్చు) మంచిదనీ, ఇంద్రధనుస్సు వంటి రంగులు, పూత ఉన్నరంగులు మంచివిఎంతమాత్రమూ కావని కూడా యీ ఇన్‌స్టిట్యూట్ అభిప్రాయపడిందట. ఇట్స్ టైమ్ టు చేంజ్యువర్ గ్లాసెస్!

**నీటి కరువు.**

కొత్తగూడెంలో నీటి కరువు శృతి మించిందట. మణుగూరులో పనిచేసే వో కార్మికుడు, గనులో పనిచేసే కార్మికుడొకడు సరి అయిన సమయానికి కనీసం గుక్కెడు మంచినీళ్ళు దొరకనందువల్ల చనిపోయారట. మణుగూరు ప్రజలు నీళ్ళ కోసం ఎనిమిది కిలో మీటర్లు వెళ్ళాల్సి వస్తోందట, తెచ్చే నీరు దార్లోనే తాగెయ్యాల్సి రావడా ఆ ఎండకు!

**విమానం మసి అయినా ...**

12వ తేదీ రాత్రి రెండున్నర గంటలకు బొంబాయి శాంతాక్రజు విమానాశ్రయం నుంచి ఝూమ్మని ఎగరబోయిన ఎయిర్ ఫ్రాన్స్ విమానం బోయింగ్ 747 టైరుపగిలి అంతతో-

## అభిమానవతులు

తను తలెత్తుకొని తిరుగగలడు. కావాలంటే కళ్యాణి వేరేచోట ఉద్యోగానికి ప్రయత్నించవచ్చు, దానికి తను సహాయం చేయగలడు.

అదే అన్నాడు కళ్యాణితో రాఘవ.

అదోమాదిరిగా నవ్వింది కళ్యాణి. "నా జీవితంతో చెలగాట మాడావు. దాన్ని నాశనం చేశావు నా బ్రతుకు తెరువుల ప్రమేయం నీ కనవసరం. తప్పు చేయని నేను దోషిగా తల వంచుకొని పారిపోలేను. నాఆత్మధృతే నాకు రక్ష. దయచేసి వృధా ప్రసంగాలతో కాలయాపన చేయక మర్యాదగా వెళ్తే యిద్దరికీ మంచిది. కాకపోతే ఈ మిగిలివున్న మర్యాదకూడ దక్కదు." అంటూ చివ్వున ముఖాన్ని వెనక్కి త్రిప్పేసుకుంది అతన్నికి కనబడకుండా తన కన్నీరు.

హతాశుడయ్యాడు రాఘవ. కాలగమనం ఆగలేదు. ఋతువులు మారుతునే ఉన్నాయి.

ఆర్డర్సు చేత్తో పట్టుకొని హుందాగా, గంభీరంగా నడుస్తూ మేనేజరు గదిలోకి అడుగుపెట్టింది రేఖ.

కనురెప్ప వేయడం మర్చిపొయ్యాడు రాఘవ. నోటమాట రాలేదు క్షణకాలం.

ఆశ్చర్యంనుండీ, సంభ్రమంనుండీ తేరుకొన్న తర్వాత "రేఖా! ఇన్నాళ్ళు ఎక్కడ వున్నావు? నీ కోసం తపించి అలమటించాననుకో. పోనీలే ఇప్పటికైనా దయ కల్గింది నామీద. జితేంద్ర ఎలాగున్నాడు? బాగున్నాడా? ఏం చదువుతున్నాడు? వాడి ఆటపాటల్ని చూసుకొని మురిసిపొయ్యే భాగ్యం లేకుండా చేశావు." అంటూ ఆదుర్దాగా, ఆర్ద్రంగా అడిగాడు.

కానీ ఆ మాటల్ని వినిపించుకోనట్లే "సార్! ఇక్కడ క్రొత్తగా పోస్టు అయిన లేడీ క్లర్కుని" అంటూ ఆర్డర్సు కాగితాన్ని అతని ముందుంచి రాఘవతో అంతకు ముందు పరిచయం లేనట్లే ముభావంగా, ఠీవిగా, దర్పంగా నిలబడింది రేఖ.

రెంటికి చెడ్డ రేవడి అయ్యాడు రాఘవ. మనిషి అవమానంతో కుంచించుకుపొయ్యాడు. ఇంకా అక్కడే ఉండి అభాసు పాలవడం యిష్టంలేక ఉద్యోగానికి కాస్తా రాజీనామా యిచ్చేసి పారిపొయ్యాడు పాపం రాఘవ!

ఆగక, నిప్పంటుకుంటుంటూ విమానానికి. దాంతో విమాన చోదకుడు అలారమ్ (గంట) మ్రోగించ గానే మొత్తము ప్రయాణికులు 374 మంది, 18 మంది విమానానికి చెందిన పనివారూ ప్రాణాలతో బయటపడ్డారట. విమానం మాత్రం భగ్గున మండి, మసిఐపోయిందట. ప్రయాణీకుల సామానూ అంతేనట.

### రైలు, బస్సు ఢీ !

బాంగ్సాంగ్ అనే చోట 66 మంది విద్యార్థులను తీసుకు వెళుతున్న ఓ స్కూలు బస్సు రైలును తీవ్రంగా ముద్దు పెట్టుకున్నందుకు ఫలితంగా ఇరవయిమంది అక్కడకక్కడే చనిపోవడం, నలభయి మందికి పైగా గాయపడడం జరిగిందట. అనగా తప్పించుకున్న దెవరూ లేదన్న మాట. అందరికీ అంతో, ఇంతో, సొంతమో ముట్టినట్టేకదా!

### ప్రత్యక్ష సాతుర్ని మిగల్చడమే !

జూన్ 13వ తేదీన ఓ దొంగ బొంబాయి కొంబూరు ప్రాంతంలోని ఓ ఇంట్లో జొరపడి హంతకుడుగా మారి ఆ ఇంటాయనను పొడిచి చంపి, 55 ఏళ్లావిడను పీక నొక్కి చంపి, యాభయివేల కిమ్మత్తు చేసే నగా, నట్రాతో అంతర్ధానమయి పోయాడుట.

### శ్రీకృష్ణుని తమ్ముడు...

పూనాకు చెందిన నారాయణ్ అప్పాజి కులకర్ణి అనే ఒకాయన ఏడు వివాహాలు చేసుకున్నారట. ఈయన అనేక పూర్ణలలో అనేక పద్ధతుల్లో యీ ఏడు వివాహాలూ చేసుకున్నారట. అంతే గాక ఇళ్ళు యిప్పిస్తానని నమ్మినవారిని నమ్మించి మోసగించి వారి వద్ద నుంచి డబ్బు కాజేశారట. ఈ రెండు నేరాలకు గాను ఈయన్ని నిశ్చయంగా అరెస్టు చేయమనినాగపూర్ మేజిస్ట్రేట్ జూన్ పదో తేదీన వారెంటు యిచ్చారట.

# * కోడిగుడ్డు చెక్కడాలు *

కోడిగుడ్ల మీద బొమ్మలు వెయ్యటం అంటే మాటలుకాదు. ఏ మాత్రం అశ్రద్ధ వచ్చినా గుడ్డు విరిగిపోవచ్చు—చాలా జాగ్రత్త అవసరం.



ఈ రకం చిత్రలేఖనం ఆంధ్రప్రదేశ్ చిత్రకారులుకొందరు కొన్ని తరాలుగా చేస్తూ వచ్చారు. వారిలో పేరు పొందిన వారు శ్రీ వి. వి. స్వామి ఒకరు. ఈయన హైదరాబాదులోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్‌లో పని చేస్తున్నారు. ఈ కళమీద శ్రీ స్వామికి ఆసక్తి పుట్టించిన వారు వారి తండ్రి శ్రీ వెంకటేశ్వరులుగారు. ఈయన కూడా పేరు పొందిన చిత్రకారులే.



కొంచెం గోధుమ రంగు వున్న కోడి గుడ్డుని తీసుకుని దాని మీద చిన్న కత్తితో బొమ్మని చెక్కుతారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా గుడ్డు విరగవచ్చు. లేత, ముదురు రంగులు ఈ చెక్కడంవలననే ఏర్పడుతాయి. పని అయిపోయిన తరువాత కోడిగుడ్డుకి చిల్లు వేసి లోపలి సొన వగయిరాని తీసివేస్తారు ...

ఈ కళలో శ్రీ స్వామికి 10 సంవత్సరాల పయిగా అనుభవం ఉంది. వారు ఇంతవరకు శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్, డాక్టర్ గుస్తావ్‌మస్తాన్ కొస్లావియా అధ్యక్షులు, శ్రీ బ్రెజ్నేవ్ సోవియట్ నాయకులు, శ్రీ వి. వి. గిరి, శ్రీ ఎడ్వర్డ్‌హిత్ మాజీ బ్రిటిష్ ప్రధాని



శ్రీ వి. వి. స్వామి

—ఇటువంటి వారి పొగడ్తలని అందుకున్నారు.


శ్రీ స్వామి "గుడ్డు చెక్కడాలు" తెలుగు మహాసభల ప్రదర్శనలలో చూపించారు. ఆయన "మామూలు" చిత్ర పటాలు కూడా వేస్తారు. పల్లెల దృశ్యాల బొమ్మలు వెయ్యటం అంటే ఆయనకి ఇష్టం. ఈ చిత్రాలు చాలా చోట్ల ప్రదర్శింప బడినాయి.

—( ఒ. వి. )

## గేయాలు, కవితలు

క్లుప్తంగా, క్రొత్తగా, సాధ్యమయినంత తేట తెనుగులో వున్న 'కవితల'ను వేయటానికి గల అవకాశాలు ఎక్కువ కనుక రచయితలు గేయాలు పంపేటప్పుడు పై విషయాలు గుర్తుపెట్టుకోమనవి. గేయం లేదా కవితతో పాటు స్వంత చిరునామా గల కార్డు లేటప్పు—మీకు మీ రచన ఆమోదించినదీ లేనిదీ—తెలియజేయటం సాధ్యంకాదు. పరిశీలనకు ఆరువారాలు పట్టవచ్చును.

—సం.



# వారఫలం

—మహేష్—

18–7–1975 శుక్రవారం మొదలు
24–7–1975 గురువారం వరకు

**మేషం :—** మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగలదు. వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. ప్రయోజనం గల పరిచయాలు ఏర్పడతాయి. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

**వృషభం:—** వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. రావలసిన డబ్బు అందుతుంది. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. వారంఆఖరులో చికాకులు ఏర్పడతాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారంఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. బంధుమిత్రులను కలుసుకొంటారు.

**మిధునం:—** రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. పోటీవారితో మాట పట్టింపులు తగవు. ప్రయాణాలు శ్రమమీద ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో మీరు శ్రమపడినా, ఫలితం దక్కదు. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవకార్యాలు నెరవేరతాయి.

**కర్కాటకం:—** వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. మిత్రుల సహాయం లభిస్తుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. వృత్తిలో పోటీవారిపోటీ పెరుగుతుంది. ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. ఆడంబరం కోసం వ్యయం జరుగుతుంది.

**సింహం :—** స్థిరాస్థివ్యవహారాలుబాగుంటాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. ఇతరుల నిమిత్తం శ్రమకు గురికాగలరు. మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

**కన్య :—** వృత్తిలో అనుకూలవార్తలనువింటారు. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. ప్రయాణాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. సంతానానికిసౌఖ్య సంతోషాలు లభిస్తాయి. స్త్రీలకు—వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. బంధు మిత్రులను కల్సుకొంటారు.

**తుల:—** ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. వృత్తిలో పోటీవారి పోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగించగలదు. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.


**వృశ్చికం :—** ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. మీ ఆలోచనలు ఫలిస్తాయి. ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడతాయి. మిత్రులకు సహాయం చేస్తారు. సజ్జన సాంగత్యం లభిస్తుంది. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. శుభకార్యాంవిషయంలో అనుకూలత లభిస్తుంది.

**ధనుస్సు :—** వ్యతిరేకమైన వార్తలనువింటారు. వృత్తిలో శ్రమకలుగుతుంది. మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

**మకరం :—** వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. రావలసిన డబ్బు అందుతుంది. వారంమధ్యలో మీతాలూకువస్తువులు పోవచ్చును. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం ఆఖరులో నూతన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

**కుంభం :—** అన్ని వ్యవహారాల్లోను గౌరవం బాగుంటుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి.వారం ఆఖరులో కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. బంధువులు సహాయం చేస్తారు.

**మీనం:—** వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులసహాయం లభిస్తుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు ●



భోజనాలయ్యాక వంటిల్లు సర్దుకుని ఉష ఇవతలకి వచ్చేటప్పటికి భద్రయ్యకి మా గమ్మగా నిద్దర పట్టింది. మురళి పుస్తకంలా పడుకొని నిశ్చింతగా నిద్దర పోతున్నాడు. గుడ్డి దీపం వెలుతురులో సాయంత్రం మురళి గీసిన స్కెచ్ మసక మసగ్గా కనిపిస్తోంది. చాలా సేపటిదాకా ఉషకి నిద్దర పట్టలేదు. ప్రభాకరం ఏమిటి అలా అన్నాడు?...తనని చదివిస్తాడా?... నిజంగా?... అయినా అతని డబ్బుతో తను చదువుకోవడం ఏమిటి?... మనిషి చాలా మంచివాడు. ఉత్తముడు. తమ కుటుంబం అంటే సానుభూతి ఉన్నవాడు...అయితే మాత్రం?...

పక్క ఇంట్లోంచి జోలపాట నెమ్మదిగా వినిపిస్తోంది. లక్ష్మికాబోలు పిల్లాడిని నిద్రపుచ్చుతోంది. లక్ష్మి తన ఈడుదే.. నిరుడు కాబోలు పెళ్లయి అప్పుడే పండంటి పిల్లాణ్ణి ఎత్తుకుంది. అవును... వాళ్ళ నాన్న పదివేలు కట్నం కుమ్మరించాడు. పెళ్ళి అయ్యేదాకా వాళ్ళమ్మ నిద్దర పోలేదు ... కట్నం ఇయ్యగలిగిన నాన్నా, పెళ్లికి తొందరచేసే అమ్మా... లక్ష్మికున్న అదృష్టం అందరికీ ఉండొద్దూ. ప్చ్...బయట వెన్నెల కాస్తోంది... పక్కింట్లోంచి జోలపాట వినిపిస్తూనే ఉంది. ఎప్పుడు నిద్దర పట్టిందో ఉషకి తెలియదు.

## 3

"సమయానికి వొచ్చావు. రా అమ్మా. మేడమీద పట్నంనుంచి వచ్చిన పెద్ద డాక్టరూ, మన ప్రభాకరం, కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్లకి బిస్కెట్లూ యాపిల్ ముక్కలూ ఉన్న ప్లేట్లు పట్టికెళ్లి ఇయ్యి తల్లీ" అంది జోగమ్మ.

"పెద్ద డాక్టరూ! ..." ఆశ్చర్యంగా అంది ఉష.

"అదేనే అమ్మా... ఇవాళొక ఆపరేషన్ చేసి పిల్లని తియ్యవలసి వచ్చింది. ఇలా ఆపరేషన్ చెయ్యవలసి వస్తుందని నిన్ననే ఊహించి సాయంగా ఉంటాడని పెద్ద డాక్టర్ని పిలిపించాడు ప్రభాకరం."

"అహా..." ఉష కొంచెం స్థిమితపడింది.

"ఏదో ఆ వేణుగోపాలస్వామి దయవల్ల తల్లీ పిల్లా దక్కారు. పదిగంటలకి మొదలుపెట్టిన ఆపరేషను ఇప్పటికి పూర్తి అయిందట. 'ఇక ఈపూటకి భోజనం చేసేదిలేదు, మేడ మీదకి టిఫిన్ పంపించు' అని చెప్పి ఇందాకనే పభాకరం మేడమీదకి వెళ్లాడు. ఎవరో

## గా జు మే డ

(17వ పేజీ తరువాయి)

పెద్దమనిషి వచ్చినప్పుడు, టిఫిను వంటావిడ చేతో, పని మనిషిచేతో, పంపిస్తే ఏం బాగుంటుంది చెప్పు. పోనీ నేను పట్టికెళదాం అంటే ఈ మోకాళ్ల నెప్పులో ఈ మెట్లన్నీ ఎక్కలేను. ఎలాగా అని ఆలోచిస్తూంటే ఇంతలో నువ్వు వచ్చావు. కొంచెం పట్టికెళ్లి ఇయ్యి తల్లీ" అంటూ జోగమ్మ టిఫెన్ ప్లేట్లు ఉషకి అందించింది ఆలోచించుకోడానికి టైము ఇవ్వకుండా. బుజంమీద కొద్దిగా చిరిగిన జాకెట్టుని నిండుగా పైటతో కప్పుకుని, ముఖంమీద పడుతూన్న జుట్టుని వేళ్లతో వెనక్కి దువ్వుకుని ప్లేట్లు అందుకొంది ఉష.

మెట్లకి ఎదురుగుండా ఉన్న నిలువుటద్దంలో, ఉష మెట్లెక్కి పైకి వస్తున్న దృశ్యం చూసి, ఆశ్చర్య చకితుడై మాట్లాడుతున్నవాడు ఆ మట్టునే ఆగిపోయి, వెలిగించబోయిన సిగరెట్టు అలాగే పట్టుకొని ఉండిపోయాడు పట్నం నుంచి వచ్చిన పెద్ద డాక్టరు. ఆయనలా ఎందుకు హఠాత్తుగా స్తబ్ధుడైపోయాడో అర్థంకాక "ఏమిటలా ఉండిపోయారు!" అన్నాడు ప్రభాకరం.

"మీకు పెళ్లి కాలేదుగా?"

"ఊహుఁ!"

"మీ చెల్లెళ్ళు..."

"ఎవ్వరూ లేరు—నేనొక్కణ్ణే!"

"మరైతే ఈ ఏంజిల్ ... ?" — పెద్ద డాక్టరు ఆ మాట అంటూన్న సమయంలో, సరిగ్గా ఉష గదిలోకి వచ్చి టేబిల్ మీద ప్లేట్లు ఉంచబోతోంది.

ప్రభాకరం, పట్నం డాక్టరు. భావాన్ని అర్థంచేసుకుని కొద్దిగా నవ్వి "ఓ! ... ఈమె?...మా చుట్టంలెండి. మా అమ్మని అత్తయ్యా అని పిలుస్తూ ఉంటుంది" అన్నాడు.

సాభిప్రాయంగా చూసి "అంటే?" అన్నాడు డాక్టరు. ప్రభాకరం సమాధానం చెప్పలేదు. తన ఇష్టంవచ్చిన నిర్ణయానికి రావడానికి డాక్టరుకి అవకాశం కల్పించాడు. ప్లేట్లు అక్కడపెట్టి ఉష వెనక్కితిరిగింది.


"కూచో ఉషా! అన్నయ్య రాలేదా?"

ఉష తల అడ్డంగా ఊపింది.

పట్నం డాక్టరు కన్ను ఆర్పకుండా ఆమె కేసి చూస్తున్నాడు.

"వీళ్ల నాన్నగారు భద్రయ్యగారని, ఊరికంతకీ ఒకరకంగా పెద్ద. ఇంత ఆస్తి మా నాన్నగారు సంపాదించి ఇంత నిరవాకం, వ్యాపారం చేశారంటే దానికి ఆ భద్రయ్యగారే కారణం. ఒక్కక్షణం విడిచి ఉండేవారు కాదట వాళ్లిద్దరూ...చూసినవాళ్లు అన్నదమ్ములనుకొనేవారు..."

ప్రభాకరం ఇలా చెబుతూంటే డాక్టరు చెవుల్లో ఏం పడడంలేదు. అతని చూపులు ఉషని తప్పించి పక్కకి మరలడంలేదు కాస్సేపాగి "ఉషా టీ తెచ్చిపెట్టు" అన్నాడు ప్రభాకరం. ఉష కిందకి వెళ్లిపోయింది. డాక్టరు దీర్ఘంగా శ్వాసవదిలి, మౌనంగా ఉండిపోయి, ఆ తర్వాత మాట రాక రెండు యాపిల్ ముక్కలు నోట్లో వేసుకొని 'మరి వెళ్లి వస్తాను' అంటూ లేచాడు.



## గాజు మేడ

"అదేవిటి? మీరు టిఫెన్ సరిగా తీసుకో లేదు...ఉండండి...టీ తీసుకుని వెళుదురు గాని..." అంటూన్న ప్రభాకరం మాటలు వినిపించుకోకుండా, "థేంక్సు... నాకు టీ, కాఫీలు ఏం అలవాటులేదు. ఇప్పటికే లేట్ అయింది...అక్కడ నాకోసం పొద్దుటినుంచీ పేషెంట్స్ వెయిట్ చేస్తూ ఉంటారు... మరి వస్తానూ" అంటూ బయలు దేరాడు డాక్టరు.

అతనితో కలసి కిందికి వచ్చి, ఇంటికీ హాస్పటల్‌కీ మధ్యనున్న అద్దంతలుపు తెరిచి హాస్పటల్‌లోకి వెళ్ళి బయట వేచి ఉన్న అతని కారులో అతణ్ణి పట్నం పంపించివేసి, తిరిగి లోపలికి వచ్చి మేడ ఎక్కేశాడు ప్రభాకరం. అతను బట్టలు మార్చుకొని, నిలువుటద్దంలో చూసుకొనితల దువ్వుకుంటూన్న సమయంలో ఉష మేడ మీదికి వచ్చింది ట్రేలో రెండు 'టీ'లు పెట్టుకొని.

ఉషని చూసి నవ్వుతూ "పెళ్ళి నాటికని బయలుదేరిన వాడు బారసాలకి వచ్చాడట... చాలు చాల్లే...నీ 'టీ' తేవడం నువ్వూను..." అన్నాడు ప్రభాకరం.

వెంటనే ఉష కోపంగా "నన్నేం చెయ్య మంటారు! ఆ వంటావిడ 'టీ' కలిపి ఇచ్చేట ప్పటికి ఈవేళయింది" అంది "పోనీలే... ఆయ నకి కాఫీ టీలు అలవాటు లేదట...నీ చేతి 'టీ' తాగే అదృష్టం ఆయనకి లేదు...మనం ఏం చేస్తాం?... ఎలాగా రెండూ తెచ్చావు కనుక, ఇద్దరం చెరోటీ తాగుదాం...తీసుకో" అంటూ తనోటి తీసుకున్నాడు ప్రభాకరం. ఉషతీసుకో లేదు..."ఊ..."అన్నాడు... "ఉహుఁ!" "తీసుకో మంటూంటే"...ఉష ప్రభాకరం కేసి చూసింది. ప్రభాకరం నవ్వుతూ "తీసుకో ఉషా...కంపెనీ లేక పోతే, కాఫీ,టీలు రుచిగా వుండవు...నేనూ తీసుకోను అంతే!" అన్నాడు. ప్రభాకరం ఎక్కడ మానేస్తాడో అని ఉష కంగారుగా కప్పు అందుకుంది.

"ఇద్దర్నీ రమ్మంటే తను రాలేదేం ?"

"వాడికివాళేదో గోడౌను తనిఖీ ఉందట"

"మొత్తంమీద జేరాడన్నమాట అంక రాజిచ్చిన ఉద్యోగంలో"

"లేకపోతే ఎలా ?"

"ఎలా ఏవిటి ? మీ కుటుంబానికయ్యే ఖర్చంతా నేను భరిస్తాను, తనని చదువుకో మన్నాను కదా ?...చదువుకోపోతే మానె ... ఆ బొమ్మలు వెయ్యడం అయినా ప్రాక్టీసు చెయ్యొచ్చు. వచ్చి వచ్చి వాడి ప్లాన్‌లో ఇరుక్కోవడం ఏమిటి ?"

"ప్లానా ?"

"కాక ? ... ఆ రోజున చెరువు దగ్గర నలుగురు రౌడీలు నిన్ను చుట్టుముట్టడం దగ్గర్నుంచి, అంకరాజు వచ్చి నిన్ను రక్షించ డం, ఇవాళ మురళిని పిలిచి ఉద్యోగం ఇవ్వడం వరకూ, అంతా ఆ ప్లానులో భాగాలే !"

"నిజంగా ?"

"ఆఁ!...సావకాశంగా చెప్తాను కూచో" అని "రావుడూ !" అంటూ కిందకి కేకేశాడు ప్రభాకరం. "వస్తున్నా అయ్యగారూ !" అంటూ పద్దెనిమిది పందొమ్మిదేళ్ళ పిల్ల చురుగ్గా మేడమీదకి వచ్చింది. "ఈ కప్పులు పట్టుకుపో" లన్నాడు ప్రభాకరం.

రావుడు కప్పులు పట్టుకుని కిందకి దిగుతోంది.

సీతాలు హడావిడిగా మేడ మీదకి వస్తున్నాడు.

రావుడ్నిచూస్తూనే "అయ్యబాబోయ్!నిన్నె క్కడో చూసినట్టుందేమిటీ ?" అన్నాడు సీతాలు.

ఆ అరుపు విని ప్రభాకరం ఉషే కాదు, మెట్లమీద ఎదురుగా ఆగిపోయిన రావుడు కూడా ఉలిక్కిపడింది.

"నువ్వెవరు ? ఇక్కడికెందుకొచ్చావు ?" అంటూ గద్దించాడు సీతాలు.

"ఎవర్నయితే నీకేం ? ... ఈ ఇంట్లో పనికి కొత్తగా కుదిరాను...అసలు నన్నడగడా నికి నువ్వెవడివి ?"

"అయ్యబాబోయ్ ! నేనెవడ్నా ? ఎంత మాట ! ఈ ఆసుపత్రికీ, ఇంటికీ, హాలు మొత్తానికి, పోలీసు లాంటోడ్ని, నన్నా నువ్వు ఎదిరించడం ?"

"సీతాలూ" అంటూ కేకేశాడు పైనుంచి ప్రభాకరం.

"అయ్యగారు పిలుస్తున్నారు కనుక ఇప్పటికి నిన్ను వదిలేస్తున్నాను. అయినా నిన్ను నేనెక్కడ చూశాను చెప్మా?"

"ఛీ...పో...నన్నెక్కడ చూశావు ? సిని మాలో చూశావేమో"

"లమ్మో...సినిమాటారే?" అనుకుంటూ సీతాలు పైకి వెళ్ళాడు. పైటచెంగు నోటికి అడ్డం పెట్టుకుని నవ్వుకుంటూ మెట్లు

దిగేసింది రావుడు.

"ఆఁ!.. సీతాలూ ... చెప్పు ... ఆరోజు దెబ్బ తగిలిన రౌడీ ఏంచెప్పాడోనూ" అన్నాడు ప్రభాకరం...

"అయ్యబాబు!...అదా?... ఆ దొంగెదవ అంకరాజు పంపిస్తేనే వచ్చారుట ఆ రౌడీలు. ఉషని భయపెట్టండొరేయ్ ... నేను రక్షించడానికి వచ్చినట్లు వచ్చి మిమ్మల్ని కొట్టి తరుముతాను...నెమ్మదిగానే కొడతానులెండి అంటూ తలో రెండు రూపాయలూ ఇచ్చి పంపించాడట ఆ అంకరాజు...నెమ్మదిగా కొడతానని చెప్పి చర్మం పగిలేటట్లు ఎలా కొట్టాడో అంటూ వాడు ఒకటే గోల కట్టు కట్టించుకోడానికి వచ్చినప్పుడు..."

"విన్నావా ఉషా"

ఉష తెల్లబోయి అలా ఉండిపోయింది.

"మీ నాన్నగారా, లేవలేనిస్థితిలో మంచాన పడిఉన్నారు. మురళివా, ఉద్యోగంలో ఇరికించాడు ... నువ్వు ఒంటరిగా ఇంట్లో ఉన్నప్పుడు వచ్చి ఏం అఘాయిత్యం చేస్తాడో ఏమో!...అనక అనుకొని ఏం లాభం?..."

"వాడికెన్ని గుండెలుండాలి!" అంది ఉష వళ్ళంతా కోపంతో ఊగిపోతూంటే ...

"అయినా ఎందుకేనా మంచిది, సీతాలూ, నువ్వు ఉషని ఓకంట కనిపెట్టి ఉంటూ ఉండు ... తెల్సిందా ?"

"అలాగే నండి ..."

"అసలు నా సలహా ఏమిటంటే, పెళ్ళి అయ్యేదాకా ఈ పల్లెటూళ్ళో కూర్చోవడం కంటే ఏ పట్నమో వెళ్ళి హాయిగా అవకాశం ఉన్నంతవరకూ చదువుకోవడం మంచిది"

"ఎవరు? నేనా?" నవ్వింది ఉష.

ప్రభాకరం ఏదో చెప్పబోయాడు. ఇంతలో కిందనుంచి కేకలు వినిపించాయి. జోగమ్మ కాబోలు గట్టిగా ఏదో అంటోంది. ఉషా, ప్రభాకరం, సీతాలూ గబగబా మేడ దిగి వచ్చారు. వస్తూనే "ఏమైంది అమ్మా" అన్నాడు ప్రభాకరం.

"ఏమైందా ? ... ఈవిడ రేపు వంటకి రాదుట ... పోనీ కారణం పెద్దది ఏమైనా ఉందేమో అంటే ఏం లేదు. తిరువాళ్ళకి వెళ్ళాలి, వంటకి రానంటే ఎలా ?"

"పోనీలే వెళ్ళనీ అమ్మా. రేపు ఒక్కరోజుకీ ఎలాగో అలాగ సర్దుకుందాం"

"ఎలాగరా సర్దుకొనేది ? నాకా ఎడం జబ్బా, కాలూ పీకుతున్నాయి"

ప్రభాకరం నవ్వి "వచ్చేసిందా ఆ జబ్బు కూడా ? నీతో ఎలాగమ్మ ... ఇవాళ హాస్పిటల్‌లో ఎవరికి ఏ కొత్తరోగం వచ్చిందని చెప్పినా, వెంటనే ఆజబ్బు నీకు వచ్చేస్తుంది. మానసికంగా ఎంతో బలహీనత ఉంటేగాని ఇలా ప్రతివ్యాధీ నీకు అన్వయించుకోవు ... ఊ ... సరే ... మీరు వెళ్ళండి ... రేపు మీరు రాకపోతే మేమే ఎలాగో చెయ్యి కాల్చుకుంటాం ..." అన్నాడు వంటమనిషి "వెళ్ళొస్తానమ్మా" అని జోగమ్మకి చెప్పి పైట బుజంమీంచి నిండుగా కప్పుకుంటూ వెళ్ళిపోయింది.

"ఆవిడని పంపించేశావు! రేపు ఎలా గడుస్తుంది ... నావంట్లో డబ్బైత్తు ఓపిక లేదు'. అంది జోగమ్మ నీర్సంగా ...

"అ, చారూ అన్నం నేను వండుతాను సరా ?" అన్నాడు ప్రభాకరం. వెంటనే ఉష "ఎందుకు అత్తయ్యా...ఓ గంట వచ్చి నేను నాలుగూ వండి పెడతానులే !" అంది ...

"వస్తావా అమ్మా!... ఊ...షోనీ అలా చెయ్యి... ఏవిటో చేతిలో ఇలాంటి పిల్ల ఉంటే ఎంతో హాయిగా ఉండును... నట్టింట్లో కలకలా డుతూ తిరిగే ఓ ఆడ పిల్లయినాలేదు...ఏ ఇంటికేనా ఆడపిల్లలేని లోటు లోటే...చిన్నప్పుడు ఏడాదికోమాటు లీల అయినా వచ్చేది. ఇప్పుడు దాన్ని వాళ్ళ నాన్న తీసుకుపోయి ఆ ఢిల్లీలో కట్టిపడేశాడు."

"లీల ఎవరూ?" అన్నట్లు చూసింది ఉష.

"వుందిలే... మా పింతల్లి కూతురు ఒకత్తె గడుగ్గాయి" అన్నాడు ప్రభాకరం...

"అయినా ఎవళ్ళువచ్చి ఓ నెలవుంటే ఏం అయినట్టు?... ఆ సరదా తీరాలంటే, కొడుకు పెళ్ళిచేసుకోవాలి...కోడలురావాలి!... ఏరా ప్రభాకరం ఈ ఏడైనా పెళ్ళి చేసుకుంటావా?" ప్రాధేయపూర్వకంగా ప్రశ్నించింది జోగమ్మ.

"తొందర పడకమ్మా"

"ఏవిట్రా? ఇంకా ఆలోచనే! ముద్దు ముద్దుగా ముఫ్ఫై వస్తున్నాయి. ఇంకెప్పుడురా పెళ్ళి?...నేను బతికుండగా చేసుకుంటావా అని?...పోనీ ఎవళ్ళనేనా ప్రేమించావేమో చెప్పు, ఆ పిల్లనే తీసుకొచ్చి చేస్తాను..." ఉష ప్రభాకరం కేసి చూసింది "ఆ మాట ఎన్నిసారు అంటావమ్మా? నిజం చెప్పాలంటే, ఇంతవరకూ నాకు భార్యగా ఉండే అర్హతలుగల పిల్ల కనిపించలేదు" అన్నాడు ప్రభాకరం ఉష కళ్ళలోకిచూస్తూ.

"ఇంతమంది డిగ్రీలున్నవాళ్ళు, డబ్బున్నవాళ్ళు, నీతో చదువుకున్నవాళ్ళు, వందల కొద్దీ వుంటే అందులో ఒక్కత్తె, నీకు నచ్చలేదుట్రా?" బుగ్గలు నొక్కుకుంది జోగమ్మ.

ఉష కూడా ఆశ్చర్యంగా చూసింది.

ప్రభాకరం చిరాగ్గా "జీవిత భాగస్వామిని కావడానికి డిగ్రీ, డబ్బా ఇవా ముఖ్యం? వినయం, ఓర్పు, సుగుణం, సౌశీల్యం, వివేకం, విజ్ఞానం..."

"అందం, ఆకర్షణా, అంతస్తూ, అభిజాత్యం... అవున్రా?... ఇన్నివున్న పిల్ల నీకు దొరకాలి అప్పుడుకాని పెళ్ళిచేసుకోవు... ఇన్ని సుగుణాలరాశి లోకంలో వుండదు. అందువల్ల ఈ జన్మలో నీకు పెళ్ళికాదు...ఏం ఖర్మ వచ్చిందిరా...నేను గట్టిగా చెప్పలేను, చెబితే వినవు...ఆయనైతే మెడలువంచి చేసివుందురు. తనకి ఇదేం పట్టకుండా ఆ మహారాజు వెళ్ళిపోయారు ఈ బాదరబందీ అంతా నువ్వు పడు అంటూ."

నాన్న ప్రస్తావన వచ్చిందంటే ఇంక అమ్మకి టైము తెలియదు. మహం... రీ)

## గా జు మే డ

తోటి అరుగుమీద కూర్చోవడం, పదిమందికీ తీర్పులు చెప్పి అందరిచేతా ఓహో అనిపించుకోవడం, పడిపోతూవున్న స్థితిలో గాలిగోపురం అవీ బాగుచేయించి వేణుమాధవస్వామిపేర నిత్య దీపధూపనైవేద్యాల నిమిత్తం పది ఎకరాల మాగాణీ, ఈనాముగా రాసి ఇవ్వడం, ఊళ్ళో ఏ యింట్లో పురుడువచ్చినా, దంపిన పాతబియ్యం, పథ్యానికి పాత పచ్చడీ, ఆవుపాలూ అన్నీ పంపించడం. తనమీదే పంచప్రాణాలూ పెట్టుకొని తను మెడిసన్ పూర్తిచేసి వచ్చే సరికల్లా ఉన్న ఊళ్ళోనే కొడుకు ప్రాక్టీసు పెట్టాలంటూ, అటు హాస్పటల్‌కీ ఇటు ఇంటికీ సరిపడేలా పెద్ద ప్లానువేసి రెండూ అటూ ఇటూ వచ్చేలాగ ఒకేబిల్డింగ్ కట్టించడం, ఇంకా తను ప్రాక్టీసు ప్రారంభించక ముందే హఠాత్తుగా గుండెపోటువచ్చి మరణించడం...ఇలా ఒకదాని తర్వాత మరొకటిగా అన్నీ జ్ఞాపకం వచ్చి చెప్పేసి, ఆ తర్వాత కళ్ళ నీళ్ళు పెట్టుకుని, ఆ పూటకింక మనస్సంతా వికలం అయిపోయి కూర్చుంటుంది అమ్మ.

అందుకే ప్రభాకరం, మాట తప్పించడం కోసం "అయితే రేపు మనం ఉష చేతి వంట రుచి చూడబోతున్నాం అన్నమాట ! ఏం ఉషా వంట బాగా వండడం అలవాటు వుందా, లేకపోతే మొదటి ప్రయోగం, మా మీదే మొదలెడుతున్నావా?" అన్నాడు నవ్వుతూ. ఉష రుసరుసా చూసింది.

"అదేవిటిరా. . . నిక్షేపంలా వండుతుంది. రోజూ వాళ్ల నాన్నకీ అన్నయ్యకీ వండి పెట్టడం లేదూ?" అంటూ ఉషని దగ్గరగా తీసుకుని చెంపలు నిమిరి ముఖంమీద పడుతూన్న ముంగురుల్ని వెనక్కిసర్దింది జోగమ్మ. ఆవిడ తనని అలా ఆప్యాయంగా తాకేసరికి సిగ్గుతో గువ్వలా ముడుచుకుపోయి, ఒక్కమాటు ఒళ్ళు జలదరించినట్లు ఉలిక్కిపడింది. అది చూసి తనలో తను చిరునవ్వు నవ్వుకున్నాడు ప్రభాకరం.

వాలుజడలో ముద్దమందారం పెట్టుకుని, ముచ్చటగా, మరెంతో ఒద్దికగా చీర కట్టుకుని ముద్దు వస్తూన్న ఉషని చూసి "ఏ రింట్లో పడుతుందో కాని కుందనపు బొమ్మ

## గాజు మేడ

లాంటి పిల్ల...మంచి సంబంధంచూడ డానికి వాళ్ళ నాన్న తూగలేడు. కాస్త మంచీ చెడూ చూడ్డానికి వాళ్ళ అమ్మ లేదు. నీకు తెలిసిన స్నేహితుల్లో కాస్త మంచి సంబంధం ఏమైనా ఉంటే చూడరా ఉషకి''అంది జోగమ్మ.

''మంచి అంటే...? ఏది మంచో...? ఇంతకీ ఆ రాణీగారికి ఎలాంటి మొగుడు కావాలో!''అంటూ కొంటెగా చూశాడు ప్రభాకరం.

''అలాంటి మాటలు మాట్లాడితే నేను వెళ్ళిపోతానంతే 'అని గోముగా అంటూ బుంగ

> **తేడా !**
>
> లేక ...
> ఒక బ్రతుకు ఘోరం.
> చాలక ...
> ఒక జీవితం భారం.
> ఉండి ...
> ఒక మనుగడ స్వర్గం.
>
> —అలిశెట్టి ప్రభాకర్

మూతి పెట్టి తుర్రుమని పారిపోయింది ఉష.

జోగమ్మ నవ్వి ''ఏమిట్రా, పాపం దాన్ని అలా అన్నావు?... అసలే పౌరుషం అయిన పిల్ల...వాళ్ళకుటుంబం అంతా పౌరుషమైన వాళ్లే!...నేను చెప్పిన ప్రకారం వాళ్ళకి సాయం చేస్తున్నావా?''అని అడిగింది.

''ఎలాగమ్మా?...వాళ్ళసలు ఆ అవకాశం నా కివ్వటం లేందే.''

''అలా కాదు...నువ్వోకంట ఆ కుటుంబాన్ని కనిపెట్టి వుండాలి...ఈ బాధ్యత నీకు తప్పదు''అంది. ''సరేనమ్మా... నీ ఇష్టం... వెర్రి రాముడు లాంటి కొడుకు దొరికితే ఎన్ని బాధ్యతలైనా, మీద పెడతారు...మరివస్తాను అవతల పేషెంట్సు ఏం ఎదురు చూస్తున్నారో...ఓ గంట పోయాక సీతార్ని లోపలికి పంపిస్తాను. కాఫీ పెట్టి పంపించు''అంటూ మధ్యతంపు తీసుకుని హాస్పటల్‌లోకి వెళ్ళిపోయాడు ప్రభాకరం.

(ఇంకా వుంది)

## అవీ—ఇవీ—అన్నీ

### కృష్ణశాస్త్రి రచనలు

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి సన్మాన సంఘంవారు ప్రచురించిన వారి గ్రంధాలు (1) శ్రీ.ఆండాళ్ళ తిరుప్పావు (కృష్ణశాస్త్రి కీర్తనలు) వెల 8 రూపాయలు (2) ధనుర్దాసు (నాటికలు) వెల 8 రూపాయలు(3) మేఘమాల (కృష్ణశాస్త్రి సినిమా పాటలు) వెల రు. 8 లు (4) శర్మిష్ఠ (నాటికలు) రు 8 లు (5) కృష్ణపక్షము రు 8 లు (6) పల్లకీ (పద్యాలు) రు 8 లు మా కార్యాలయం చేరాయి. ప్రతులకు కృష్ణశాస్త్రి సన్మాన సంఘం(ప్రధాన కార్యాలయం) 14, సుంకురామచెట్టి స్ట్రీట్, మద్రాసు—1.

### భారతదేశంలో విప్లవం సాధ్యమా?

రచన : శ్రీ పి. నరసింహారావు, 17 పేజీలు. వెల రెండు రూపాయలు. ప్రతులకు చైతన్య పబ్లికేషన్స్, గాంధీరోడ్డు, విజయవాడ

### వందే మాతరమ్

స్వాతంత్ర్యోద్యమ చరిత్రకు కద్దు చిత్రణ. మూలం : శ్రీ శివరాము, అనువాదం: డాక్టర్ ప్రసాదరాయ కులపతి, 208 పేజీలు; వెల రు. 6—50. స్పెషలు ప్రతి రు. 8—00. ప్రతులకు : సాహిత్య నికేతన్, సంగ్రామ్ చౌక్, ఏలూరు రోడ్డు, విజయవాడ—2.

### ఆరెమ్‌సి వార్షిక సంచిక

కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజి వార్షిక సంచిక (1973—74) మా కార్యాలయం చేరింది. ఉపాధ్యక్షులు ప్రధాన సంపాదకులు డాక్టరు టి. శ్రీనివాసన్, కార్యదర్శి సంపాదకుడు శ్రీ వై. దివాకరరావు, ఈ సంచికలో వైద్య విజ్ఞానానికి సంబంధించిన చక్కని వ్యాసాలే కాకుండా కథలు, కవితలు, జోక్‌లు చదవ ముచ్చటగా, సంపాదకుడన్నట్లు ప్రయోగాల్లో కొండొకచో తలగడకి బదులుగా ఉపయోగించుకో గలిగినంత భారీగా ఉంది. కళాశాలకి సంబంధించిన ముఖ్యాంశాలు, అధ్యాపకులు, విద్యార్థి విద్యార్థినుల ఛాయా చిత్రాలను కూడా ఇందులో పొందుపరిచారు.

కాలేజి వార్షిక సంచికని ఇంత చక్కని గెటప్‌తో, చమత్కారంతో కూడిన లైటక్ లతో వెలువరించడం సంపాదకుని చాతుర్యానికి, ప్రతిభకి చక్కని నిదర్శనం. మాగజైన్ సొసైటీ కృషిని మెచ్చుకోదగినదిగా ఉంది.




Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna

ప్రభాకర్, నెల్లూరు

కష్టం అంటే ఏమిటి ?

★ మనం అనుకున్నది అనుకున్నట్లు జరక్కపోవడమే !

ఎ. ఎస్. ఆర్. కురబలకోట

మగవాళ్లకంటే తాము అధికులమని గర్వపడే స్త్రీలకు మీ సలహా ఏమిటి ?

★ అధికులమని గర్వపడకండి — సమానులమని చాటండి — అని.

జి. ఎస్. ఆర్ కోడంగల్

గడచిన మీ జీవితంలో మీరు సాధించిన ప్రగతి ఏమిటి ?

ఇరవై సంవత్సరాల కిందట — కావాలనుకున్నాయన్ని పెళ్లాడాను. చాలా ప్రగతి అనిపూరుకున్నాను.

కె. ఎస్. ఎస్. హరిపాలెం

ఒక సినిమా పాటలో జీవనదులు కృష్ణ, గోదావరి, తుంగభద్ర ఉండగా అని వుంది జీవనదులు గంగ సింధు బ్రహ్మపుత్రలు కదా !

★ మొన్నీమధ్య రచయిత్రుల సభ ముగింపు రోజున "జన గన మన గుంటూరు..." అంటూ జాతీయగీతం పాడబోయారు మాబోంట్లవారి గోల వల్ల సాగలేదు. ఎవరిష్టం వారిదిగా వుందీ రోజు. దారిగుంటల్లో నక్కల్లాగా ఎవరి ప్రాంతంలో వాళ్లే ఏలుతూ, దేశం, జాతీయతా భావం అన్న మాటే జ్ఞాపకం పెట్టుకోడంలేదు.

టి. వి. ఆర్. నెల్లూరు

ఆడదాని ఓరచూపులో — జగాన ఓడిపోని ధీరుడెవ్వరూ ?

★ లేరూ !!

టి. ఎస్. ఆర్. కరీంనగరు

మీరు ఎంతగా పురోగమిస్తున్నప్పటికి ఏ విషయంలోనూ పురుషులతో సరిపోరు...

★ అంత తొందరపడకండి — మీరే మాట మార్చుకోవలసి రావచ్చు !... ఎవరిమీద వారికంత అత్యుత్తమాభిప్రాయం చాలు — సిగ్గుతో తల వంచడానికి !

డి ఎస్. ఎస్. కరీంనగరు

ప్రేమ దైవస్వరూపం అంటారెందుకు ?

★ నిర్వచనానికి అతీతమైనది కనుక.

వి. ఆర్. హెచ్. ఎస్. కర్నూలు

భర్త చెప్పిన మాటలు వినికూడా అలా నడుచుకోలేని భార్య నెలా అర్థం చేసుకోవాలి ?

★ మీరేం చెప్పారో... దాన్నిపట్టి వుంటుంది— వినడం వినకపోవడం అన్నది. (మనలో మన మాట : తెల్లచీర కట్టుకో మల్లెపూలు పెట్టుకో అంటేనే పిల్లిగా వుంటుందీనాటి ఆడవాళ్లకి — ఇంక, 'సవితిని తెచ్చాను. కాస్త సర్దుకుపో.' 'నా జీతం నేను తాగుతాను. నీ జీతంతో యిల్లుగడుపు...' 'నా యిష్టం— నా యిష్టం వచ్చినంతమంది పిల్లల్ని కంటాను. నోరుమూసుకు కనడమే నీ విధి...' అంటూ నసపెడితే — అసహ్యంగా వుంటుంది.)

పి. ఎల్. ఎస్. శ్రీకూర్మం

ఇప్పటి విద్యార్థుల వేషభాషలు చూస్తూంటే ముందుకు వెడుతున్నామా? మొదటికి వస్తున్నామా?

★ అంత భయపడిపోకండి. ఈ వేషభాషలు శాశ్వతం కాదని మీకు వేరే చెప్పాలా ? జీవిత సుగమనానికి ప్రాతిపదికనైన విలువలు బేసిక్‌గా వున్నన్నాళ్లూ—బాహ్య రూపాలు ప్రమాదాలకిదారితియ్యవు.

వి. సి. వి. ఎల్. భద్రాచలం

మానవప్రత్యేకసంస్కృతికి ప్రతిరూపంఏమిటి?

★ నోరు నవ్వడం. నొసలు వెక్కిరించడం — ఇంకే — జంతుజాతిలో కూడా వుండదు — యిలాంటి లక్షణం !

జి. వి. ఆర్. హైదరాబాదు

మీరిచ్చే సమాధానాలే మీ స్త్రీజాతి నైతిక పతనానికి దారితీస్తే. . బాధ్యులు మీరు కాదా ?

★ ఎంత పసివాడివోయ్ ! మంత్రాలకి చింతకాయలు రాలవు మాటలకి మనుషులు మారరు ఆ మాత్రం తెలియదా నాకు ?

కె. పి. ఎస్. ఎస్. బ్రాహ్మణగూడెం

గాంధీజీ సూత్రాలలో ఒకటైన మిక్కిలి శోచనీయమైన జీవహింస అంటే మీ దృష్టిలో .

★ ఒక్క చంపడమేకాదు సాటి మనిషిని — శారీరకంగా మానసికంగా హింసించడం కూడా — జీవహింసే — అని అర్థం చెప్పుకుంటాను

కె. వి. హైదరాబాదు

ఈ రోజుల్లో ఆడాళ్లు మగవాళ్లలాగా తయారవుతున్నారు. వాళ్ళు ఉద్యోగాలు చేస్తూంటే మగవాళ్లకి ఉద్యోగాలు దొరక్క నానా యిబ్బందులకు గురి అవుతున్నారు.

★ "మీరు ఉద్యోగాల్లో వుండబట్టే యిన్నాళ్లు ఆర్థికంగా అడుగున పడిపోయి, మీ రిస్తే తిని, మానేస్తే పస్తుండి దిగజారిపోయాం అంచేత మీరు ఉద్యోగాలు మానండి మేం చేసుకుంటాం" అని స్త్రీలు అంటే మీరు సహిస్తారా ?... మీ రెండుకిలా సభ్యత లేకుండా 'మీమూలాన్నే' అంటూ ఆడిపోసుకుంటారు ? అర్థంలేని మాట.

---

బస్సు బయలుదేరింది !

పెళ్లిరోజు గుర్తుకి వచ్చింది.

బస్సు దిగ్గానే లక్ష్మికోసం వెతకటం, ఎవరికీ తెలికుండ పెరట్లో సాయంకాలం మాట్లాడుకోవడం...

తలంబ్రాలప్పుడు యిద్దరి తొందర...

'అక్కా ! పళ్లెం ఎత్తిపోసేవే' లక్ష్మి చెల్లెలు శశి తన పెళ్లప్పుడు ఏం చేయాలో నిర్ణయించుకున్నట్లుగా అనటం...

'గంటయినా పేర్లు చెప్పందే వదలం' అని అమ్మలక్కలు గుమ్మాల దగ్గర భీష్మించుకు కూచోవడం . ఇంకా యిటువంటివెన్నో గుర్తుకి వచ్చి తనలో తనే నవ్వుకున్నాడు.

వెధవ బస్సు ఈ జన్మకి చేరదుకాబోలు ఎడ్లబండి నయం.

'సంపంగిపూలండి, సంపంగిపూలు.'

'ఓ అర్ధరూపాయివి యివ్వు.'

బస్సు కదిలింది.

లక్ష్మికి ఈ పూలంటె ప్రాణం అందుకే మొదటిరోజు సంపంగిపూలు మొగలిరేకులతో పిరుదులదాకా వున్న జడ కుట్టేరు.

ధనేల్‌మని శబ్దం అయింది. టైరు బరస్టు. అంతా దిగిపోయారు.

వెధవ రూట్ బస్సులు. ఎప్పుడూ యింతే.

## అల్లుడూ — ఆటంకం

(30వ పేజీ తరువాయి)

నాలుగున్నరయింది.

ఓ అరగంటలో చేరవలసింది.

చిలకా గోరింక ఓ చెట్టుకింద చేరి కబుర్లాడుకుంటున్నారు.

అబ్బ ! ఈ చుట్టకంపు వదలదు

సిగరెట్ ముట్టించాడు.

'ఎక్కండి, ఎక్కండి. టైరు మార్చాం' క్లీనరు తొందరపెట్టాడు.

'అయిదయింది. అరగంట లేటన్నమాట.'

హమ్మయ్య మహాప్రస్థానం చేరాను.

'చోడవరం. దిగండి.' కండక్టరు కాఫీకి దిగుతూ అన్నాడు. పువ్వుల పొట్లంతో దిగాడు ఆనందు

దగ్గరున్న హోటలుకి వెళ్లి మొహం కడుక్కుని కాఫీ బిల్లిచ్చి బయటపడ్డాడు.

అక్కడికి అత్తవారిల్లు దగ్గరే అయినా ఎంతో దూరంగ వున్నట్టనిపించింది.

అనుకోకుండ తను రావడం చూసి లక్ష్మి ముఖం సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతుంది. ఈ పూలు పెట్టుకుని ఇంకా మురిసిపోతుంది.

'మొదటాట సినిమాకెళ్దాం' అంటే క్షణాల మీద రడీ అయిపోతుంది. ఇప్పటికే అయిదున్నరయింది. ఏ చీర కట్టుకుంటుందో ? యింకేది, తన కిష్టమయిన కొన్న 'ప్రేమనగర్' చీర, దాని మ్యాచ్ జాకెట్టు వేసుకుంటుంది. అప్పుడు యిద్దరం సినిమా కెళ్తూంటే వీధిలో పెళ్లికాని పిల్లలు ఈర్ష్యపడాలి. పొడుగు ఎవరా అని తర్జన భర్జనలు పడాలి.

ఆషాఢమాసం పట్టింపువున్న యుంయుం పొగుగాళ్ళు ముక్కుమీద వేలేసుకోవాలి.

గుమ్మంలో అత్తగారు ఆనందుని చూసి కాస్త గాభరాపడి లోపలికిపోయి మామగార్ని పంపించారు.

'రావోయి ఆనందు !'

కుర్చీలో కూర్చుని కళ్లతో వెతుకుతున్నాడు. మామగారి ప్రశ్నలకి జవాబిస్తూనే.

'శశీ ! అక్కతో చెప్పు బావగారు వచ్చారని.'

'పెరట్లో కెళ్లింది. రాగానే చెప్తానండి నాన్నగారు.'

'వీధి కొట్టు తాళం తీయవే శశి, లక్ష్మి పెరట్లోంచి అలా వస్తోంది' అన్న అత్తగారి కేక అర్థమయింది ఆనందుకి.

చేతిలో సంపంగిలు నవ్వాయి


శ్రీరామచిత్ర
ముత్యాల ముగ్గు
ఈస్ట్‌మన్ కలర్
కథ. మాటలు
ముళ్ళపూడి వెంకటరమణ
సంగీతం. కె. వి. మహదేవన్
కెమెరా. ఇషాన్ ఆర్య
నిర్మాత ఎమ్వీయల్
దర్శకుడు బాపు
అన్నపూర్ణా విడుదల
ALBANA
ANNAPURNA